ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో **ఒక పూర్తి పేజీ**

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-3-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 42 పేజీలు: 8+4 వెల: 6.50


**పార్లమెంటులో గ్యాస్ మంటలు**

**శశికళ పార్టీపేరు ఎఐపిటిఎంఎంకె**

5లో

# భారీగా తెలుగు కేంద్రం



శుక్రవారం అమరావతిలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశ దృశ్యం

## నీరుకొండలో రూ.119కోట్లతో ఏర్పాటు

## జల్‌జీవన్ మిషన్‌కు రూ.9,355 కోట్లు

## పోలవరం పనులకు అదనపు నిధులు

## జెఎస్‌డబ్ల్యు స్టీల్ ప్లాంట్‌కు 424 ఎకరాలు

## 28 కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం

**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 28 కీలక అజెండా అంశాలపై చర్చించి ఆమోదించారు.జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదిం చారు.జల్ జీవన్ మిషన్ ద్వారా నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. ఏపీఐఐసీకి చెందిన 75 వేల ఎకరాలను 22ఏ నుంచి తొలగించేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. నీరుకొండలో తెలుగు కల్చరల్ సెంటర్‌కు రూ.119 కోట్లకు పరిపాలనా ఆమోదం లభించింది. 5 ఎకరాల్లో 2 వేలమంది కూర్చునేలా ఆడిటోరియం నిర్మించాలని నిర్ణయించింది. మిషన్ శక్తి పథకం కింద ఆస్పత్రులు నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతి, విజయవాడ, విశాఖలో అప్పిలేట్ కార్యాలయాల ఏర్పాటుకు ఆమోదం నందిగామలో ప్రభుత్వ భూమిని కేంద్రీయ విశ్వవిద్యా లయానికి ఇచ్చేందుకు ఆమోదం లభించింది. నూజివీడులో 7 ఎకరాలు, పలాసలో 5 ఎకరాల భూమి కేంద్రీయ విశ్వవిద్యా లయానికి ఇచ్చేందుకు ఆమోదించింది. గిరిజనులు సాగుచేసే భూములకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్,90 శాతం సబ్సిడీతో స్ప్రింకర్లు ఇచ్చేందుకు ఆమోదించింది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించి నిర్ణయం తీసుకుంది. పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్సులో అదనపు గ్రానైట్ కొనుగోలు, లైనింగ్ పనులకు రూ.23.47 కోట్లు, ప్యాకేజ్64 పనులకు రూ.24.51 కోట్లు మం జూరుకు అనుమతులు ఇచ్చింది. ధవళేశ్వరం ఇరిగేషన్‌సర్కిల్‌లో అత్యవసర మరమ్మతులకు రూ.255.89 లక్షలు నిధుల మం జూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఆర్డీఏ నిర్ణయాలకు ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం రాజధాని అమరావతిలో వివిధ సంస్థలకు భూకేటాయింపుల ప్రతిపాదనల గురించి సానుకూల నిర్ణయానికి వచ్చాయి. వీటికి మంత్రి వర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. 300మంది >>2

# మరో 6 నెలల్లో స్థానిక ఎన్నికలు!



### మంత్రులు సిద్ధంగా ఉండాలన్న సిఎం చంద్రబాబు

### అభివృద్ధిని ప్రజలకు చెప్పడంలో మంత్రులు విఫలమవుతున్నారు..

### మే 15 కల్లా సాగునీరు విడుదల చేయాలి

### 16న అమరావతిలో పొట్టిశ్రీరాములు విగ్రహావిష్కరణ

**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎప్పుడు ఏ ఎన్నిక జరిగిన ఆ విజయం కూటమికే దక్కాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.రాష్ట్రంలో 20 నెలల వ్యవధిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధే మన ప్రభుత్వానికి కీలకమైన అండగా ఉంటుందని వ్యాఖ్యానించారు.స్థానిక సంస్థల ఎన్నికలు 6 నెలల్లో జరగొచ్చు, అందుకు సిద్ధంగా ఉండాలని మంత్రులతో సూచించారు. శుక్రవారం ఏపీ కేబినేట్ సమావేశం అనంతరం ఆయన మంత్రులతో పలు అంశాలపై చర్చించారు. అనేక విషయాల్లో మార్గదర్శనం చేసారుజ. వైఎస్సార్సీపీ చేసిన విధ్వంసాన్ని చెప్తూనే కూటమి ప్రభుత్వం సాధిస్తున్న ప్రగతిని ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన అన్ని ఎన్నికలల్లో మనం గెలిచామన్న చంద్రబాబు, ఎన్నిక ఏదైనా కూటమిదే గెలుపు కావాలని స్పష్టం చేశారు. పంచాయతీలు మాదిరిగానే నీటిసంఘాలు నీటిపన్నువసూలు చేయాలని మంత్రి >>2

# సమరం ముమ్మరం



టెహ్రాన్‌లో విధ్వంసం జరిగిన చోట సహాయకార్యక్రమాలలో పాల్గొంటున్న సిబ్బంది

## దుబాయ్ ఫైనాన్షియల్ సెంటర్‌పై ఇరాన్‌దాడి

## అబ్రహాం లింకన్ నౌకపైనా దాడిచేశాం: ఇరాన్

## ఇక ఇరాన్ నరకం చూస్తుంది: ట్రంప్

## కొత్త సుప్రీం కమాండర్ కోమాలో ఉన్నారంటున్న అమెరికా

**టెహ్రాన్, జెరూసలెం, మార్చి 13:** మధ్యప్రాచ్యం యుద్ధవాతావరణం మరింత ఉధృతం అవుతోంది. రోజురోజుకూ ఇరాన్, ఇజ్రాయెల్ దాడులు మరింత తీవ్రతరం అవుతున్నాయి. యుద్ధంప్రారంభించిన తర్వాత 14రోజు శుక్రవారం ఇరాన్ తన బాలిస్టిక్ క్షిపణులతో గల్ఫ్‌దేశాలపై విరుచుకుపడుతోంది. ఈ క్షిపణుల దాడులతో ఇరుగుపొరుగుదేశాలు సైరన్లు, ఇంటర్‌సెప్టార్ వ్యవస్థలను చైతన్యంచేసాయి. అమెరికా మిలిటరీ బేస్ ఉన్న ఎమిరేట్స్, బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, జోర్డాన్, ఇజ్రాయెల్‌లలో క్షిపణిదాడులతో ఇరాన్ హోరెత్తిస్తోంది. దుబాయ్ ఫైనాన్షియల్ సెంటర్‌పై ఇరాన్ క్షిపణి దాడులుచేసింది. తమ అణుస్థావరాలపై దాడులకువస్తే తాముసైతం శతృదేశాల అణు స్థావరాలపై దాడులుచేస్తామన్నారు. ఇదిలా ఉంటే అమెరికా అతిపెద్ద యుద్ధనౌక అబ్రహాం లింకన్‌పై దాడిచేసామని ఇరాన్‌ప్రకటిస్తే అమెరికా సెంట్‌కామ్ ఇరాన్ ప్రకటనను ఖండించింది. ఇప్పటికీ యుద్ధసేవల్లోనే ఉందని ఎలాంటి విఘాతం కలగలేదని తమనౌకకు సమీపంగా వచ్చిన చిన్న బోట్లను తుదముట్టించామని అమెరికా చెపుతుంటే తమ దాడులకు యుద్ధనౌక ఒమన్ జలాల్లోకి పరారయిందని ఇరాన్‌ప్రకటించింది. ఇదిలా ఉంటే అమెరికా కెసి 135 రీఫ్యూయల్ విమానం ఇరాక్ గగనతలంలోనే కూలిపోయింది. మొత్తం ఆరుగురు క్రూ సభ్యుల్లో నలుగురు చనిపోయి ఉండవచ్చని అమెరికా చెపుతోంది. ఇరాన్‌లోని టెహ్రాన్ నగరంలో జరుగుతున్న ర్యాలీపై భారీ పేలుడు సంభవించింది. అలాగే ఖజ్విన్‌లోకూడా భారీప ఏలుడు సంభవించింది. ఈ నగరాలపై దాడులు చేస్తామని >>2

# ఎఐ క్యాంపస్‌గా బిట్స్ పిలానీ

### మంత్రి లోకేశ్‌కు వివరించిన 'బిట్స్'ప్రతినిధులు

**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న బిట్స్ పిలానీ దేశంలోనే మొదటి ఏఐ క్యాంపస్‌గా ఉండబోతోందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఆ సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతో పాటు వ్యవసాయం నుంచి వాతావరణం, ఆరోగ్య సంరక్షణ వంటికోర్సులు సైతం ఇక్కడ ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి లోకేశ్‌కు వారు వివరించారు. శుక్రవారం ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసంలో ఆయనతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిట్స్ చేపట్టిన నిర్మాణ ప్లాన్లను లోకేశ్ పరిశీలించిసంతృప్తి వ్యక్తం చేశారు. సాధ్యమైనంత త్వరగా అమరావతి క్యాంపస్ ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని వారికి మంత్రి లోకేశ్ వారిని కోరారు. ఈ సందర్భంగా బిట్స్ పిలానీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏఐ, డేటా సైన్స్, రోబోటిక్స్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ తదితర కోర్సులు అమరావతి క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.రెండు దశల్లో 7వేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించేలా అమరావతి బిట్స్ పిలాని నిర్మాణాలను చేపడుతున్నామనిచెప్పారు. ఈ క్యాంపస్‌పై వచ్చే ఐదేళ్లలో రూ.1000కోట్ల పెట్టుబడి పెడతామని వారు ఈ సందర్భంగా వివరించారు.అలాగే సీఎం చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా నెక్స్ట్ జెన్ టెక్నాలజీలతో ఈ క్యాంపస్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ నిర్మాణంలో గ్రీన్ బిల్డింగ్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి పర్యావరణహిత విధానాలను పాటిస్తున్నామని తెలిపారు. బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్. చెన్నవీర్, బీఎస్ సహాని తదితరులు మంత్రి లోకేశ్‌ను కలిసిన వారిలో ఉన్నారు.








శుక్రవారం కొత్త జడ్జి లీసా గిల్ చేత ప్రమాణం చేయిస్తున్న సిజె ధీరజ్ సింగ్ ఠాకూర్

## కొత్త జడ్జిగా జస్టిస్ లీసా గిల్ బాధ్యతల స్వీకారం

**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (సిజె) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణంచేయించారు. పంజాబ్ హర్యానా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 3వ స్థానంలో కొనసాగుతుండగా, ఆమెను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఇటీవల ఆమోదం ముద్ర వేశారు. హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 2వ స్థానంలో కొనసాగుతారు. హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (సీజె) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ హైకోర్టు సీజేగా ఆస్థానంలో >>2

## ఇక 24x7 దుకాణాలు

2లో

## తిరుమల లడ్డూ వ్యవహారంపై పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు

# మాజీ డిజిపి హెచ్‌జె దొర కన్నుమూత



### నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి, నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

### ప్రగాఢ సంతాపం ప్రకటించిన తెలుగు సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, ఇతర ప్రముఖులు

**హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపి మాజీ డిజిపి హనుమంతు జగన్నాయక్ దొర (హెచ్‌జె దొర) (83) కన్నుమూశారు. ఏడాదిగా మూత్రపిండాల వ్యాధితో ఇబ్బంది పడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. పోలీసు శాఖలో తొలితరం అధికారుల్లో అగ్రగణ్యుడుగా ఆయన పేరు గడించారు. 1943లో శ్రీకాకుళంలో జన్మిం చిన దొర ఆంధ్ర యూనివర్శిటీ నుంచి ఎకనామిక్స్ లో పిజి చేశాక 1965లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఐపిఎస్‌కు ఎంపికై ఉమ్మడి >>2



# సిఇసిపై అభిశంసన!

### లోక్‌సభ స్పీకర్, చైర్మన్‌కు నోటీసులిచ్చిన విపక్షాలు

### తీర్మానంపై 193 మంది సంతకాలు

### జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే దాకా ఉద్యమిస్తాం: టిఎంసి

**న్యూఢిల్లీ, మార్చి 13:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలు అభిశంసన తీర్మానం పెట్టాలని నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి ఇటు లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా, అటు రాజ్యసభ చైర్మన్ హరివన్ష్ నారాయణ సింగ్‌కు నోటీసులు అందజేశారు. ఈనోటీసుల్లో 130 మంది లోక్‌సభ సభ్యులు, 63 మంది రాజ్యసభ సభ్యులు మొత్తం 193 మంది సభ్యులు సంతకాలు చేశారు. సిఇసి జ్ఞానేశ్‌కుమార్ ఒక నిర్దిష్ట వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, మరో ఆరు ఆరోపణలను ఆ నోటీసుల్లో ప్రస్తావించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఆరోపణలు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రధానంగా ఉంది. >>2



## తెలుగు సాహిత్యంలో విశిష్టమైనది మొల్ల రామాయణం: సీఎం

**విజయవాడ,మార్చి13 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు సాహిత్యంలో మొల్లమాంబ పాత్ర అనిర్వచనీయమైనదని సిఎం చంద్రబాబు అన్నారు. తెలుగులో తొలి రచయిత్రిగా చరిత్రకారులచే అభివర్ణించబడుతున్న మొల్ల అచ్చ తెలుగు రచయిత్రిగా ప్రసిద్ధులన్నారు. సచివాలయంలో ఆయన శుక్రవారం మొల్ల చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యంలో మొల్ల రచించిన రామాయణానికి విశిష్ట స్థానం ఉందన్నారు. ఆమె జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు.

## ఏపికి రూ.341 కోట్ల అదనపు సాయానికి కేంద్రం ఆమోదం

**విజయవాడ మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సహా ఆరు రాష్ట్రాలకు ప్రకృతి వైపరీత్యాల సహాయం కింద రూ. 1929.99 కోట్ల సాయానికి కేంద్రం ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి కమిటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఎపి, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, నాగాలాండ్, జమ్మూకాశ్మీర్‌లకు అదనపు కేంద్ర సహాయానికి ఉన్నత స్థాయి కమిటీ ఆమోదించింది. 2025 లో సంభవించిన ఆకస్మిక వరదలు, మొంథా తుపాను ప్రభావిత రాష్ట్రాలకు సాయాన్ని ప్రకటించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్ రూ.341.48 కోట్ల అదనపు సాయం అందించనున్నారు.

## బిసి రక్షణ చట్టం రూపకల్పనపై నేడు సమావేశం: సవిత

**విజయవాడ, మార్చి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** వెనుకబడిన తరగతులు గౌరవ ప్రదమైన జీవనం సాగించడంలో భాగంగా బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై నేడు (శనివారం) జరగనున్న కీలక సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఈ సమావేశంలో బీసీ మంత్రులతో పాటు రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, హోం మంత్రి అనిత పాల్గొనబోతున్నారన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో హామీలో భాగంగా వెనుకబడిన తరగతులకు గౌరవ ప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. దీనిలో భాగంగా బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై ఇప్పటికే బీసీ మంత్రులు రెండు పర్యాయాలు భేటీ అయ్యామన్నారు. మూడోసారి విజయవాడ తాడిగడపలోని బీసీ వెల్ఫేర్ డైరెక్టరేట్‌లో కీలక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్య ప్రసాద్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొలుసు



పార్థసారథి, వాసంశెట్టి సుభాశ్, కొండపల్లి శ్రీనివాస్, సత్యకుమార్ పాల్గొంటున్నారన్నారు. బీసీ మంత్రులతో పాటు రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, హోం మంత్రి అనిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్‌తో పాటు న్యాయ శాఖ కార్యదర్శి, బీసీ వెల్ఫేర్ కార్యదర్శి కూడా ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు.

## కల్తీలో మరో ఇరువురు మృతి

రాజమహేంద్రవరం, మార్చి13 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జరిగిన పాలు కల్తీ ఘటనకు సంబంధించిన ఆరోగ్య సమస్యల నేపథ్యంలో శుక్రవారం మరో ఇరువురు ప్రాణాలు కోల్పోయారు. డెల్టా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రెడ్డి.అనంత లక్ష్మి (55), కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కడలి కృష్ణరావు (73) తీవ్ర మూత్రపిండ వైఫల్యంతో మరణించారాని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర రావు తెలిపారు. ప్రస్తుతం మొత్తం ఐదుగురు రోగులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మిగిలిన రోగుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షణలో ఉంచి, అవసరమైన అన్ని వైద్య చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోగులు సంబంధిత నిపుణుల వైద్యుల పర్యవేక్షణలో సముచిత వైద్య చికిత్స పొందుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

## సమరం ముమ్మరం

>> చేస్తామని హెచ్చరించిన వెంటనే ఇజ్రాయెల్ ఇరాన్ నగరాలపై దాడులు తీవ్రతరంచేసింది. ప్రభుత్వ అనుకూల ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాల్లోనే దాడులు జరిగాయి. టెహ్రాన్‌లోని ప్రొటెస్ట్ స్క్వేర్ సమీపంలోకూడా భారీ పేలుళ్లజరిగి ఒక మహిళ మరణించింది. ఈ ర్యాలీకి ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కూడా హాజరయ్యారు. ఇదిలా ఉంటే ఇరాన్‌పై ఇక తీవ్రస్థాయిలో దాడులు ఉం టాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. వచ్చేవారం మొత్తం ఇరాన్‌పై భూతలపోరు భారీ స్థాయిలోఉ ంటుందని, ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఉగ్రవాద దేశంగా ఉన్న ఇరాన్‌ను పూర్తిగా నాశనంచేస్తామని ట్రంప్ వెల్లడించారు. సైన్యం పరంగాను, ఆర్థికంగాను, అన్ని వైపులనుంచి కూడా ముప్పేటదాడులతో ఇరాన్‌ను భూస్థాపితంచేస్తామని హెచ్చరించారు. 47 ఏళ్లుగా అమాయక ప్రజలను చంపేస్తున్నారని, ఇపుడు అమెరికా 47వ అధ్యక్షుడుగా వారందరినీ ఖతంచేస్తామని అన్నారు.



## రైతుబిడ్డగా రైతుల సంక్షేమం కోసం కృషి

**గన్నవరం(కృష్ణా), మార్చి 13, ప్రభాతవార్త :** రాబోయే గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తామని సిఎంభరోసా ఇచ్చారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం సూరంపల్లి గ్రామంలో అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధులను సియం విడుదల చేసారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల పోలవరం ప్రాజెక్టు నిర్మాణ భారం పెరగటంతోపాటు ప్రాజెక్టు నిర్మాణంలో తీవ్ర జాప్యం అయ్యిందని, మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పోలవరం పనులు శరవేగంతో జరుగుతున్నాయన్నారు. కృష్ణాడెల్టాలోని రైతుల సాగునీటికి ఇబ్బందులు తీర్చాలనే లక్ష్యంతో పట్టిసీమ నిర్మాణం చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల రాష్ట్రంలోని రిజర్వాయర్‌లలో 65శాతం నీళ్ళు ఉన్నాయని, భూగర్భజలాలు సైతం 1.8మీటర్లు పెరిగాయని పేర్కొన్నారు.

## భారీగా తెలుగు కేంద్రం

>> హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. చిన్న పరిశ్రమలకు ఊతమిస్తూ దాదాపు 17 వేల మందికి ఉపాధి లభించేలా చర్చలు జరిపింది. రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్‌ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు. ధాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. పర్ డ్రాప్ మోర్ క్రాప్‌పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం2024ను రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు ఖినేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

### ఉద్యోగినుల కోసం సఖీ నివాస్ హాస్టళ్లు

మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం సఖీ నివాస్ పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్నికూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

### వ్యాపారులకు జీఎస్టీ ట్రైబ్యునల్స్

జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రైబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

### జల జీవన్ మిషన్‌కు భారీగా నిధులు

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం గడువు ముగిసినప్పటికీ, ప్రభుత్వ చొరవతో కేంద్రం దానిని 2028 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో, వివిధ పథకాల కింద నిధులు సమకూర్చుకుని రూ.9,355 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు మంత్రివర్గం పరిపాలన ఆమోదం తెలిపింది. అలాగే, తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

### కొత్తగా కేంద్రీయ విద్యాలయాలు

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల (కేవీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురంలో 5 ఎకరాలు, ఏలూరు జిల్లా నూజివీడులో 7 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురంలో 5 ఎకరాల చొప్పున భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు కేటాయించారు. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం దీని ముఖ్య ఉద్దేశం.

### పోలవరం పనుల వేగవంతానికి ఆమోదం

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్ట్ గడువు జూన్ 2027 వరకు ఉన్నప్పటికీ, పనులను త్వరగా పూర్తి చేసే లక్ష్యంతో మూడో గ్యాంట్రీ క్రేన్‌నుఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్రాజెక్టులో లైనింగ్ పనులతో పాటు, సుదీర్ఘకాలం పనులు నిలిచిపోవడం వల్ల దెబ్బతిన్న రాతి పొరల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ అదనపు పనుల కోసం ప్యాకేజీ63ఏ కు రూ.23.47 కోట్లు, ప్యాకేజీ64ఏకు రూ.24.51 కోట్ల అదనపు వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు.



## తిరుమల లడ్డూ వ్యవహారంపై పిటిషన్ కొట్టేసిన సుప్రీంకోర్టు

**విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఈ విషయంలో ఎలాంటి కామెంట్లు చేయకుండా నిలువరించాలని మానూరు శ్రీనివాస్ పిటిషన్ వేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారణ చేపట్టింది. అన్ని అంశాలు పరిశీలించాకే సీబీఐతో సిట్ వేయించినట్లు అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఏదైనా ఉంటే సీబీఐ ముందే చెప్పుకోవాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది.

## ప్రమాదాల నివారణకు చర్యలు

### జిల్లాకలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, మార్చి 13, ప్రభాతవార్త :** రహదారి ప్రమాదాలను నివారించి రహదారి భద్రతలో ఎన్‌టిఆర్‌జిల్లాను మొదటిస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లాకలెక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లారహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 30శాతం రోడ్డుప్రమాదాలు ద్విచక్రవాహనాలకు సంబంధించినవే అన్నారు.

## మాజీ డిజిపి హెచ్‌జె దొర కన్నుమూత

>> ఎపి కేడర్‌కు కేటాయించపడ్డారు. దొర ఐపిఎస్‌లో చేరిన సమయంలో ఉమ్మడి ఎపి సహా దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో నక్సలైట్ల సమస్య తీవ్రంగా వుండేది. ఆయన హయాంలోనే గ్రేహౌండ్స్‌తో పాటు ఎస్ఐబి విభాగాలు పురుడు పోసుకున్నాయి. ఈ రెండు విభాగాలు వచ్చాక ఉమ్మడి ఎపిలో నక్సలైట్లపై పోలీసులు పైచే యి సాధించగలిగారు. ఐపిఎస్ అధికారిగా ఉమ్మడి ఎపిలో అనేక చోట్ల పనిచేసిన దొర హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా, ఆర్టీసీ ఎండిగా, ఇంటెలిజెన్స్ ఐజిగా, సిఐడి అదనపు డిజిగా పనిచేశారు. 1996 నవంబరు 30వ తేదీన చంద్రబాబు నాయుడు సిఎంగా వున్న సమయంలో ఉమ్మడి ఎపి డిజిపిగా ఆయన నియమితులయ్యారు. ఆ పదవిలో ఆయన 2002 ఫిబ్రవరి 18వ తేదీ వరకు కొనసాగి అనంతరం కేంద్ర సర్వీసులోకి డిప్యూటేషన్‌పై వెళ్లి మొదట సిఐఎస్ఎఫ్ డిజిపిగానూ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గానూ పనిచేశారు. క్రీడల పట్ల ఎంతో ఆసక్తిగా వుండే దొర భారత ఒలింపిక్ సంఘానికి విశేష సేవలందించారు. భారత హాకీ సంఘం అధ్యక్షుడుగా కూడా కొంత కాలం పనిచేశారు. దివంగత దిగ్గజ ఐపిఎస్ అధికారి, భారత హా కీ సంఘం మాజీ అధ్యక్షుడు పంజాబ్ రాష్ట్రానికి చెందిన కెపిఎస్ గిల్‌కు దొర అత్యంత సన్నిహితుడు. భారత హాకీ అభివృద్ధికి, ఉమ్మడి ఎపి హాకీ సంఘం అభివృద్ధికి ఆయన విశేషంగా కృషి చేశా రు. భారత హాకీ జట్టులో సుదీర్ఘకాలం ఆడిన హైదరాబాదీ ముఖేష్ కుమార్ సహా పలువురు ఆట గాళ్లు ఆయన హయాంలోనే వెలుగులోకి వచ్చారు. బేగంపేట్ హాకీ స్టేడియం ఆయన హయాంలోనే కొత్త హంగులను సంతరించుకుంది. 2003లో ఆయన పదవీ విరమణ చేశాక 2006లో జిఎంఆ ర్ సంస్థలో సెక్యూరిటీ సలహాదారుగా కొంతకాలం పనిచేశారు. జిఎంఆర్ సంస్థ ప్రతిష్టాత్మకంగా పలు విమానాశ్రయాలను నిర్మించిన సమయంలో అక్కడ భద్రతకు సంబంధించి దొర చేసిన సిఫార్సులు కీలకంగా మారాయి. ఈ సిఫార్సులు ఇప్ప టికీ అమల్లో వుండడం గమనార్హం. ఐపిఎస్ అధికా రిగా ఆయనకు రాష్ట్రపతి పోలీసు పతకంతో పాటు అనేక అవార్డులు అందుకున్నారు. హెచ్‌జె దొరకు ఒక కుమారుడు, ఒక కుమార్తె వున్నారు. దొర భౌతికకాయాన్ని బంజారాహిల్స్‌లోని ఆయన స్వగృహానికి తరలించారు. శనివారం నాడు మహా ప్రస్థానంలో ప్రభుత్వ లాంచనాలతో దొర భౌతికకా యానికి అంత్యక్రియలు జరగనున్నాయి. కాగా దొర భౌతికకాయాన్ని డిజిపి శివధర్ రెడ్డి సహా పలువురు సీనియర్ పోలీసు అధికారులు, విశ్రాంత ఐపిఎస్ అధికారులు సందర్శించి నివాళులు అర్పించారు.

### దొర మృతిపట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతాపం

కాగా హెచ్‌జె దొర మృతిపట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఉమ్మడి ఎపిలో పోలీసు శాఖలో అనేక సంస్కరణలు తీసుకురావడంలో దొర కీలకంగా వ్యవహరించారని సిఎం కొనియాడారు. అప్పట్లో ఆయన చేబట్టిన సంస్కరణలు పోలీసు శాఖను బలోపేతం చేశాయని సిఎం తెలిపా రు. దొర కుటుంబ సభ్యులకు సిఎం ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలిపారు. దొర మృతి పట్ల డిజిపి శివధర్ రెడ్డి తీవ్ర సంతాపం తెలిపా రు. ఉమ్మడి ఎపి హయాంలో పోలీసు శాఖ అభివృద్ధికి దొర ఎనలేని సేవలు అందించారని డిజిపి కొనియాడారు. దొర కుటుంబ సభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు.

## హెచ్‌జె దొర మృతి పట్ల సిఎం చంద్రబాబు ఆవేదన

**విజయవాడ,మార్చి13 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డీజీపీ మాజీ డీజీపీ హెచ్‌జె దొర మృతి పట్ల సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ... హెచ్‌జే దొర మృతి వార్త తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. "ఎపి పోలీస్‌కు బ్రాండ్ క్రియేట్ చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఎన్టీఆర్ గారి దగ్గర ఇంటెలిజెన్స్ అధికారిగా, నా హయాంలో రాష్ట్ర డిజిపిగా దొర చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయి. నాడు రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న నక్సల్ సమస్య పరిష్కారంలో ఎంతో సమర్థవంతంగా వ్యవహరించారు. దొర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని ట్వీట్ చేశారు. హెచ్‌జే దొర కొంత కాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన ఈరోజు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పలువురు రాజకీయ నేతలు, పోలీసు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

## మరో 6 నెలల్లో స్థానిక ఎన్నికలు!

>> రామానాయుడుకు చెప్పారు. చేసిన పనిని మీరు మీడియాకు చెప్పుకోవడంలో విఫలమవుతున్నారని మంత్రులతో వ్యాఖ్యానించారు. మంత్రివర్గంలో అజెండా అంశాలు ముగిశాక వివిధ అంశాలపై సీఎం మంత్రులతో చర్చించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వల్ల గ్యాస్ కొరత తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సిఎం సూచించారు. కొందరు గ్యాస్‌కి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ పొయ్యిలు వాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఎలక్ట్రిక్ పొయ్యిలు ఎక్కువ వాడితే విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున, విద్యుత్ డిమాండ్ పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఏప్రిల్ 2న శాఖల పనితీరు మీద నివేదికలు ఇస్తానని ముఖ్యమంత్రి వెల్లడించారు. నివేదికలు ఆధారంగా సమీక్ష చేసుకుని పురోగతి సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 2 నుంచి 90 రోజుల పాటు జలాధార కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కాలవులు, డ్రైన్లు శుభ్రం చేయించి భూగర్భ జలం పెంచటమే లక్ష్యంగా జలాధార చేపట్టాలన్నారు. మే 15 కల్లా సాగునీటిని విడుదల చేయాలని ఆదేశించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల దాదాపు 7 లక్షల ఎకరాలకు నీరందలేదన్న సీఎం, చివరి ఎకరాకు నీరిచ్చే దిశగా జలాధార జరగాలని సూచించారు. వరదల వల్ల రేపల్లె వద్ద బలహీనంగా ఉన్న కరకట్టను అభివృద్ధి చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు. ఈ నెల 16న అమరావతిలో పొట్టిశ్రీరాములు విగ్రహావిష్కరణ చేపడుతున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ పొట్టిశ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

### మంత్రి మండలి సమావేశానికి ఆరుగురు మంత్రులు గైర్హాజరు

వివిధ కారణాల వలన ఆరుగురు మంత్రులు మంత్రివర్గ సమావేశానికి రాలేకపోతున్నామని ముందస్తు సమాచారం ఇచ్చారు. తీవ్ర అనారోగ్యం వలన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనిత, టీజీ భరత్ గైర్హాజరు కాగా భార్య సంవత్సరికం వల్ల ఫరుఖ్ కేబినేట్‌కు రాలేకపోయారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్ల పర్యవేక్షణ వలన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్ కెబినేట్‌కు రాలేదు.

## తెలుగు వారిని స్వదేశానికి చేర్చే ప్రక్రియ వేగవంతం: ఎపి భవన్

విజయవాడ మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన తెలుగు వారిని స్వదేశానికి చేర్చే ప్రక్రియ వేగవంతం చేసినట్లు ఏపీ భవన్ అధికారులు వెల్లడించారు. బహ్రెయిన్‌లో ఉన్న తెలుగు వారిని ప్రత్యేకంగా హైదారాబాద్‌కు తరలించేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. గల్ఫ్ ఎయిర్ సంస్థతో ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. బహ్రెయిన్‌లో ఇంకా 400 మందికి పైగా తెలుగు వారు స్వదేశానికి వచ్చేందుకు వేచి ఉన్నట్లు వెల్లడించారు. ఈమేరకు పౌర విమానయాన శాఖ, డీజీసీఏ అధికారులతో పాటు విదేశాంగ శాఖ రాయబార కార్యాలయాల సహకారం తీసుకుంటున్నట్లు అధికారులు చెప్పారు. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. గత మూడు రోజుల్లో సుమారు మూడు వందల మంది తెలుగు వారిని బ్రహెయిన్ నుంచి తరలించామని అధికారులు చెప్పారు. ఏపీ ఎన్ఆర్టీ ప్రతినిధుల సహకారంతో వీరందరూ సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారని ఏపీ భవన్ అధికారులు వెల్లడించారు.

## కొత్త జడ్జిగా జస్టిస్ లీసా గిల్ బాధ్యతల స్వీకారం

>> కొనసాగుతారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 33 ఉంది. తాజాగా జస్టిస్ లిసా గిల్ రాకతో ఆ సంఖ్య 34కు చేరింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్ లో పాఠశాల విద్య అభ్యసించారు. ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు. జస్టిస్ లిసా గిల్ 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, పంజాబ్, హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవిన్యూ, రాజ్యాంగ పరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. ఆమె సుదీర్ఘ కాలం పాటు చండీగఢ్ కు పలు కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ బోర్డులకు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2014 మార్చి 31న పంజాబ్‌హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పంజాబ్‌హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సేవలు అందించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజేల పదవీ విరమణ కాలం ముగియడానికి 2 నెలల ముందే, ఆ స్థానంలోకి కొత్త న్యాయమూర్తి పేరును ప్రతిపాదించాలని నిర్ణయించింది. న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థం, నాణ్యతను పెంచేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని కొలీజియం పేర్కొంది. ఈ విధానం వల్ల హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టే లోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటు పడటానికి వీలవుతుందని పేర్కొంది. దీనిలో భాగంగా జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా తొలుత బదిలీ చేశారు. ప్రస్తుత సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేసిన వెంటనే ఆమె ఆ స్థానంలో నియమితులుకానున్నారు.

## సిఇసిపై అభిశంసన!

>> తొలుత 2025 నవంబర్‌లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌తో పాటు ఇతర రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో 'ఎస్ఐఆర్' చేపట్టడంపై సిఇసి జ్ఞానేశ్ కుమార్ పనికట్టుకుని ఓ వర్గానికి, పార్టీకి అనుకూలంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ అభిశంసన తీర్మానం నోటీసుకు పశ్చిమ బెంగాల్‌లో అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) నాయకత్వం వహించింది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్-మే నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి చెందిన పార్టీల సభ్యులతో ఆమ్ ఆద్మీ ఎంపిలు నోటీసుపై సంతకాలుచేశారు.

## ఇక 24x7 దుకాణాలు

>> **ప్రధాన ప్రాంతాల్లో అనుమతి**

ఏపీలోని వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సులభతర వాణి జ్యంలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, వాణిజ్య సంస్థలను 24గంటలూ నిర్వహిం చుకు నేందుకు అనుమతిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 4 లక్షలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. రాష్ట్ర కార్మిక శాఖ ఈ మేరకు ఉత్తర్వు లు జారీ చేసింది. షాపులు, వాణిజ్య సంస్థల చట్టం 1988లోని కొన్ని నిబంధనల నుంచి మినహా యింపు ఇస్తూ ఈ నిర్ణయం తీసు కుంది. అయితే, ఈ వెసులు బాటు కల్పిస్తూనే ఉద్యోగుల సంక్షేమా నికి సంబంధించి ప్రభుత్వం కొన్ని స్పష్టమైన నిబంధనలను విధించిం ది. ప్రతి ఉద్యోగితో వారానికి గరిష్ఠంగా 48 గంటలు మాత్రమే పని చేయించాలని, ఆ సమయం మించితే తప్పనిసరిగా ఓవర్ టైం జీతం చెల్లించాలని ఆదేశించింది. అలాగే, ఉద్యోగులందరికీ వారానికి ఒక రోజు సెలవు ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ సెలవు దినాల్లో పని చేయించాల్సి వస్తే, అందుకు బదులుగా మరో రోజు ప్రత్యామ్నాయ సెలవు మంజూరు చేయాలని పేర్కొంది. దీంతో పాటు 20 మంది లేదా అంతకంటే ఎక్కువ సిబ్బంది ఉన్న సంస్థలు లైఫ్‌టైమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందేందుకు కూడా కార్మిక శాఖ అనుమతించింది.

## వారం - వర్జ్యం

14-03-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
దశమి ఉ.8.10
ఉత్తరాషాఢ తె.4.48
వర్జ్యం : ఉ.8.59-10.40
దు.ఉ.6.17-7.53
శుభసమయం:ఉ.5.30-6.30,సా.6.30-7.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఎవరి మాటలను లెక్కచేయకుండా ధర్మబద్ధంగా మీ బాధ్యతలను నిర్వహిస్తారు. చిరకాల స్వప్నం నెరవేరే సమయం.

**వృషభం:** ముఖ్యముగా గంటలు - గంటలుగా ప్రతీ విషయంలో ఆలోచించే విధానానికి స్వస్తి చెప్పండి. వస్త్రలాభం.

**మిథునం:** ఎంతో శ్రమించి ప్రత్యేక శ్రద్ధవహించినప్పటికీ వృత్తులలో సాధారణ ఫలితాలే లభిస్తాయి. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** వివాహాది శుభకార్యములకు సంబంధించి చర్చలు వ్యూహాలు పురోభివృద్ధిలో ఉంటాయి. ఆరోగ్యం జాగ్రత్త.

**సింహం:** మీ నుండి ఉపకారము పొందినవారినుండే తిరిగి మీరు సహాయము పొందవలసివస్తుంది.

**కన్య :** శారీరక, మానసికోల్లాసానికి యోగా, ధ్యానం వంటివి ఉపకరిస్తాయి. కుటుంబ పురోగతి బాగుంటుంది. వాహనసౌఖ్యం.

**తుల:** జమా ఖర్చులకు సంబంధించిన వాటిలోని ఒడిదుడుకులు గుర్తించి మౌనంగా కార్యచరణలో మార్పులు చేసారు.

**వృశ్చికం:** రాజకీయంగా గానీ, ఉద్యోగాలలో గానీ, ఉన్నతస్థితి సాధించడానికి అధికంగా శ్రమించి సానుకూలపడతారు.

**ధనుస్సు:** గృహ సంబంధమైన సమస్యలు ఎడతెరిపిలేని మీ ఆలోచనలవలన మానసిక వత్తిడి అధికం అవుతుంది. ఆరోగ్యంజాగ్రత్త.

**మకరం:** కోర్టు వ్యవహారాలు సానుకూల పడతాయి. కృషితో ఎంతటి కార్యక్రమాలనైనా సాధించవచ్చని నిరూపిస్తారు.

**కుంభం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. తద్వారా కొంత లాభపడుతారు. స్పెక్యులేషన్లకు దూరంగా ఉండండి.

**మీనం:** కృషితో ఎంతటి కార్యక్రమములనైనా సాధించవచ్చని నిరూపిస్తారు. ఆర్థిక వ్యవహారాలతో గోప్యత చెప్పదగినది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అత్యుత్తమ ప్రతిభకనబరిచిన పోలీసు సిబ్బందికి 'డిజిపి కమెండేషన్ డిస్క్ 2026' పురస్కారం



డిజిపి కమెండేషన్ డిస్క్ 2026' పురస్కారాలు పొందిన సిబ్బందితో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

**విజయవాడ మార్చి 13,ప్రభాతవార్తప్రతినిధి:** విధి నిర్వహణలో విశిష్ట సేవలు, అత్యుత్తమ ప్రతిభకనబరిచినందుకుగాను పోలీసు సిబ్బందికి "డీజీపీ కమెండేషన్ డిస్క్ 2026"ను ఆంధ్రప్రదేశ్ పోలీసుశాఖ ప్రకటించింది. పోలీసు శాఖలో అత్యున్నత ప్రతిభ, ధైర్యసాహసాలు, సర్వీసులో నిబద్ధత ప్రదర్శించిన వారికి ప్రతి సంవత్సరం గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ కేటగిరీలో ఈ అవార్డులు ప్రదానం చేస్తారు. ఈ ఏడాది బ్రాంజ్ కేటగిరీలో ఇప్పటి వరకూ ముగ్గురు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. డీజీపీ ప్రధాన కార్యాలయంలో నేడు జరిగిన ఒక కార్యక్రమంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈ అవార్డుకు ఎంపికైన వారికి "డీజీపీ కమెండేషన్ డిస్క్" లను ప్రధానం చేశారు. ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా ఈ నెల 7వ తారీఖున ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోగల పండిట్ నెహ్రూ బస్టాండ్ బయట ఉన్న ఓ ప్రైవేట్ హోటల్ డార్మిటరీలో రూమ్ నంబర్ 9ని తనిఖీ చేస్తుండగా... గదిలో అనుమానాస్పద కదలికలతో వ్యవహరిస్తున్న తెలంగాణ రాష్ట్రం, వరంగల్ జిల్లా, రామన్నగూడెంకు చెందిన కనకం మురళిని ప్రశ్నిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ను తోసివేసి.. సంచిలోంచి తుపాకీ తీసి కాల్చుడానికి యత్నించగా... సాంకేతికలోపంతో లాక్ ఓపెన్ కాకపోవడం వల్ల తుపాకీ ఫైర్ కాలేదు. ముద్దాయి తప్పించుకునే ప్రయత్నంలో జనాలను కాల్చివేస్తానంటూ బెదిరిస్తూ పారిపోతున్న ముద్దాయిని వెంబడించి, ప్రాణాలు సైతం లెక్క చేయకుండా అత్యంత చాకచక్యంగా, ధైర్యసాహసాలతో అదుపు లోకి తీసుకున్న ఎం. కృష్ణకుమార్, పీసీ2223, సిటీ టాస్క్ ఫోర్స్ విజయవాడ... ఎం.వి. సారధి నాయక్, హెచ్ సీ2381, కృష్ణలంక పోలీస్ స్టేషన్, విజయవాడ,. పి. మనోహర్, హెచ్ సీ 95, ఈగల్ విభాగంలకు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా కమెండేషన్ డిస్క్ లను ప్రధానం చేశారు సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, ముద్దాయిని అదుపులోకి తీసుకోవడంలో పోలీసులు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, తెగువ అభినందనీయమని ప్రశంసించారు. విధి నిర్వహణలో పోలీసులు చూపిన నిబద్ధత, అప్రమత్తత ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీపీ రాజీవ్ కుమార్ మీనా సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్, అడిషనల్ డీజీ శాంతి భద్రతలు ఎన్. మధుసూదనరెడ్డి, ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ, విజయవాడ నగర కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు తదితర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆదర్శంగా నిలిచిన రైతు రోశయ్యకు సిఎం చంద్రబాబు ప్రశంస



**విజయవాడ, మార్చి 13, ప్రభాత వార్తప్రతినిధి:** ప్రకృతి వ్యవసాయంతో ఆద ర్శంగా నిలుస్తున్న గుంటూరు జిల్లా రైతు రోశయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. రైతు రోశయ్య చేస్తున్న ప్రకృతి సాగును కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ సామాజిక మాధ్యమం వేదికగా ట్వీట్ పెట్టారు.గుంటూరు జిల్లా కొల్లిపర మండలం అత్తోట గ్రామానికి చెందిన రైతు రోశయ్య కేవలం 75 సెంట్ల భూమిలోనే 52 రకాల పంటలను సాగు చేస్తున్నారు. ప్రకృతి సేద్య పద్ధతులను అనుసరిస్తూ విభిన్న పంటలను పండించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. చిన్న స్థలంలోనే విభిన్న పంటలను సాగు చేసి మంచి ఆదాయం పొందడం ఆయన ప్రత్యేకతగా మారిందని తెలిపారు. రోశయ్య ప్రస్తుతం 80 ఏళ్ల వయసులో కూడా వ్యవసాయంలో చురుకుగా పనిచేస్తూ ప్రతి నెలా రూ.20 వేలకు పైగా ఆదాయం పొందుతున్నారని చెప్పుకొచ్చారు. చిన్న స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించి, ప్రకృతి వ్యవసాయంతో విజయాన్ని సాధించడం యువ రైతులకు స్ఫూర్తినిస్తోందని పేర్కొన్నారు.

## స్వామివారి ఆశీస్సులందుకున్నాం :ప్రముఖులు

**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనస్సు ఆనందంగా ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కేంద్రమంత్రి మురుగన్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, తమిళనాడు ఎమ్మెల్యే నైనార్ నాగేంద్రన్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# టెన్త్ విద్యార్థులకు ఊరట, ఒక నిమిషం ఆలస్యం నిబంధన రద్దు

**విజయవాడ,మార్చి 13,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీలో టెన్త్ విద్యార్థులకు ఊరట,ఒక నిమిషం ఆలస్యం నిబంధనను ప్రభుత్వం రద్దు చేసింది.పదో తరగతి పరీక్షలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం 6,40,916 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, వీరి కోసం 3,415 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్, ఉచిత బస్సు ప్రయాణం, నిమిషం నిబంధన సడలింపు వంటివి వీటిలో ప్రధానమైనవి.పట్టణ, నగర ప్రాంతాల్లోని విద్యార్థులు పరీక్షా కేంద్రాలను గుర్తించడంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు, ఈసారి హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. మొబైల్ ఫోన్‌తో ఈ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా గూగుల్ మ్యాప్స్ సహాయంతో సులభంగా సెంటర్‌కు చేరుకోవచ్చు. అంతేకాకుండా విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను చూపించి ఆర్టీసీ బస్సుల్లో పరీక్షా కేంద్రానికి, తిరిగి ఇంటికి ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఈ సౌకర్యం విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగపడనుంది. ప్రతి రోజూ ఉదయం 9:30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. విద్యార్థులను ఉదయం 8:30 గంటల నుంచే పరీక్షా కేంద్ర ప్రాంగణంలోకి అనుమతిస్తారు. ఈ ఏడాది విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఖినిమిషం నిబంధనఖిను కూడా సడలించారు. ప్రత్యేక పరిస్థితుల్లో పరీక్ష ప్రారంభమైన అరగంట తర్వాత కూడా విద్యార్థులను అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులకు సన్నద్ధమయ్యేందుకు వీలుగా రెండు పరీక్షల మధ్య సెలవులు ఉండేలా టైం టేబుల్‌ను రూపొందించారు. పరీక్షల నిర్వహణతో పాటే జవాబు పత్రాల మూల్యాంకనానికి కూడా అధికారులు పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. ఏప్రిల్ 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతుంది. ఇందుకోసం 26 జిల్లాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈసారి మార్కుల లెక్కింపులో పొరపాట్లకు తావివ్వకుండా ఉండేందుకు, ట్యాబ్లెట్లలో మార్కులను నమోదు చేసే నూతన విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు 40 జవాబు పత్రాలను మాత్రమే మూల్యాంకనం చేసేలా నిబంధన విధించారు.

## పిజి విద్యార్థినులకు ఉపాధి శిక్షణనిచ్చే శిక్షకులకు టెండర్లు



**తిరుపతి,మార్చి 13ప్రభాత వార్త ప్రతి నిధి:** ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో పిజి చదువుతున్న విద్యార్థినులకు ఉపాధి నైపుణ్యాల కోసం శిక్షణ నివ్వడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. అవసరమైన శిక్షణనివ్వడానికి ఎపిప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లకు ఆహ్వానం కోరారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్ "డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు. ఎస్‌పిఎంవివి. ఎసి.ఇన్"సందర్శించాలని ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆచార్య బి. కిషోరి తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంటుకు వడ్డీ రాయితీ, నిధులు విడుదల

**విజయవాడ,మార్చి 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని కాలేజీ విద్యార్థులకు, యాజమాన్యాలకు నెల రోజులుగా నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు అంగీకరించింది, ఫీజు రీయింబర్స్‌మెంట్. నిధులపై వడ్డీ కోత విధించాలన్న ప్రతిపాదనతో తలెత్తిన వివాదానికి సీఎం చంద్రబాబు జోక్యంతో తెరపడింది. ఎలాంటి కోతలు లేకుండా పూర్తి బకాయిలను విడుదల చేయాలని ఆయన ఆదేశించడంతో నిధుల విడుదల ప్రక్రియ మళ్లీ మొదలైంది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం రూ.1200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు గత నెల 10న బడ్జెట్ రిలీజ్ ఆర్డర్స్ (బీఆర్వో) జారీ చేసింది. అయినప్పటికి నిధులు విడుదల చేయడంలో ఉన్నత విద్యాశాఖ అధికారులు ఓ మెలిక పెట్టారు. ప్రభుత్వం రుణం తెచ్చి ఈ బకాయిలు చెల్లిస్తున్నందున, ఆ రుణంపై పడే 7.5శాతం వడ్డీని (సుమారు రూ.90 కోట్లు) కాలేజీ యాజమాన్యాలే భరించాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా కాలేజీలే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకున్నట్లు అగ్రిమెంట్‌పై సంతకాలు చేయాలని కోరారు. అధికారుల ప్రతిపాదనను కాలేజీ యాజమాన్యాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిలకు తామే వడ్డీ కట్టడమేంటని, రుణం తీసుకున్నట్లు ఎలా సంతకాలు చేస్తామని ప్రశ్నించాయి. ఈ వివాదం కారణంగా నిధుల విడుదల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో పలు కాలేజీల యాజమాన్యాలు మెయిల్స్ ద్వారా నేరుగా సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశాయి. తమకు రావాల్సిన బకాయిలపై వడ్డీ విధించడం అన్యాయమని ఆయన దృష్టికి తీసుకెళ్లాయి. ఈ ఫిర్యాదులపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి, అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వడ్డీ ప్రతిపాదనను వెంటనే పక్కనపెట్టి, బకాయిలను యథాతథంగా విడుదల చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో సాంఘిక సంక్షేమ శాఖ వెంటనే రంగంలోకి దిగింది.

# తిరుపతి మహానగరం మార్పు అవసరం!

### - చివరి కౌన్సిల్ సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష - పూర్తయిన ఐదేళ్ల పాలన



**తిరుపతి,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రాస్థలం,ఆధ్యాత్మికనగరంగానేగాక స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకుంటున్న తిరుపతి మహానగరం(గ్రేటర్‌తిరుపతి)గా మార్పు చెందాల్సిన అవసరముందని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష ఉద్ఘాటించారు. గత ఐదుసంవత్సరాల కౌన్సిల్ పాలనలో తీసుకున్న నిర్ణయాలు, జరిగిన అభివృద్ధి తిరుపతి గ్రేటర్ నగరంగా మారడానికి అడుగులు పడుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. 2021-26మధ్యకాలంలో తిరుపతి నగరపాలకసంస్థగా రూపుదిద్దుకుందని, తొలి కార్పొరేషన్ ఎన్నికలతో మేయర్ ,కార్పొరేటర్లుగా పదవులు ఏర్పడ్డాయన్నారు. గత ఐదేళ్ళలో మాకౌన్సిల్‌లో తిరుపతి నగర రూపురేఖలు మార్చేందుకు శ్రీకారం చుట్టామని ప్రతిష్టాత్మకంగా తెలిపారు. ఎంతో విశిష్టత ఉన్న తిరుపతి నగరానికి తొలి మేయర్ కావడం తనకు లభించిన అరుదైన గౌరవమన్నారు.రాష్ట్రప్రభుత్వం నగరపాలకసంస్థలకు ప్రత్యేక అధికారులను నియమించడంతో తిరుపతి నగరపాలక సంస్థ కౌన్సిల్ పదవీకాలం ముగిసింది. శుక్రవారం ఉదయం ఎస్వీయూ సెనెట్‌హాల్‌లో చివరి కౌన్సెల్ సమావేశం జరిగింది. ప్రారంభ ఉపన్యాసంలో తొలిమేయర్ ,చివరి మేయర్ డాక్టర్ ఆర్.శిరీష మాట్లాడుతూ తిరుపతి మున్సిపాల్టీ నుండి నగరపాలక సంస్థగా ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తయిందన్నారు. ప్రత్యేక కౌన్సిల్ సమా వేశంలో మేయర్ చివరి ప్రసంగం చేశారు. ఆధ్యాత్మిక కేంద్రం, శ్రీవేంకటేశ్వరస్వామిపాదాల చెంత నెలకొన్న తిరుపతి నగరానికి ప్రజాప్రతినిధులుగా పనిచేయడం మనందరి అదృష్టమన్నారు. దాదాపు ఐదు లక్షల మంది తిరుపతి నగర జనాభాలో ఇదీ అప్పటి పరిస్థితుల్లో మనకు లభించిన అరుదైన అవకాశమన్నారు. గత ఐదు సంవత్సరాల కౌన్సిల్ పాలనలో అనేక తీపి గుర్తులు, మరిచిపోలేని అనుభూతులు మన కళ్ళ ముందు మెదలుతున్నాయన్నారు. ఎన్ని పరిమితులు ఉన్నా మనల్ని ఎన్నుకున్న ప్రజల ముందు మేము మీ కార్పొరేటర్లం అని చెప్పగలిగే స్థాయిలో మన పనితీరు సాగిందన్నారు. రాజకీయాలకు కొత్త అయిన విశేష అనుభవం ఉన్న పెద్దలు ఉన్నారు.

## కొండపల్లి లో రూ. 47 కోట్లు విలువైన అల్ప్రాజోలం సీజ్

**విజయవాడ,మార్చి13,ప్రభాతవార్తప్రతినిధి:**ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం కొండపల్లి ఐడీఏలో నార్కోటిక్ ఇంటెలిజెన్స్ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ఐడీఏలోని ఒక కంపెనీలో అధికారులు భారీగా అల్ప్రాజోలంని గుర్తించారు. సుమారు 200 కేజీల ఆల్ప్రాజోలంని నార్కోటిక్ ఇంటెలిజెన్స్ స్వాధీనం చేసుకుని కంపెనీని సీజ్ చేశారు. కొండపల్లి ఐడీఏలో కంపెనీలో లభ్యమైన అల్ప్రాజోలం విలువ దాదాపు రూ. 47 కోట్లు ఉంటుందని నార్కోటిక్ ఇంటెలిజెన్స్ అంచనా వేస్తున్నారు. సుమారు 200 కేజీలకు పైగా అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్న అనంతరం కంపెనీని అధికారులు సీజ్ చేశారు. అంతేకాకుండా అదనంగా 800 కిలోల ముడి పదార్థాలు, 2,860 లీటర్ల రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు.అదే విధంగా ఫ్యాక్టరీలో రియాక్టర్, డ్రైయర్, సెంట్రిఫ్యూజ్ వంటి ఇండస్ట్రియల్ మెషిన్లను సైతం గుర్తించారు. దీనికితోడు ఇద్దరిని అరెస్ట్ చేశారు.

మాస్టర్‌మైండ్‌గా అనుభవం ఉన్న కంపెనీగా అధికారులు దీన్ని గుర్తించారు. డ్రగ్ తయారీకి కెమికల్ ఫ్యాక్టరీని అద్దెకు తీసుకుని నడుపుతున్నట్లు విచారణలో వెల్లడైంది.

# పెద్ద దిక్కును కోల్పోయిన జర్జంగి

### దొర మరణంతో గ్రామంలో విషాదఛాయలు



1965 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన అయన, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డిజిపిగా, సి.ఐ.ఎస్.ఎఫ్ డైరక్టర్ జనరల్‌గా, ఎపిఎస్ ఆర్టీసీ ఎం.డిగా, ఇంటలిజెన్స్ అధికారిగా, హైదరాబాద్ పోలీస్ కమీషనర్‌గా ఇలా పలు హోదాలలో పనిచేసి మెరుగైన పనితీరు కనబరిచారు. పదవి విరమణ అనంతరం 2006లో జీఎమ్మార్ సంస్థలో డిల్లీ ఎయిర్‌ఫోర్ట్ సెక్యూరిటి అడ్వైజరీ బోర్డ్ చైర్మన్‌గా పని చేసిన అవిశ్రాంతంగా సేవలందించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తి అయిన హెచ్.జె.దొర నా తండ్రి ఎర్రన్నాయుడుతో అనుబంధంగా ఉండే వారు. వారి మరణం దేశానికే తీరని లోటు.

**కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా) మార్చి 13 ప్రభాతవార్త** శుక్రవారం హైదరాబాద్‌లో కన్నుమూసిన హెచ్ జె దొర. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డి.జి.పిగా పని చేశారు. అనంతరం కేంద్ర విజిలెన్స్ కమిషనర్‌గా, సి.ఐ.ఎస్.ఎఫ్ మాజీ డీ.జీగా పని చేశారు. ఈయన 1943లో శ్రీకాకుళం జిల్లా జర్జంగి గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య జర్జంగిలో, ఉన్నత విద్య ఆంధ్ర విశ్వవిద్యాలయం విశాఖపట్నంలో జరిగింది. అనంతరం అఖిల భారత సర్వీస్ అయిన ఐ.పీ.ఎస్‌కు ఎంపికయ్యారు. ఈయన వివిధ హోదాలలో ఆంధ్రప్రదేశ్ లో పనిచేసి డి.జి.పి స్థాయిని చేరుకుని ఉద్యోగ విరమణ పొందారు. ఈయన తండ్రి సత్యనారాయణ దొర 1952 సంవత్సరం నరసన్నపేట శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. ఆయన హయాంలోనే కోటబొమ్మాళికి ఉన్నత పాఠశాల తీసుకువచ్చారు. హెచ్.జే.దొర అత్తవారు నందిగామ మండలం, వెంకన్నపేట గ్రామం కాగా, ఈయనకు భార్య మీనాక్షి, కుమారుడు సత్యనారాయణ (సాఫ్ట్వేర్ ఇంజనీర్), కుమార్తె సాయి లీల (లండన్‌లో వైద్య వృత్తి) ఉన్నారు. ఈయన సోదరుడు హెచ్.ఎల్.ఎన్. దొర విశాఖపట్నంలో కమర్షియల్ టాక్స్ ఎడిషనల్ కమిషనర్‌గా పని చేశారు. దొర గ్రామంలో కొంత స్థలాన్ని కొనుగోలు చేసి గ్రామ ప్రజలకు ఉచితంగా శుభకార్యాలు చేసుకునేందుకు గాను కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టారు. అలాగే ఒక శివాలయం, ఒక బాబా ఆలయం నిర్మాణం చేపట్టారు. తన స్వగృహాన్ని ఉచితంగా వృత్తి విద్య కోర్సులు నిర్వహణకు జి.ఎం.ఆర్ సంస్థకు అప్పగించారు. గ్రామానికి ఉన్నత పాఠశాల తీసుకురావడంతో పాటు, ప్రతి ఏడాది ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ఉపాధ్యాయులకు దుస్తులు పంపిణీ చేపడుతూ వస్తున్నారు. దొర అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ బంజారాహిల్స్‌లో తన స్వగృహము నందు నిర్వహించనున్నట్లు వారి బంధు వర్గాలు తెలిపాయి. దొర మృతి వార్త విన్న జర్జంగి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ గ్రామం ఒక పెద్ద దిక్కును కోల్పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కిష్కింధలోనే హనుమంతుని భవ్యమందిర నిర్మాణం

**- నకిలీ పీఠాధిపతులు, బాబాలను నమ్మకండి**

**-విధుశేఖరభారతి మహాస్వామి పై సంచలన వ్యాఖ్యలు చేసిన గోవిందానందసరస్వతిస్వామి**

**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** అయోధ్యలో రామమందిరం నిర్మించినట్లే కర్నాటక కిష్కింధలో హనుమంతుని భవ్యమందిరం నిర్మాణం చేపడతామని సుకశంకర పీఠాధపతి గోవిందానందసరస్వతిస్వామి వ్యాఖ్యానించారు. ఇందుకు అక్కడి ప్రభుత్వం వందకోట్ల రూపాయలు కూడా కేటాయించిందని ఆయన వెల్లడించారు. హనుమంతుని మందిరం నిర్మించి దేశవ్యాప్తంగా ప్రచారయాత్ర మొదలుపెడతానన్నారు. ఇందుకు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి, బద్రినారాయణుడు ఆశీస్సులు కోరానన్నారు. దేశంలో నకిలీ పీఠాధిపతులు, నకిలీ బాబాలు, నకిలీ మఠాధిపతుల పేరుతో చలామణి అవుతున్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎవరూ నమ్మవద్దని ఆయన కీలకంగా అన్నారు. శృంగేరి శారదాపీఠం పీఠాధిపతి విధుశేఖరభారతి నకిలీ పీఠాధిపతి అని ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు. తిరుమలలో ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమంగా మారాయి. జమ్మూకాశ్మీర్‌లో పిఒకె వద్ద శారదాఅమ్మవారి విగ్రహం ప్రతిష్టకూడా జరగనుందన్నారు. హంపి విజయనగరానికి తిరుపతికి అవినాభావ సంబంధం ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూ ధర్మాన్ని రక్షించే ప్రక్రియలో ఆయన శృంగేరి శారదాపీఠం పీఠాధిపతి విధుశేఖరభారతి స్వామిపై చేసిన విమర్శన వ్యాఖ్యలు స్వాముల్లో రగడకు కారణంగా మారాయి. శృంగేరి శారదాపీఠంకు విధుశేఖరభారతి స్వామి ఉత్తరాదికారికాదని గోవిందానందసరస్వతిస్వామి తిరుమల ఆలయం ముందు సంచలన వ్యాఖ్యలు చేయడం హిందుసంఘాల్లో కలకలంగా మారింది. తిరుమలకు రావడంతో ఈ వ్యాఖ్యలు చేశారు.

# తిరుమల సమాచారం

## 19న ఉగాది ఆస్థానం

### - 17న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం - విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19వతేదీ గురువారం తెలుగు నూతన "పరాభవనామసంవత్సర" ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఈ సందర్భంగా 19వ తేదీవిఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. 18వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. శ్రీనివాసుడు కొలువైన ఆనందనిలయంలో బంగారు వాకిలిలో 19వతేదీ గురువారం తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతం అనంతరం ఆలయ శుద్ధి చేస్తారు. ఉదయం 6గంటలకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారికి ,విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత వెంకన్న మూలవిరాట్టుకు ,ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. అనంతరం పంచాంగ శ్రవణం జరుగుతుంది.ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమపండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జితసేవలు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం టిటిడి రద్దు చేసింది. 17వతేదీ మంగళవారం ఉదయం చేపడుతున్నారు. ఉదయం 6గంటల నుండి 10గంటల వరకు ఆనందనిలయంలో సన్నిధి నుండి మహద్వారం వరకు, ఉప ఆలయాలు పూర్తిగా పవిత్ర జలంతో శుద్ధిచేస్తారు. పూజా సామాగ్రిని కూడా కడుగుతారు. అనంతరం స్వామివారికి అలంకరణ చేసి ప్రత్యేక నివేదనలు పూర్తయిన వెంటనే భక్తులను దర్శనానికి అనుమతినిస్తారు. ఈ సందర్భంగా మంగళవారం విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. ఆరోజు అష్టదళపాదపద్మారాధన సేవ కూడా రద్దు చేశారు. 16వతేదీ సోమవారం విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరు.

## నెయ్యికల్తీపై ఆధారాలుంటే సిబిఐకి ఇవ్వండి

### - పిటిషనర్‌కు సుప్రీం ధర్మాసనం ఆదేశం



**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి గతంలో కల్తీనెయ్యి వాడారనే వివాదంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా పరిస్థితులు మారుతున్నాయని పిటిషనర్ తరపున న్యాయవాది సుప్రీంకోర్టు ధర్మాసనంకు తెలిపారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు ఈ అంశంపై బహిరంగంగా వ్యాఖ్యలు చేయకుండా నిలువరించాలని కోరుతూ మానూరు శ్రీనివాస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు పెండింగ్ లో ఉన్నందున ,తాము జోక్యం చేసుకోలేమన్న సుప్రీంకోర్టు న్యాయస్థానం.లడ్డూ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ ను ధర్మాసనం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే సీబీఐకి తెలియజేయాలని సూచన లడ్డూల కల్తీనెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని పిటిషన్‌లో శ్రీనివాస్ పేర్కొన్నారు. దీనిపై తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని చెప్పడానికి మీరేమైనా నిపుణులా అని పిటిషనర్ తరపున న్యాయవాదిని ప్రశ్నించింది. కల్తీ నెయ్యి వ్యవహారంలో ఏదైనా ఆధారాలుంటే సిబిఐకి ఇవ్వాలని పిటిషనర్‌ను ఆదేశించింది. కల్తీనెయ్యి వ్యవహారంలో సిబిఐ విచారణ చేస్తుండటంతో ఏమైనా ఆధారాలు ఉంటే సిబిఐకి ఇవ్వాలని ఆదేశించింది. ఇంకా ఈ కేసులో ఏకసభ్యకమిటీ విశ్రాంత ఐఎఎస్ దినేశ్‌కుమార్ కూడా విచారణ చేపడుతున్నారు. ఆయన ఇప్పటికే కొనుగోళ్ళకమిటీ జిఎంనుండి పలు కీలక ఆధారాలు రాబట్టారనేది సమాచారం. మరీ రానున్న వారంలో ఎలాంటి పరిణామాలు జరగనున్నాయనేది కలకలం రేపనుంది.

## సంక్షేమం, అభివృద్ధితో తెలంగాణ ప్రజలు సుభిక్షం

**- తిరుమల ఆలయం తరహాలో వేములవాడ అభివృద్ధి - తెలంగాణ విప్ ఆదిశ్రీనివాస్**



**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధితో, సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని తిరుమల శ్రీవారిని వేడుకున్నట్లు తెలంగాణ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు.తెలంగాణలో దక్షిణకాశిగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులు నిరాటంకంగా కొనసాగాలని ఏడుకొండల స్వామిని ప్రార్థించానన్నారు. మరో వెయ్యిసంవత్సరాలు భక్తుల రద్దీకి సరిపడే సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. 150కోట్ల రూపాయలతో నాలుగు ఎకరాలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. తిరుమల ఆలయం తరహాలో వేములవాడను అభి వృద్ధి చేయాలని నిర్ణయించుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో పీఠాధిపతులు



**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం స్వామీజీలు, పీఠాధిపతులు దర్శించుకున్నారు. ఉదయం శృంగేరి శారదాపీఠం పీఠాధిపతి విధుశేఖరభారతి మహాస్వామి, గోవిందానంద సరస్వతి స్వామి శిష్యులతో కలసి ఆలయం వద్దకు విచ్చేశారు. స్వామివారికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,ఆలయ పేష్కార్‌రామకృష్ణ ఆలయమర్యాదలతో మహద్వారం వద్ద స్వాగతం పలికారు.పీఠాదిపతులు ఆలయంలోపలకు చేరుకుని తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకులమండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టిటిడి సర్వశ్రేయస్ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకుదాతలు తమ వంతుగా విరాళాలందిస్తున్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన పెరి రాధిక వేంకటేశ్వర సర్వ శ్రేయస్ ట్రస్ట్‌కు 10 లక్షల రూపాయలు విరాళ డిడిని టిటిడి ఇఒకు అందజేశారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి ఉన్నారు.

## తిరుపతి వకుళమాత ఆలయంలో బాసర తరహా 'అక్షర గోవిందం'

### - చిన్నారుల అక్షరాభ్యాసంలో ప్రత్యేక కిట్

**తిరుమల,మార్చి 13ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ పేరూరులోని వకుళమాత ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేసే కార్యక్రమం శ్రీకారం చుట్టనుంది. ఇప్పటికే అక్షరగోవిందం పేరుతో టిటిడి బోర్డు ఈ కొత్త కార్యక్రమానికి అమోదించింది. ఇక అందుకు తగ్గ కార్యాచరణ రూపొందిస్తున్నారు. తెలంగాణలో బాసరలోని జ్ఞానసరస్వతి ఆలయంలో తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి వకుళమాత ఆలయంలో కూడా చిన్నారులకు అక్షరాభ్యాసం చేసేందుకు సమాయత్తమవుతోంది.ఇందుకు "అక్షర గోవిందం"నామకరణంచేశారు. ఇందులో భాగంగా చిన్నారులకు ప్రత్యేక కిట్ ఇవ్వనుంది. ఈ అక్షరాభ్యాస వేడుక ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో, స్వామి వారి మాతృమూర్తి వకుళ మాత సన్నిధిలో చిన్నారుల అక్షరా భ్యాసం నిర్వహణ కు వీలుగా టిటిడి కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రారంభ దశలో కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనుంది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఈ అక్షర గోవిదం ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. చిన్నారులకు ఏడు వస్తువులతో కిట్ అందజేయనున్నారు. అక్షరాభ్యాసానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కూడా ఎంపిక చేశారు. ఆలయానికి తూర్పు వైపున వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేదిక పై వేంకటేశ్వర స్వామి, పద్మావతి, సరస్వతీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆ ప్రాంగణంలో చిన్నారులతో అక్షరాలు దిద్దించనున్నారు. అక్షరాభ్యాసం తర్వాత పిల్లలకు "అక్షర గోవిందం" పేరిట కిట్ ఇవ్వనున్నారు. ఈ కిట్ లో పలక, బలపాల ప్యాకెట్,శ్రీవారి అక్షతలు, అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, పటిక బెల్లం (కలకండ) ప్రసాదం ప్యాకెట్, వినాయకుడుసరస్వతీదేవి వేంకటేశ్వర స్వామితో కూడిన చిత్రపటం (ఫ్రేమ్) ఉంటాయి.

వార్త

ప్రతి ఒక్కరూ ఒక విషయాన్ని గురించి తరచుగా ఆలోచిస్తుంటారు. దాన్ని గురించి బహిరంగంగా చెప్పగలవాడే విజయవంతమైన రాజకీయవేత్త.

- థియోడర్ రూజ్వెల్ట్

# మరో అభిశంసన!

కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న 'సర్' ప్రక్రియ ఆ సంస్థ ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై అభిశంసన తీర్మానం వరకు తీసుకెళ్లింది. ఆది తతనుంచి ఈ ప్రక్రియలో లోపాలపై విపక్షాలు విరుచుకుపడుతూనే ఉన్నా సిఇసి వ్యవహారశైలి ప్రజల్లో కానీ విపక్ష నేతల్లో కానీ విశ్వాసం నింపలేకపోతోంది. మూడు రోజుల క్రితం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పశ్చిమ బెంగాల్‌కు వెళ్లినప్పుడు తనను కలిసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలను చిరాకుపడిన సన్నివేశాలు వారిని బాధించాయి. ఇన్నాళ్లూ 'సర్' ప్రక్రియలో లోపాలు ఎత్తిచూపినప్పుడల్లా సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటూ విపోఆలను సముదాయిస్తూ వచ్చింది. కాగా మొదట్లో విపక్షనేత రాహుల్ గాంధీపై సిఇసి సవాళ్లు విసరడంతో వివాదం ముదిరి పాకానపడింది. ఓటర్ల జాబితా సవరణ విషయంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టు తలుపు తట్టాక ఆమెపై సిఇసి గుర్రుగా ఉన్నారు. ఆ నేపథ్యంలోనే సిఇసి ఆ రాష్ట్రానికి వెళ్లినప్పుడు కలిసిన తృణమూల్ నేతల బృందంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వారికి కోపకారణమైంది. బీహార్ రాష్ట్రంలో ఓటర్ల సవరణ ప్రక్రియ మొదలయ్యాక కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ఎన్నికల కమిషన్‌పై తిరుగుబాటు మొదలైంది. వలస జీవుల ఓట్లు తీసివేయడం అక్రమమంటూ చేపట్టిన ఉద్యమం తారాస్థాయికి చేరింది. సుప్రీంకోర్టు కెక్కిన 'సర్' వివాదంలో ధర్మాసనం తీవ్రంగానే స్పందించింది. ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు సూచనలు, మార్గదర్శకాలు ఇస్తూ ఓ కొలిక్కి తెచ్చింది. సిఇసి కేంద్రంలోని అధికార పార్టీ చెప్పుచేతల్లో నడుస్తోందని అనేక ఆరోపణలున్నా బీహార్‌లో అక్కడి అధికార ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీయే గెలుపొందడంతో ఆతర్వాత కాంగ్రెస్ పార్టీ కాస్తంత మెతకబడింది. కానీ ఈసారి విపక్ష పార్టీలోని ఇతర భాగస్వామ్య పార్టీలు వాళ్ల అధికారంలో ఉన్న రాష్ట్రాలలో తమ ఓటర్లను తొలగించి సిఇసి ఎక్కడ అపకారం చేస్తుందోనన్న భయంతో రాహుల్ గాంధీ ఉద్యమాన్ని వాళ్లు అందిపుచ్చుకున్నారు. కాగా ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటూ మరికొన్ని రాష్ట్రాలలో ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తి చేసింది. మరో 11రాష్ట్రాలలో ఇదే కార్యక్రమాన్ని చేపట్టడానికి సన్నద్ధమైంది. త్వరలో దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. నేడో రేపో ఎన్నికల ప్రకటన జారీ అయ్యే అవకాశముంది. ప్రస్తుతం తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలలో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల ఎన్నికలు మరింత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం కృతనిశ్చయంతో ఉంది. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ ప్రక్రియపై నిఘా ఉంచే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇంతక్రితం బీహార్‌లోనూ ఇదే జరిగింది. ఇదిలాఉండగా పశ్చిమ బెంగాల్ ఓటరు జాబితా ముమ్మర సవరణ (సర్)లో పేరు నమోదుకు నోచుకోలేకపోయినా, తిరస్కృతికి గురైన వారి విజ్ఞప్తులను న్యాయధికార్లే పరిశీలన చేస్తారని, వారి సేవలపై ఎలాంటి అనుమానాలు కూడదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం హితవు చెప్పింది. 'సర్'పై లేవనెత్తిన విమర్శలు, తద్వారా ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ ప్రక్రియలో ఏమాత్రం ఆస్కారం ఉన్నా సందేహాలు వ్యక్తం చేయడం పరిపాటిగా జరిగింది. సుప్రీంకోర్టు ఈ అంశంలో ఎన్నోసార్లు జోక్యం చేసుకుని ఉభయ వర్గాలకు ఎన్నో హితబోధలు చేసింది. అయినా ఈ ప్రక్రియపై ఆరోపణల పరంపర కొనసాగుతూనే ఉంది. ఓటరు జాబితాలనుంచి పేర్ల తొలగింపును ఎదుర్కొంటున్న వారి అభ్యంతరాలను పరిష్కరించే బాధ్యతను న్యాయాధికారులకు ఇవ్వరాదన్న పిటీషన్లపైతాజాగా సుప్రీం తీవ్రంగా స్పందించింది. ఇలాంటి పిటిషన్లతో న్యాయాధికారుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేందుకు జరిగే ప్రయత్నాలపై తీవ్ర చర్యలు తప్పవని ధర్మాసనం హెచ్చరించింది. ఓటర్ల అర్జీల పరిష్కారం కోసం స్వతంత్రఅప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఏర్పాటు, వాటికి హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తులే సారథ్యం వహిస్తారు. ఇంత స్పష్టంగా సుప్రీంకోర్టు చెబుతున్నా బెంగాల్ నుంచి అనేక సందేహాలు తలెత్తితే ఈసారి వారి అభ్యంతరాలను పట్టించుకునేవారుండకపోవచ్చు. అర్హులైన ఓటర్లనెవరినీ తొలగించబోమని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ ఎంతో స్పష్టంగా వివరించారు. కానీ ఆయన కదలికలను కూడా భరించలేని పరిస్థితుల్లో విపక్షాలుండటం సమంజసం కాదు. రాబోయే పశ్చిమబెంగాల్ ఎన్నికలలో 6వేల మందికి పైగా శతాధిక వృద్ధులు, 5.23 లక్షల మంది యువజనులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారని సిఇసి ప్రకటించారు. సిఇసి కోల్‌కతా పర్యటనలో నిరసనలు వ్యక్తమయ్యాయి. కొందరు నల్ల జెండాలతో 'గో బ్యాక్' నినాదాలు చేశారు. ఇలాంటివి ప్రజాస్వామ్యబద్ధమేనని చెప్పుకున్నా సరైన పద్ధతి కాదు. శాసనసభ గడువు ముందే ఎన్నికలు జరగడం రాజ్యాంగ బద్ధమే. కానీ ఎన్నికల వ్యవస్థపై పదేపదే వివాదానికి దిగడం అరాచకమే అవుతుంది. ఏమైతేనేం చివరాఖరికి పశ్చిమబెంగాల్ చిచ్చు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసన తీర్మానానికి నోటీసులిచ్చారు. సిఇసిది రాజ్యాంగపదవి కనుక ఆయన వ్యవహారశైలి విపరీతంగా ఉన్నందున ఆయనను తొలగించారని 130 మంది లోక్‌సభ, 63 మంది రాజ్యసభ సభ్యులు అభిశంసన తీర్మానం నోటీసును శుక్రవారం ఉభయసభల్లోనూ ప్రవేశపెట్టారు. సిఇసి తొలగింపు కోరే తొలి నోటీసు ఇది. ఇలాంటి నిరసన వ్రతం లోక్‌సభ చరిత్రలో ఇదే ప్రథమం.



నొప్పించే మాటలు, అసూయ, దురాశ, కోపం వంటి దుర్లక్షణాలు మానండి. అదే న్యాయ సంగతమైన మార్గం అవుతుంది.

తిరువళ్ళువర్



ప్రతి వ్యక్తి తన కోర్కెలు, అనుభూతులు నిష్పత్తిని బట్టి బీదవారుగాని, ధనవంతులుగాని అవుతారు.

వి.జాన్సన్

# ప్రజావాక్కు



### వంట గ్యాసు.. సరఫరాలో లాసు

వంటగ్యాసు సిలిండర్ బుక్ చెయ్యడానికి పదేపదే ప్రయత్నిస్తున్నా ఏజెన్సీ నుండి స్పందన లేదు. చాలా మందికి ఇదే సమస్య మొదలైంది. ధర పెరగడం పక్కన పెడితే సరఫరాకూడా పట్టాలుతప్పింది. కారణంసుస్పష్టం. అమెరికా ఇరాన్ యుద్ధంమధ్యలో ప్రపంచ ఇంధన భద్రత చితికిపోతోంది. మన దేశం అందుకు అతీతం కాదు కానీ ఇంతత్వరగా దుష్ప్రభావాలు సోకడం ఆలోచించదగ్గ ది. ఎలాంటి విధానాల ద్వారా బాహ్య ప్రభావాల్ని తక్కువ నష్టానికి నియంత్రించగలమో, పరాధీనత నుండి బయట పడగలమో ఆలోచించి, అమలు చేయకపోతే ముమ్ముందు కష్టం. ఇకవంటగ్యాసు విషయానికివస్తే దాదాపు60 శాతం వరకూ దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. పశ్చిమాసియా నుండి హోర్ముజ్ జలసంధి మార్గంలో రాకపోకలు మూసుకుపోయాయి.

- డా.డి వి జి శంకరరావు, విజయనగరం

### ప్రజల్లో నమ్మకం కలిగించాలి!

ప్రజల ఆరోగ్యం ఏప్రభుత్వానికైనా అత్యంత ప్రాధాన్యమైన అంశం. ఆరోగ్యకరమైన సమాజం దేశ అభివృద్ధికి పునాది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులు సామాన్య ప్రజలకు ప్రధాన ఆధారంగా నిలుస్తాయి. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆస్పత్రులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే ఇంకాచాలామందిలో ప్రభుత్వ ఆస్పత్రులపై పూర్తి స్థాయి నమ్మకం ఏర్పడలేదనే అభిప్రాయం కనిపిస్తోంది. ఈపరిస్థితిని మార్చడం అత్యవసరం. గత కొన్ని సంవత్సరాలలో ప్రభుత్వాలు ఆరోగ్య రంగంపై గణనీయమైన పెట్టుబడులు పెట్టాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### చర్యలు తీసుకోవాలి

నెల్లూరు జిల్లా కలెక్టరు రెవిన్యూ విషయంలో పరిష్కారంలోనంబరు వన్ అనేది అబద్ధం. దొంగస్వామి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవలసిన ప్రిన్సిపల్ సెక్రటరి 2021 లోఆదేశిస్తే ఇంతవరకు అమలుకాలేదు. దొంగస్వామివత్తిళ్లకు లొంగినఅధికారులు అలైనేషన్ పేరుతో ఎదో ఒక రేటుకుదొంగస్వామికి అమ్మాలని చూస్తున్నారు. వీరిపై చర్యలుతీసుకోవాలి.

-నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### చిన్నారుల ఆర్తనాదాలు

యుద్ధం అంటే కేవలం రెండు దేశాల మధ్య సరిహద్దు వివాదమో, ఆయుధాల ప్రదర్శనో కాదు. అది మానవత్వంపై పడే ఒక తీరని మచ్చ. బాంబుల మోత, తుపాకుల గర్జనల మధ్య చితికిపోతున్నది సామాన్యుల బతుకులేకాదు, రేపటి పౌరులైన చిన్నారుల భవిష్యత్తు కూడా. ఇటీవలి కాలంలో వైరల్ అయిన ఒక చిన్నారి వీడియో 'ఆకలితో అలమటిస్తున్నాం.. దయచేసి యుద్ధాలు వద్దు' అన్న ఆ వేడుకోలు.. ఆధునిక నాగరికత అని చెప్పుకుంటున్న ప్రపంచ సమాజపు మనస్సాక్షిని నిలదీస్తోంది. ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య దాడులు ఇప్పుడు పరిధి దాటాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, శరణార్థి శిబిరాలు అనేవిచక్షణ లేకుండా కురుస్తున్న బాంబుల వర్షంలో వేల సంఖ్యలో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, గాజానేడు 'చిన్నారుల శ్మశానవాటిక'గా మారింది.

-ఇ. శ్రీనివాస్ రావు, హైదరాబాద్

### గత ప్రభుత్వ పథకాలు అమలు చేయండి

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99రోజుల దినోత్సవం సందర్భంగా డబుల్ బెడ్ రూమ్లను వెంటనే ఇవ్వవలెను. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇప్పుడు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఇవ్వటానికే లబ్ధిదారులకు కేటాయించాల్సి నది కేటాయిస్తే తమకేమి నష్టం వాటిల్లుతుందో అర్థం కావటం లేదు. ప్రజలను ఒకరకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించి ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. గ్యారెంటీ వారంటీ అనుకుంటూ ఓట్లు దండుకోవటం తప్ప ప్రజలకు మేలుచేకూర్చే బాగోగులు చూసే పథకాలను ప్రణాళిక వినియోగించడం తీసువచ్చి ప్రజలకు లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

-సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### యుద్ధంతో పెరుగుతున్న ఆకలికేకలు

అమెరికా ఆధిపత్య ఆకలికి మరొక దేశం మాత్రమే కాదు ప్రపంచంలో ఉన్న సరఫరా చైన్ సిస్టం అంత ఆగం అవుతున్నది. ఇప్పుడు ఏమికావాలి ఇన్ని రోజులు వివిధదేశాల మధ్య తగాదాలు పెట్టి ఆయుధాలు అమ్ముకొని బ్రోకరిజం చేసిన అమెరికా నేడు చమురుకొరతను సృష్టించి ఆ అవకాశాన్ని వాడుకొని సొమ్ము చేసుకోవాలి అని చూస్తున్నది. దీంతో అమెరికా వ్యాపారం స్థితిని విస్తరింపజేసుకోవడం, ఆధిపత్యం వహించి చైనాకు అడ్డుకట్ట వేయడం ఈరెండుఎజెండాలతో ముందుకి వెళ్తున్నది.

-భారత అవినాష్, జనగామ

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రైతు బతుకుతో ఆటలాడొద్దు!

**వారికున్న ఏకైక ఉపాధి వారిపాలిట మృత్యువుగా పరిణమించకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ఇదే పరిస్థితి కొనసాగి రైతులు వ్యవసాయానికి మంగళం పాడితే పరిస్థితి ఏమిటో పాలక పెద్దలు ఆలోచించాలి. సాంకేతికంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటూ ఎంత అభివృద్ధి సాధించినా మనిషి జీవనానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావలసిన ఆహారోత్పత్తులు వారి 'చెమట' పుణ్యమేననే విషయాన్ని గుర్తుంచుకోవాలి.**

దామెర్ల సాయిబాబ

ఎవరి గోల వారికి ఆనందం అంటారు. నిరంతరం రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాలు, ఎత్తులు, పై ఎత్తులు, ఇంకొక పక్క ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ వంటి తదితర కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులు, మరోవైపు రాష్ట్రాల ఆధీనంలో ఉన్న ఎసిబి, సిఐడి, సిట్‌ల దర్యాప్తులతో రాజకీయ పార్టీలు మునిగితేలుతుంటే సామాన్యుడు అనేక సమస్యలతో అతలాకుతలం అవుతున్నాడు. అటు పార్లమెంటులో కానీ, ఇటు ఆయా రాష్ట్ర శాసనసభల్లో జరుగుతున్న సమావేశాల్లో కానీ సామాన్యుల సమస్యలేవీ కనీసం ప్రస్తావన లేకుండాపోతున్నాయి. దేశంలో కానీ, రాష్ట్రాల్లో కానీ ఏ సమస్యలు లేనట్లు రాజకీయంగానే చర్చోపచర్చలు జరుగుతున్నాయి. అవిశ్వాస తీర్మానాలు, నిరసనలు, వాక్ అవుట్లతో పుణ్యకాలం గడిచిపోతున్నది. వాస్తవంగా చూస్తే దేశప్రజలు అనేక గడ్డు సమస్యలను ఎదుర్కొంటున్నారు. కరోనా రక్కసి సృష్టించిన బీభత్సం నుండి ఇంకా ఎన్నో రంగాలు పూర్తిగా కోలుకోలేదు. కరోనా సమయంలో అంత క్లిష్టపరిస్థితిని ఎదుర్కొని నిలబడ్డ వ్యవసాయరంగం పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. రోజురోజుకు కుదేలైపోతున్నది. తమను ఎవరు ఎంతకాలం మోసం చేసినా, తమలో తాము కుమిలిపోవడం తప్ప అన్నదాతలు నోరు విప్పరు. బాధ కలిగినప్పుడు ఏడిస్తే ఉపశమనం కలుగుతుందంటారు. అందుకే ఎవరైనా చనిపోయినప్పుడు వారి ఆత్మీయులు ఏడుస్తుంటే ఆపకుండా ఏడవనిస్తారు. దీంతో వారికి బాధ, భారం తగ్గినట్టు భావం కలిగి ఊరట చెందుతారు. అలాగే కొన్ని సందర్భాల్లో బాధ, నష్టం కలిగించినవారిపై ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది. వారిని తిట్టడంతోనో, కొట్టడంతోనో లేక వారికి రెట్టింపు నష్టం చేయడంలోనో కొందరు సంతృప్తి చెందడం పరిపాటి. అలాంటి వారిపై చర్యలు తీసుకోలేని నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు మళ్లీ రోదనే శరణ్యం. ఏడుపుల ద్వారా తాత్కాలిక ఉపశమనం పొందినా, సమస్య పరిష్కారం మాత్రం కనుచూపుమేరలో కన్పించదు. అలాంటి పరిస్థితుల్లోనే గత్యంతరం లేక ఆత్మహత్యలవైపు మొగ్గుచూపుతున్నారు. గత మూడు దశాబ్దాల్లో దేశంలో దాదాపు నాలుగున్నర లక్షలమంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకొన్నట్లు సమాచారం. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి. ప్రకృతి పెట్టే ఇక్కట్లు కొన్ని అయితే తోటి మానవుడు పెడుతున్న బాధలు మరికొన్ని. ప్రకృతి సిద్ధంగా వస్తున్న ఇబ్బందులు ఎదుర్కోవడానికి మానవుడు కొంతమేరకు సిద్ధమవుతుంటాడు. అందులో భాగంగానే తుఫాన్ బీభత్సం, కరవు కాటకాలతో వచ్చే బాధలను మోయగలుగుతున్నాడు. కానీ తమకు సేవ చేస్తానంటూ, తోటిమానవుడు చేస్తున్న దగాలను భరించలేకపోతున్నాడు. అలాగని ఎదురించి నిలదీయలేకపోతున్నాడు. అందుకే వ్యవసాయం వ్యాపకంగా జీవనం సాగించాలనుకుంటే ముందుగా ఏడ్వడం నేర్చుకోవాలంటారు పెద్దలు. ఎంతో అనుభవంతో పెద్దలు ముందుచూపుతో చెప్పిన మాటలివి. రైతుల కష్టాలు విత్తేదగ్గర నుంచి విక్రయించేవరకు కొనసాగుతున్నాయి. నకిలీ, నాసిరకం విత్తనాలతో మోసపోయి పెట్టిన పెట్టుబడి సర్వం కోల్పోయినప్పుడు ఆగ్రహావేశాలు ఆపుకోలేక బాధ్యులైనవారిని నిలదీస్తే వారిని దాడి చేయడానికి వచ్చారని కేసులు పెట్టి పోలీసులకు పట్టిస్తారనే భయంతో ఏమీ చేయలేక నిస్సహాయకస్థితిలో మౌనరోదనకుగురవుతున్నారు. ఇలా ఒక సందర్భంలో కాదు, కరెంటు సమస్య వచ్చినా, మోటారు కాలిపోయి పొలం ఎండిపోతున్నా, నకిలీ పురుగు మందులు, ఎరువులతో దగాపడినా, వీటన్నింటిని మించి పండిన పంటను అమ్ముకోనే సమయంలో తరుగు, తూకం పేరుతో కళ్లముందే తమ కష్టార్జితాన్ని కొల్లగొడుతున్నా మళ్లీ

## ఒక్క మాట

దుఃఖపడటమే తప్ప ఏమి చేయలేని నిస్సహాయస్థితి. అన్నింటికంటే మించి రైతుల సంక్షేమమే తమ లక్ష్యం, ధ్యేయం అంటూ తాము కట్టే పన్నులతో జీత భత్యాలు నెలనెలా తీసుకొంటున్న కొందరు అధికారులు భక్ష కులుగా తయారై దళారులకు రక్షకులుగా మారి అన్నదాతల కడుపు కొడుతున్నా మౌనరోదనే శరణ్యం అవుతన్నది. గతంలో ఎన్నో ప్రయాసలకు ఓర్చి పండించిన పంట ఇంటికి చేరుకోగానే హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకునే రైతులకు ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. పండించిన పంటలు మార్కెట్‌కు వచ్చి ధర నిర్ణయమై డబ్బులు చేతికి వచ్చేవరకు టెన్షన్‌లోనే బతుకుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అన్నదాతల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా దళారులు రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. కొనుగోళ్లలో జరుగుతున్న మోసాలు అన్నీఇన్నీ కావు. ఉన్నత స్థాయిలో ఆదేశాలు, నిబంధనలు అన్ని సక్రమంగానే ఉన్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ముఖ్యంగా కొందరు అధికారులు, మరికొందరు ప్రజాప్రతినిధులు, ఇంకొందరు మిల్లర్లు దళారులతో మమేకం కావడంతో అన్నదాతల కష్టాలు పరాకాష్టకు చేరుకొన్నట్లు సమాచారం. దంచేవాడు బుక్కకుండా ఉంటాడా అన్నట్లు ఎవరు ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ రైతన్నలను దోచుకునేందుకు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా తూనికలు, కొలతల శాఖ మామూళ్ల మత్తులో జోగుతున్నదేమోననిపిస్తున్నది. ఈ అవినీతి అధికారుల నుండి రైతన్నలను కాపాడాలి. ఇక కొన్ని ప్రాంతాల్లో ధాన్యం అమ్మిన తరువాత డబ్బులు ఇవ్వడానికి నెలలు కాలం పడుతున్నదనే రైతుల ఆవేదన. ఇలా అన్ని వైపులా బాధలు ఎక్కువ కావడంతో తమలో తాము కుమిలిపోతున్నారు. చివరకు ఆనాటి పెద్దలు చెప్పిన ఏడుపులు కూడా వారికి ఉపశమనం కలిగించలేకపోతున్నాయి. ప్రస్తుతం టమోట, ఉల్లి రైతుల పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉంది. పెట్టిన పెట్టుబడి కూడా అందే పరిస్థితి లేదు. ఇక మొన్న చిత్తూరు జిల్లాలో పూల రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన వందలాది టన్నుల బంతి, కనకాంబరాలు, తదితర పూలను కొనేవారు లేక రోడ్లపై పోసేసారు. ఈసారి మామిడి పంట పరిస్థితి కూడా ఆశాజనకంగాలేదు. వాతావరణంలో వచ్చిన మార్పు కారణంగా వ్యాపించిన తెగులుతో చాలా మామిడి తోటల్లో పూత రాలిపోయింది. యేడాది పాటు కష్టం చేసి కాపాడిన పంట తెగుళ్లకు బలి కావడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. వ్యవసాయం కాక మరేదైనా జీవన విధానం ఎన్నుకోగలిగినా లభించినా, చిన్న, పెద్ద అనే తేడాలేకుండా అధికశాతం రైతులు వ్యవసాయాన్ని విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కొందరు వ్యవసాయానికి తిలోదకాలు ఇచ్చారు. ఏరైతు తమ సంతానాన్ని వ్యవసాయం చేయించడానికి ఏమాత్రం ఇష్టపడటం లేదు. దేశవ్యాప్తంగా వ్యవసాయరంగం తీవ్రసంక్షోభంలో ఉన్నదనేది కాదనలేని వాస్తవం. సకాలంలో సరైన పెట్టుబడి పెట్టినా, ఫలితం పొందలేక రుణభారంతో కృంగిపోతూ మరోసారి ప్రకృతి పర్యావరణం వల్ల నష్ట పోతూ, అప్పుపుట్టక, ఇల్లు గడవక దేశవ్యాప్తంగా ఎన్ని కోట్ల కుటుంబాలు అవమానాలు భరిస్తూ హృదయవేదనతో జీవచ్ఛవంలా బతుకు వెళ్లదీస్తున్నారో చెప్పలేం. యేడాది పొడుగునా కుటుంబానికి అయ్యే అన్ని ఖర్చులు వ్యవసాయం మీదనే రాబట్టుకోవడం కష్టసాధ్యమవుతున్నది. పిల్లల చదువులు, మందులు, బట్టలు, అన్ని ఖర్చులకు అన్నదాతలు వ్యవసాయం మీదనే ఆధారపడాల్సి ఉంది. ఈఖర్చులన్నీ విపరీతంగా పెరిగిపోయాయి. కానీ వ్యవసాయం మీదవస్తున్న ఆదాయం అంతంత మాత్రమే. దేశంలో అన్నదాతల సగటు ఆదాయం నెలకు పదమూడువేల ఆరు వందల అరవై ఒక్క రూపాయి మాత్రమే. అందుకే కొందరు రైతులు మిర్చి, పత్తి లాంటి అధిక ఆదాయం ఉండే వాణిజ్యపంటలవైపు మొగ్గుచూపి ప్రాణాల మీదకు తెచ్చు కుంటున్నారు. వాణిజ్యపంటల సాగు ఒక జూదంలా తయారైంది. పంటలు సమృద్ధిగా పండి రైతుల ఆర్థిక పరిస్థి తులు బాగుపడాలంటే రుణవసతి, నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని క్రిమిసంహారక మందులు, ఎరువులు, నీటి వసతి, వీటన్నింటిని మించి గిట్టుబాటు ధర ప్రధానమైనది. ఇందులో ఎక్కడ లోపం జరిగినా రైతు దెబ్బతినక తప్పదు. కేంద్ర, రాష్ట్ర పాలకులు వ్యవసాయం విషయంలో మనసు పెట్టి ఆలోచించాల్సిన తరుణమిది. వారికున్న ఏకైక ఉపాధి వారిపాలిట మృత్యువుగా పరిణమించకుండా చర్యలు తీసుకో వాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ఇదే పరిస్థితి కొనసాగి రైతులు వ్యవసాయానికి మంగళం పాడితే పరిస్థితి ఏమిటో పాలక పెద్దలు ఆలోచించాలి. సాంకేతికంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటూ ఎంత అభివృద్ధి సాధించినా మనిషి జీవనానికి ఆహారం తప్పనిసరి. ఇంత పెద్ద జనాభాకు కావలసిన ఆహారోత్పత్తులు వారి 'చెమట' పుణ్యమేననే విషయాన్ని గుర్తుంచుకోవాలి. •

# చరిత్ర ఎప్పుడూ పోరాడేవాళ్ల పక్షమే!

మహమ్మద్ ఆరిఫ్

అమెరికా ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖుమేనీ వీరమరణం పొందారు. అయితే ఘర్షణలు తీవ్రమైన సమయంలోనే ఇరాన్‌ను విడిచిపెట్టి రష్యాకు రావాలని అక్కడి పాలకులు ఆహ్వానించినా.. ఆయన తిరస్కరించినట్టు కొన్ని నివేదికలు చెప్తున్నాయి. బంకర్‌లో తలదాచుకోవాలని చెప్పినా ససేమీరా అన్నట్లు వార్తలు వస్తున్నాయి. రణక్షేత్రాన్ని విడిచి పారిపోయేది లేదని, తల వంచేది లేదని ఆయన తెగేసి చెప్పినట్లు సన్నిహితులు చెప్తున్నారు. అయితే ఈ పరిణామం మరోసారి ఒక చారిత్ర సత్యాన్ని ప్రపంచానికి గుర్తు చేస్తున్నది. జీ హుజూర్ అని బానిసలా బతకడం కంటే నమ్ముకున్న సిద్ధాంతం కోసం, దేశం కోసం పోరాడి వీరమరణం పొందిన వారినే చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. చరిత్ర ఎప్పుడూ సింహాసనాల మీద కూర్చున్న వాళ్లను గుర్తుంచుకోలేదు. ఆ సింహాసనాలను ఎదిరించి ప్రాణాలు త్యాగం చేసిన వాళ్లనే ఆరాధించింది. ఇందుకు ఇస్లాం హిస్టరీలో కర్బలా మైదానమే ఒక పెద్ద ఉదాహరణ. ఆనాడు వేలాది మంది యజీద్ సైన్యం ముందు హజ్రత్ హుస్సేన్ తన చిన్నపాటి అనుచరణ గణంతో కలిసి పోరాడి ప్రాణత్యాగం చేశారు. ఆ క్షణంలో అది ప్రత్యర్థి విజయంగా కనిపించి ఉండొచ్చు. కానీ శతాబ్దాలు గడిచినా ప్రపంచం నేటికీ కన్నీటితో స్మరించుకుంటున్నది, ధర్మానికి ఆదర్శంగా తీసుకుంటున్నది హజ్రత్ హుస్సేన్ త్యాగాన్నే. అధికార మదంతో అణచివేయాలని చూసే వారి ముందు మోకరిల్లడం కంటే ధర్మం కోసం, న్యాయం కోసం ప్రాణాలివ్వడమే నిజమైన గెలుపు అని ఆ ఘట్టం నిరూపించింది. ఆధునిక ప్రపంచంలోనూ అగ్రరాజ్యాల ఆధిపత్యాన్ని ఎదిరించి ప్రాణాలు కోల్పోయిన నాయకులు అనేకం ఉన్నారు. అమెరికా ఆధిపత్యాన్ని ఎదిరించి చమురు దిగ్బంధనంతో పాశ్చాత్యదేశాలను గడగడ



లాడించిన సౌదీ పాలకుడు షా ఫైజల్ సైతం తన ధిక్కార స్వరానికే ప్రాణాలను మూల్యంగా చెల్లించుకున్నారు. సామ్రాజ్యవాదుల కుట్రలకు బలైనా, ఆయన పోరాట స్ఫూర్తిఅరబ్ ప్రపంచంలో నేటికీ ఒక చెరగని ఆదర్శంగా నిలిచిపోయింది. ఇరాక్ పాలకుడు సద్దాం హుస్సేన్ అమెరికా దళాలలోఆఖరి వరకు పోరాడి, శత్రువు చేతికి చిక్కి ఉరికంబం ఎక్కారు. లిబియా నేత గడాఫీ సైతం పశ్చిమ దేశాల దాడులను ఎదిరించి, దారుణ హత్యకు గురయ్యారు. వారి రాజకీయ విధానాల్లో తప్పొప్పులు ఎలా ఉన్నా అగ్రరాజ్యాల ముందు మోకారిల్లడానికి బదులు వారు పోరాట మార్గాన్నే ఎంచుకున్నారు. వారి ధిక్కార స్వరాన్ని వారి మద్దతుదారులు ఎప్పటికీ మరిచిపోలేరు. క్యూబా విప్లవవీరుడు చేగువేరా సైతం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తుదిశ్వాస వరకు పోరాడి బొలీవియా అడవుల్లో నెత్తుటి నేలపై ఒరిగారు. నేటికీ ప్రపంచవ్యాప్తంగా యువత గుండెలపై ఆయనబొమ్మె స్ఫూర్తిగా నిలవడానికి కారణం ఆ పోరాట పటిమే. మన దేశ చరిత్రలోనూ ఇలాంటి పోరాటయోధులకు కొదవలేదు. గొర్రెల్లా వందేళ్లు బతకడం కన్నా సింహంలా ఒక్క రోజు బతకడం మేలు అని చాటిచెప్పిన మైసూర్ పులి టిప్పుసుల్తాన్ బ్రిటిష్ సైన్యంతో యుద్ధభూమిలో పోరాడుతూ ప్రాణాలు వదిలారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజల స్వేచ్ఛ కోసం భగత్ సింగ్ కేవలం ఇరవై మూడేళ్ల వయసులోనే ఉరికంబంఎక్కారు. మన్యం వీరు అల్లూరి సీతారామరాజు గిరిజనుల హక్కుల కోసం బ్రిటీష్ తుపాకులకు ఎదురొడ్డి ప్రాణాలు వదిలారు. సుభాష్ చంద్రబోస్ లాంటి వీరులు విదేశీగడ్డపై సైన్యాన్ని సమీకరించి, పోరాడి అదృశ్యమయ్యారు. వీరంతా తమ ప్రాణాలను పణంగా పెట్టారుకాబట్టే నేటికీ మనగుండెల్లో చిరంజీవులుగా నిలిచిపోయారు. విజయం సాధించినట్టు కనిపించిన వారంతా చరిత్రపుటల్లో నిలిచిపోరు. కానీ ఒక ఆదర్శం కోసం, తమ దేశ ప్రజల కోసం, స్వాతంత్ర్యంకోసం, బానిస సంకెళ్ల నుంచి విముక్తి కోసం ఆఖరి రక్తపు బొట్టు వరకు పోరాడిన వారు మాత్రం మరణం లేని మహనీయులవుతారు. పోరాటంలో ఓటమి ఎదురైనా ప్రాణాలు కోల్పోయినా సరే రాబోయే తరాలకు వారు ఒక చెరగని స్ఫూర్తిగా మిగిలిపోతారు. ప్రాణభయంతో ఆధిపత్య శక్తులకు జీ హుజూర్ అన్న వారు కాలగర్భంలో కలిసిపోతారు. •

# నవ నేపాల్‌కి ఆశాకిరణం బాలేన్ షా



డాక్టర్ తిరుణహరి శేషు

రాజకీయ అస్థిరతకి మారుపేరైన ఈ హిమాలయ దేశంలో జెన్ జీ యువత ఆధ్వర్యంలో 2025 సెప్టెంబర్‌లో నేపాల్‌లో వచ్చిన తిరుగుబాటు ప్రపంచాన్నే నెవ్వెర పోయేలా చేసింది. దేశంలో పెరిగిపోతున్న అవినీతి, నిరుద్యోగం, వారసత్వ రాజకీయాలు వారి విలాసవంతమైన జీవనశైలికి వ్యతిరేకంగా జెన్ జీ యువత చేసిన తిరుగుబాటుకి తలవంచిన కే.పి. శర్మ ఓలీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం గద్దె దిగక తప్పలేదు. పార్లమెంటు భవనాన్ని, ప్రధానమంత్రి కార్యాలయాన్ని తగలబెట్టటం, మంత్రులు పార్లమెంటు సభ్యులు, మాజీ ప్రధాన మంత్రులపై దాడులు జరగటం యువత తిరుగుబాటు హింసాత్మకంగా మారటంతో సైన్యం జోక్యం చేసుకొని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుశీల కర్కి నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంతో నేపాల్‌లో సాధారణ పరిస్థితులు ఏర్పడినాయి. నేపాల్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు అవుతున్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు మార్చి 5న పార్లమెంటుకు నిర్వహించిన ఎన్నికలలో నేపాల్‌ని గతంలో పాలించిన నేపాలీ కాంగ్రెస్ పార్టీని, నేపాలీ కమ్యూనిస్టు పార్టీలని ఓడించి 2022లో ఏర్పాటు అయిన రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఎన్నికలలో గెలిచి మొదటిసారి నేపాల్‌లో అధికారం చేపట్టబోతుంది. 275 మంది ప్రతినిధులు ఉండే సభలో 165 మంది సభ్యులను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా మరొక 110 మంది సభ్యులను ఆయా పార్టీలకు వచ్చిన ఓట్ల ద్వారా దామాషా పద్ధతిలో ఎన్నుకుంటారు. ఫలితాలు వెలువడుతున్న 165 స్థానాలలో రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ 122 స్థానాలలో గెలుపు సాధించి నేపాల్ రాజకీయాలలో సరికొత్త అధ్యాయానికి తెరతీసింది. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీని విజయ పదంలో నడిపించిన రాపర్ బాలేన్ షా నేపాల్‌కి తదుపరి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. రాజకీయ స్తబ్ధత, వారసత్వ పాలన, అవినీతికి వ్యతిరేకంగా పాడిన పాటలతో బాలెన్ షాకి నేపాల్ యువతలో సామాన్య ప్రజలలో మంచి గుర్తింపునే తెచ్చిపెట్టాయి. ఆ గుర్తింపుతోనే స్వతంత్ర అభ్యర్థిగా ఖాట్మండు మేయర్‌గా 2022లో బాలెన్ షా ఎన్నికైనారు. మేయర్‌గా ఖాట్మండుని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దటంలో, అక్రమ కట్టడాలను తొలగించటంలో, చెత్త, మంచినీటి సరఫరా, ట్రాఫిక్ లాంటి సమస్యలను పరిష్కరించటంలో బాలెన్



షా చూపిన చొరవతో అతనిపై నేపాల్ ప్రజలకి మరింత నమ్మకం పెరిగింది. జెన్ జీ యువత నిరసనలతో నేపాల్ అట్టుడుకుతున్న సమయంలో సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ప్రధానమంత్రి కే.పి. శర్మ ఓలీ రాజీనామాతో నేపాల్‌కి బాలెన్ షా నాయకత్వం వహించాలనే డిమాండ్ ప్రజల నుండి బలంగా వచ్చినప్పటికీ నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి బాలెన్ షా ఇష్టపడలేదు. ఎన్నికలలో గెలిచి నేపాల్‌కి నాయకత్వం వహిస్తానని ప్రకటించి తాను ప్రాతినిధ్య వహిస్తున్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీని గెలిపించడమే కాదు నేపాల్‌కి నాలుగు పర్యాయాలుగా ప్రధానమంత్రిగా వ్యవహరించిన నేపాల్ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు కే.పీ శర్మ ఓలీని ఝూపా 5 నియోజకవర్గంలో ఓడించి బాలెన్ షా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడైన బాలెన్ షా అనేక సమస్యలతో కునారిలుతున్న నేపాల్‌కి ఒక ఆశాకిరణం లాగా కనిపిస్తున్నాడు. దశాబ్దాలుగా నేపాలీకాంగ్రెస్, నేపాలీ కమ్యూనిస్టు పార్టీలు ఏలుబడిలో ఉన్న దేశంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించటం బాలెన్ షాకి కత్తి మీద సాము లాంటిదే. నేపాల్‌లో పెచ్చు మీరిపోయిన అవినీతి, నిరుద్యోగాన్ని, ధరల పెరుగుదలను, నియంత్రించటం బాలెన్ షాకి ఒక సవాలనే చెప్పాలి. అవినీతి నిర్మూలన, సుపరిపాలన, జీడీపీని 10కోట్ల డాలర్లకు పెంచటం, నిరుద్యోగ నిర్మూలన, యువతకి రాబోయే ఐదు సంవత్సరాలలో 12 లక్షల ఉద్యోగాల కల్పన, వలసల నియంత్రణ, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడం లాంటి ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం బాలెన్ షాకి అంత తేలికైన విషయం కాదు. సమస్యలను పరిష్కరించడంలో నగర మేయర్‌గా చూపించిన చొరవ దేశ ప్రధానిగా చూపించగలరా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్ నేపాల్ ప్రభుత్వాలపై ప్రజల తిరుగుబాటు తరువాత అధికారంలోకి వచ్చిన అనురసిరి దిశ నాయకే, తారెక్ రెహమాన్‌లు భారత వ్యతిరేక వైఖరి కలిగిన వారే కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌పట్ల వారి వైఖరి మారినట్లుగా కనిపి స్తుంది. నేపాల్ అధికార పగ్గాలు చేపట్టబోతున్న బాలెన్ షా కూడా భారత్ వ్యతిరేకంగా ముద్రపడిన వారే కాబట్టిభారత్ పట్ల నేపాల్ ప్రధానిగా బాలెన్ షా వైఖరి ఎలా ఉండబో తుందనేది ఆసక్తికరమైన విషయం. నేపాల్ ఫస్ట్, గ్రేటర్ నేపాల్ ఏర్పాటు లాంటి అంశాలు భవిష్యత్తులో బాలెన్ షాని ఇబ్బంది పెట్టే అవకాశం లేకపోలేదు. సంస్కృతిపరంగా వాణిజ్యపరంగా భారత్‌కి నేపాల్‌కి మధ్య బలమైన సంబం ధాలే ఉన్నాయి కానీ సరిహద్దు వివాదాలు గత కొంతకాలంగా నేపాల్ పాలకులు చైనాకు అనుకూలంగా వ్యవహరించటం వలన భారత్, నేపాల్ మధ్య సంబంధాలు బలహీనపడ్డాయి కాబట్టి ఈ 35 సంవత్సరాల యువకుడు నేపాల్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి భారత్ లాంటి బలమైన సరిహద్దు గల దేశాలతో ఎలా వ్యవహరించబోతున్నాడో వేచి చూడాల్సిందే. •



### తృణమూల్ నేతలకు

## నో అపాయింట్‌మెంట్

### రాష్ట్రపతిని కలవడానికి చుక్కెదురు

**న్యూఢిల్లీ, మార్చి 13:** రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరిన తృణమూల్ నేతలకు చుక్కెదురైంది. సమయాభావం వల్లవారిని రాష్ట్రపతి కలవడం సాధ్యం కాదని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్‌లో ఆదివాసీలకు అందుతున్న సంక్షేమ పథకాలను రాష్ట్రపతికి తెలియజేసేందుకు 12 మంది సభ్యులతో కూడిన టీఎంసీ బృందం అనుమతి కోరగా ఈ మేరకు సమాధానం వచ్చింది. అయితే వచ్చే వారం అయినా తమకు రాష్ట్రపతి సమయం కేటాయించాలని కోరుతూ ఆ బృందం మరో లేఖను రాష్ట్రపతి భవన్‌కు పంపించినట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. నాడు దీనిపై ముర్ము స్వయంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిందని నాడు తెలిపారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన తనకు సీఎం నుంచి గానీ మంత్రుల నుంచి గానీ అధికారిక స్వాగతం లభించలేదని పేర్కొన్నారు. తాను ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిన ఆదివాసీ సదస్సుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు. 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో ప్రసంగించడానికి రాష్ట్రపతి బెంగాల్ లోని సిలిగుడికి వెళ్లిన సందర్భంగా ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలు జరిగాయి.

### కోమాలో ఇరాన్‌సుప్రీం కమాండర్ మొజ్తబాఖమేనీ?

**లండన్, మార్చి 13:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కోమాలో ఉన్నట్లు బ్రిటన్‌కు చెందిన వార్తాపత్రిక పేర్కొంది. దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఆయన ఒకటి లేదా రెండు కాళ్లను కోల్పోయినట్లు తెలిపింది. అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కూడా ఈ వాదనకు మద్దతు ఇచ్చారు. దాడుల్లో తీవ్రంగా గాయపడిన మొజ్తాబా ముఖం కూడా విధ్వంతంగా మారి ఉంటుందని మీడియాతో ఆయన అన్నారు. గతనెల 28న అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యారు. ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీ కూడా ఈ దాడుల్లో లేదా ఆ తర్వాత జరిగిన దాడుల్లో తీవ్రంగా గాయపడినట్లు బ్రిటీష్ టాబ్లాయిడ్ పేర్కొంది. టెహ్రాన్‌లోని సినా యూనివర్సిటీ ఆసుపత్రిలో గట్టి భద్రత మధ్య ఆయన చికిత్స పొందుతున్నట్లు తెలిపింది. మొజ్తబా ఖమేనీ చికిత్స పొందిన ఒక ఇరాన్ నేత వివరాలు వెల్లడించినట్లు కూడా ఆ సంస్థ తెలిపింది. మా నాయకుడు చాలా తీవ్రమైన స్థితిలో ఉన్నారు. రెండు కాళ్లు తెగిపోయాయి. కాలేయం, కడుపు కూడా ఛిద్రమైంది. ఆయన స్పృహంగా కోమాలో ఉన్నారని ఆ ఇరాన్ నేత అన్నట్లు టాబ్లాయిడ్ వివరించింది. ఇరాన్ ఆరోగ్య మంత్రి, యుద్ధ గాయాలకు చికిత్స చేసిన అనుభవం ఉన్న సీనియర్ సర్జన్, అనుభవజ్ఞుడైన ట్రామా సర్జన్ మొహమ్మద్ రెజా జఫర్‌ఘండి పర్యవేక్షణలో మొజ్తబా ఖమేనీకి చికిత్స కొనసాగుతున్నట్లు వార్తా కథనంలో పేర్కొంది. సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ నుంచి ప్రత్యక్ష ఆదేశాలు లేకుండానే ఇరాన్ నాయకత్వ నిర్మాణం యుద్ధాన్ని కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

# పార్లమెంట్‌లో గ్యాస్ మంటలు

- ఎల్‌పిజి సంక్షోభంపై చర్చకు విపక్షాలు పట్టు
- ఉభయ సభలలో ప్రతిపక్ష సభ్యుల ఆందోళన
- పలుమార్లు అంతరాయం, 16కి వాయిదా



**న్యూఢిల్లీ, మార్చి 13:** మధ్యప్రాచ్యంలో యుద్ధం నేపథ్యంలో దేశీయంగా తలెత్తిన గ్యాస్ సంక్షోభంపై పార్లమెంటు అట్టుడికింది. దేశీయంగా చమురు నిల్వలు, గ్యాస్ సరఫరా, ఎల్పిజి సంక్షోభంపై చర్చించాలని లోక్‌సభలో ఉదయం సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమం చేపడుతుండగా విపక్ష సభ్యులు స్పీకర్ పోడియం చుట్టిముట్టి ఆందోళనకు దిగారు. ఈ గందరగోళం మధ్య ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన రూ.2.01 లక్షల కోట్ల అదనపు వ్యయం బిల్లును మూజువాణితో ఆమోదించింది. విపక్ష సభ్యుల ఆందోళన తీవ్రం కావడంతో దీంతో సభను 12 గంటలకు స్పీకర్ వాయిదా వేశారు. మళ్లీ తిరిగి ప్రారంభమైనప్పటికి పరిస్థితిలో మార్పు లేదు. మరోమారు సభను వాయిదా వేశారు. అనంతరం ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ వెలుపల ప్లకార్డులు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. తదుపరి మధ్యాహ్నం 2 గం.లకు సభ ప్రారంభమైనప్పటికి విపక్ష సభ్యుల ఆందోళనలతో చర్చకు అవకాశం లేకపోవడంతో సోమవారానికి వాయిదా వేశారు. అటు రాజ్యసభలోనూ ఇదే సీన్ చోటుచేసుకుంది. అయితే, ప్రశ్నోత్తరాల కార్యక్రమం సజావుగా సాగింది. ఆ తర్వాత గ్యాస్, చమురు సంక్షోభంపై చర్చకు అవకాశమివ్వాలని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టగా, అధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ చైర్మన్ చర్చకు అనుమతించలేదు. సభను వాయిదా వేశారు. పలుమార్లు సభను వాయిదా వేసిన పరిస్థితిలో మార్పు లేకపోవడంతో ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి.

## పకోడీలు తెచ్చేలోపే భార్య అదృశ్యం!

**ఆగ్రా, మార్చి 13:** ఆకలేస్తోందని చెప్పిన భార్యను పక్కషాపు నుంచి పకోడీలు తెచ్చేలోపే భార్య అదృశ్యం అయిన సంఘటన అందరినీ కలవరపరిచింది. యూపీలోని ఆగ్రా జిల్లాకు చెందిన ప్రీతమ్ సింగ్‌కు, రాంపూర్ జిల్లాకు చెందిన 18 ఏళ్ల రిమ్‌ఝిమ్‌తో గతేడాది డిసెంబర్ 1న వివాహం జరిగింది. హోలీ పండుగ కోసం పుట్టింటికి వెళ్లిన రిమ్‌ఝిమ్‌ను, పండుగ ముగిశాక ఈ నెల 9న ప్రీతమ్ తిరిగి తన ఇంటికి తీసుకెళుతున్నాడు. ఈ క్రమంలో మరో బస్సు కోసం మొరాదాబాద్ జిల్లాలోని బిలారీ బస్టాండ్‌లో వారు వేచి ఉన్నారు. ఆ సమయంలో ఆకలిగా ఉందని, వేడివేడి పకోడీలు తీసుకురమ్మని రిమ్‌ఝిమ్ భర్తను కోరింది. దీంతో ప్రీతమ్ పక్కనే ఉన్న బండి వద్దకు వెళ్లాడు. కొద్ది నిమిషాల్లోనే పకోడీలు తీసుకుని తిరిగి రాగా, భార్య కనిపించకపోవడంతో షాక్ అయ్యాడు. చుట్టు పక్కల వెతికినా, స్థానికులను అడిగినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన ప్రీతమ్, వెంటనే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. తన భార్య ఓ యువకుడితో వెళ్లి పోయి ఉండొచ్చని భర్త ప్రీతమ్ పోలీసుల వద్ద అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. మొబైల్ ఫోన్ ట్రేస్ చేసే పనిలో ఉన్నారు.

## చేతిచమురు వదలకుండా ప్రపంచ దేశాల చర్యలు

**టెహ్రాన్, మార్చి 13:** ఇరాన్ యుద్ధం తీవ్రం కావడంతో 20 శాతం ప్రపంచ చమురు రవాణాకు మార్గమైన హార్ముజ్ జలసంధి మూసుకుపోయింది. ఈ మార్గంలో నుంచి నౌకలు ప్రయాణించడమంటే మృత్యువును వెతుక్కొంటూ వెళ్లినట్లే. ఏ క్షణాన ఏ ముప్పు వచ్చి నౌకల్లో పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు చమురు ధరలను అదుపు చేయడానికి అమెరికా ఇప్పటికే 172 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేస్తామని ప్రకటించడంతోపాటు అంతర్జాతీయ ఇంధన సంస్థ ఐఇఎతో కలిసి దీనిని 400 మిలియన్ బ్యారెళ్ల వరకు తీసుకెళతామని పేర్కొంది. అయినా, చమురు ధరలు అదుపు కాకపోవడంతో ప్రపంచంలోని వివిధ దేశాలు ఇంధన సంక్షోభం నుంచి బయటపడేందుకు చర్యలు తీసుకొంటున్నాయి. ఇన్నాళ్లు రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయొద్దని ప్రపంచ దేశాలను బెదిరించిన అమెరికా ఇప్పుడు వెనక్కి తగ్గింది. కొంత చమురును రష్యా నుంచి కొనుగోలు చేసేలా నిబంధనలను సడలించింది. ఆస్ట్రేలియా తన రిజర్వుల నుంచి 762 మిలియన్ లీటర్ల పెట్రోల్, డీజిల్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో చమురు కొరత అదుపులోకి వస్తుందని అంచనా వేస్తోంది. ఇంధన నాణ్యత ప్రమాణాలను కూడా సడలించడంతో అధిక సల్ఫర్ ఉండే అన్‌లెడెడ్ పెట్రోల్ విక్రయాలకు కూడా అవకాశం కల్పించింది. జపాన్ తన రిజర్వుల నుంచి 80 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేసింది. తన వద్ద ఉన్న 245 రోజులకు సరిపడా నిల్వల్లో ఇది 45 రోజుల మొత్తానికి సమానం. దక్షిణ కొరియా చమురు ధరల్పై పరిమితిని విధించింది. ఈ రకంగా చేయడం గత 30 యేళ్లలో ఇదే తొలిసారి. సాధారణ పెట్రోల్ ధర 1.17 డాలర్లుగా నిర్ణయించింది. భారత్‌లో ఇప్పటికే పెట్రోల్, డీజిల్, గ్యాస్ నల్లబజారుకు వెళ్లకుండా నిత్యావసర సరకుల చట్టాన్ని ప్రయోగించింది. వంట ఇంధనం కోసం రెగ్యులర్ కోటా కింద విడుదల చేసే కిరోసిన్‌కు అదనంగా మరో 48 వేళ కిలోలీటర్లను రాష్ట్రాలకు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది.

## పాకిస్తాన్‌పై ఆఫ్ఘాన్ తాలిబన్ దాడులు

**కాబూల్, మార్చి 13:** పశ్చిమాసియాలో ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం తీవ్రంగా కొనసాగుతుంటే మరోపక్క పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లు పరస్పరం దాడులు చేసుకుంటూనే ఉన్నాయి. ఇరుదేశాల మధ్య మొదలైన యుద్ధం ఇంకా కొనసాగుతోంది. ముందు రోజు ఆఫ్ఘన్‌పై పాక్ దాడి చేస్తే శుక్ర వారం పాకిస్తాన్‌పై ఆఫ్ఘన్ దాడి చేసింది. పాకిస్తాన్, ఖైబర్ పంక్తుంఖ్వాలోని ఆర్మీ కేంద్రాలపై శుక్రవారం వైమానిక దాడు లు జరిపినట్లు ఆఫ్ఘనిస్తాన్ తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ దాడుల్లో పాకిస్తాన్‌కు ఆస్తి, ప్రాణ నష్టం జరిగిం దని, పాకిస్తాన్ జరిపిన దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులు చేసినట్లు తెలిపింది. పాకిస్తాన్ ముందురోజు రాత్రి ఆఫ్ఘన్‌లోని కొన్ని స్థావరాలపై దాడి చేసింది. ఆఫ్ఘన్ తీవ్రవాద స్థావరాలపై దాడులు చేసినట్లు పాక్ తెలిపింది. ఈ దాడుల్లో సాధారణ పౌరులు మరణిం చినట్లు ఆఫ్ఘన్ తెలిపింది. దీంతో తాము కోహాట్ ఏరియాలోని పాకిస్తాన్‌కు చెందిన కీలక స్థావరాలపై దాడి చేశామని తెలిపింది. దురంద్ లైన్ వద్ద వార్ కమాండ్ సెంటర్, ఫోర్ట్ కమాండర్లే లక్ష్యంగా ఈ దాడి చేశామని చెప్పింది. దాడుల ద్వారా ఇక్కడి నివాస ప్రాంతా ల్ని కూడా ధ్వంసం చేసినట్లు ఆఫ్ఘన్ వివరించింది. తీవ్రవాద సమస్య కారణంగా పాక్, ఆఫ్ఘన్ పరస్పర దాడు లకు దిగుతున్నాయి. తమ దేశంలోకి ఆఫ్ఘనిస్తాన్ తీవ్రవాదుల్ని పంపి విధ్వంసం సృష్టిస్తోందని పాక్ ఆరోపిస్తోంది.

### నెలసరి సెలవులు తప్పనిసరి చేస్తే మహిళలకు

## ఉద్యోగ భద్రత తగ్గుతుంది: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, మార్చి 13:** నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే అది మహిళల ఉపాధి అవకాశాలపై ప్రతి కూల ప్రభావం చూపుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మనం అలాంటి చట్టాలు చేస్తే కం పెనీలు మహిళలను తీసుకోవని అభిప్రాయ పడింది. ఆ సెలవుకు సంబంధించిన నియమాలను రూపొందించేలా రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. అలాంటి చట్టం తాము పురుషుల కంటే తక్కువ అనే భయం ఉద్యోగాలు చేసే మహిళల్లో సృష్టించే అవకాశం ఉంది. రుతుక్రమం అంశంపై అవగాహన కల్పించడం వేరు. దానిని సెన్సేషన్ చేయడం వేరు. ఈ సెలవును తప్పనిసరి చేస్తూ చట్టాన్ని తీసుకువచ్చిన మరుక్షణం ఎవరూ వారిని నియమించుకోరు. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదు అంటూ పిటిషనర్‌ను ఉద్దేశించి ప్రధాని న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఎంఆర్ షంషద్ తన వాదనలు వినిపించారు. 2013లో ప్రభుత్వం ఆధ్వర్యంలోని విశ్వ విద్యాలయాల్లో విద్యార్థినులకు నెలసరి సెలవును మంజూరుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రైవేట్ కంపెనీలు కూడా అలాంటి వెసులుబాటును కల్పించాయని కోర్టుకు వెల్లడించారు. దీనిపైప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ అవన్నీ స్వచ్ఛందంగా తీసుకున్న చర్యలన్నారు. ఆ సెలవును తప్పనిసరి చేస్తే.. మహిళల కెరీర్ ముగుస్తుందని మరోసారి ప్రస్తావించారు.

### అమెరికాలో భారత సంతతికి

## 400 యేళ్ల జైలుశిక్ష!

**వాషింగ్టన్, మార్చి 12 :** మనీలాండరింగ్, హెచ్1బీ వీసా, పన్ను ఎగవేత సహా వివిధ రకాల మోసాలకు పాల్పడ్డారన్న కేసులో భారత సంతతికి చెందిన ఇద్దరు సోదరులను అమెరికాలోని ఓ కోర్టు దోషిగా తేల్చింది. సవానీ గ్రూప్ పేరుతో పలు రకాల వ్యాపారాలు నడుపుతున్న భాస్కర్ సవానీ (60), అరుణ్ సవానీ(58)లకు దాదాపు 400 ఏండ్లకుపైగా జైలు శిక్ష పడే అవకాశ ముందని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. వీరితోపాటు దోషిగా తేలిన అలెక్సాండ్రా రాడోమియాక్‌కు కోర్టు 40 ఏళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్న వార్తలు విస్తృత ప్రచారంలోకి వచ్చాయి. అమెరికాలో కొన్నేండ్లుగా వీరు సవానీ గ్రూప్ పేరుతో అక్రమ వ్యాపార కార్యకలాపాలను సాగిస్తూ కోట్లాది డాలర్లు కొల్లగొట్టారని ప్రాసిక్యూటర్లు మీడియాకు తెలిపారు. అమెరికా అటార్నీ కార్యాలయం గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. హెచ్1బీ వీసాలకు సంబంధించి మోసపూరిత దరఖాస్తులు, పిటిషన్లు దాఖలు చేసి పెద్ద సంఖ్యలో విదేశీ కార్మికులను అమెరికాకు రప్పించి, అటు తర్వాత వారి వేతనాల నుంచి బలవంతంగా వసూలు చేశారని దర్యాప్తులో తేలింది. ఇందులో అత్యధికులు ఇండియన్స్ ఉన్నారని తెలిపింది. ఇక హెల్త్‌కేర్ పథకంలో అక్రమ బిల్లులు ప్రవేశపెట్టి 30 మిలియన్ డాలర్లు కొల్లగొట్టారని పేర్కొన్నది. ప్రభుత్వ పథకాల్లో అక్రమంగా కొల్లగొట్టిన సొమ్మునంతా మనీలాండరింగ్ ద్వారా కార్పొరేట్ బ్యాంక్‌ల్లోకి తరలించారని 2023లో వారిపై ఆరోపణలు నమోదయ్యాయి.

## శశికళ పార్టీ పేరు ఎఐపిటిఎంఎంకె

### పార్టీ గుర్తు కొబ్బరి చెట్టు

### పుదుచ్చేరి, తమిళనాడులో సత్తా చూపుతామన్న అధినేత్రి




**చెన్నై, మార్చి 13:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న తరుణంలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె, ఇప్పుడు సొంత పార్టీని ప్రకటించారు. ఆలిండియా పురుచ్చి తలైవార్ మక్కల్ మున్నేట్ర కళగం (ఎఐపిటిఎంఎంకె) అనే పార్టీని స్థాపించి మళ్ళీ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. ఏఐడిఎంకె వ్యవస్థాపకులు ఎంజీ రామచంద్రన్ ను అభిమానులు పురుచ్చి తలైవార్ అని పిలుచు కుంటారు. ఆయన గౌరవార్థం తన పార్టీ పేరులో ఆ పదాన్ని చేర్చడం ద్వారా శశికళ క్యాడర్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. తన పార్టీ గుర్తుగా కొబ్బరి చెట్టును ఆమె ప్రకటించారు. జయలలిత అసలైన వారసురాలిగా తనను తాను నిరూపించుకోవాలని శశికళ చూస్తున్నారు. జయలలిత మరణం తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు, ఆపై జైలు శిక్ష కారణంగా ఆమె రాజకీయ ప్రస్థానానికి అప్పట్లో విరామం పడింది. అయితే ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగడం ద్వారా ఏఐఏడీఎంకే ఓటు బ్యాంకుపై ఆమె ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ ప్రకటన సందర్భంగా ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు నివాళులర్పించిన శశికళ రాబోయే ఎన్నికల్లో సత్తా చూపుతామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా ఈ కొత్త పార్టీ ఆవిర్భావం అధికార, ప్రతిపక్ష పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశం ఉంది. గతనెల 24వ తేదీన రామనాథపురం జిల్లాలోని కాముతి లో జరిగిన సమావేశంలో పార్టీ జెండాను శశికళ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. కొబ్బరిచెట్ల ఫార్మ్‌ను పార్టీ బొమ్మగా ప్రకటించారు. ప్రస్తుతం శశికళ వయసు 71 ఏళ్లు. త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తమ పార్టీ సింబల్ ఐక్యతకు సంకేతం అన్నారు. తమ పార్టీ ఓ ఉమ్మడి కుటుంబం తరహాలో పనిచేస్తుం దన్నారు. తమిళనాడు, పుదుచ్చేరిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీచేయనున్నట్లు చెప్పారు. మన నాయకుడు ఎంజీ రామచంద్రన్ ఎదుర్కొన్న దశలోనే తాను కూడా ఉన్నానని, క్యాడర్ ప్రారంభించిన పార్టీలో నే ఆయన చేరారని ఆమె అన్నారు. తమ పార్టీ జెండాలో నలుపు, తెలుపు, ఎరుపు రంగులు ఉన్నాయన్నారు. ఆ జెండాలో మాజీ సీఎంలు సీఎన్ అన్నాదురై, ఎంజీ రామచంద్రన్, జయల లిత ఫోటోలు కూడా ఉన్నాయి.

## అధునాతన పిస్టల్స్ తయారీపై కిమ్ ఫోకస్



**ప్యాంగ్యాంగ్, మార్చి 13:** ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ తన దేశంలో ఆయుధాలు పెంచుకోవడంపై దృష్టిపెట్టాడు. తాజాగా అధునాతన లైట్ పిస్టల్స్ తయారు చేశాడు. ఈ మేరకు పిస్టల్స్ ఫ్యాక్టరీలో కొత్తగా తయారు చేసిన ఆయుధాల్ని కిమ్ పరీక్షించాడు. ఆయనతో పాటు అతడి కూతురు కిమ్ జు ఆయే కూడా ఈ టెస్టింగ్‌లో పాల్గొంది. కిమ్, అతడి కూతురు కిమ్ జుయే ఇద్దరూ పిస్టల్స్ పరీక్షించారు. ఈ పిస్టల్స్‌ను అధ్యక్షుడు కిమ్ పరీక్షించి, అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇతర కొన్ని చిన్న ఆయుధాల్ని కూడా ఆయన పరీక్షించారు. ఇంత కాలం అణ్వాయుధాలపై దృష్టిపెట్టిన కిమ్ ఇప్పుడు స్వల్ప, మధ్యస్థాయి ఆయుధాల తయారీపై దృష్టిసారించాడు. ఆధునిక ఆయుధాల్ని తయారు చేయాలని ఆయన నిర్ణయించాడు. అందువల్ల పిస్టల్స్ వంటివి తయారు చేయిస్తున్నాడు. ఉత్తర కొరియా సైన్యానికి ఈ ఫ్యాక్టరీ తయారు చేసే ఆయుధాలు ఎంతో కీలకం అని కిమ్ అన్నట్లు అక్కడి మీడియా తెలిపింది. ఇక కూతరు కిమ్ జో కూడా తండ్రితోపాటు పిస్టల్స్‌ను పరీక్షించారు. దీనికి సంబంధించిన కొన్ని ఫొటోలు తాజాగా విడుదలయ్యాయి. కిమ్ కూతురు పేరు అధికారికంగా వెల్లడి కాకపోయినా, తన పేరు కిమ్ జు అయే అని తెలుస్తోంది. ప్రస్తుతం కిమ్ జు వయసు 13. కిమ్ తర్వాత ఉత్తర కొరియాకు నాయకత్వం వహించబోయేది తనేనని అక్కడి ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. 2022లో ఉత్తర కొరియా జరిపిన లాంగ్ రేంజ్ మిస్సైల్స్ పరీక్ష సందర్భంగా కిమ్ కూతురు తొలిసారి పబ్లిక్‌గా కనిపించింది. ఆ తర్వాత అప్పుడప్పుడూ అధికారిక కార్యక్రమాల సందర్భంగా కనిపించింది. ఇటీవల తరచూ వార్తల్లో కనిపిస్తోంది. గత నెలలో కూడా ఒక స్నైపర్ గన్ కాల్చడాన్ని కిమ్ జు ఆయే ప్రాక్టీస్ చేసింది. కిమ్ వారసురాలిగానే ఆమెను పరిగణిస్తున్నారు.

## కర్ణాటకలో గ్రూపు రాజకీయాల జోరు

### 25 మందిపైగా సీనియర్ ఎమ్మెల్యేలు రహస్య భేటీ

కర్ణాటక కాంగ్రెస్‌లో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. ముఖ్యమంత్రి మార్పుపై ఊహా గానాలు జోరందుకున్న తరుణంలో 25 మందికి పైగా సీనియర్ ఎమ్మెల్యేలు బెంగళూరులో రహస్యంగా సమావేశం కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విధాన సౌధలో కేబినెట్ సమావేశం నిర్వహిస్తున్న సమయంలోనే, మరోవైపు ఓ ప్రైవేట్ హోటల్‌లో ఈ భేటీ జరగడం గమనార్హం. దీనికి ఒకరోజు ముందు జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశానికి 50 మందికి పైగా ఎమ్మెల్యేలు గైర్హాజరైన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా భేటీలో, గత కొన్ని నెలలుగా పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని, అంతర్గత విభేదాలు ఇలాగే కొనసాగితే రాబోయే రెండేళ్ల పాలనతో పాటు 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇటీవల కర్ణాటక పీసీసీ చీఫ్‌గా ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డీకే శివకుమార్ ఇచ్చిన విందు, ఆయన వర్గం బలప్రదర్శనగా మారిందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, తన రాజకీయ భవిష్యత్తుపై డీకే శివకుమార్ మాట్లాడుతూ, నాపై నాకు నమ్మకం ఉంది, విధి ఏది రాసిపెడితే అది సరైన సమయంలో జరుగుతుందని అనడం నాయకత్వ మార్పు చర్చకు బలాన్నిచ్చింది. గత కొంతకాలంగా పలుమార్లు ఢిల్లీకి వెళ్లి పార్టీ అధ్యక్షుడు మల్లి కార్జున్ ఖర్గేతో భేటీ అవుతుండటంతో, కర్ణాటకలో నాయకత్వ మార్పు త్వరలోనే ఉండొచ్చనిఉత్కంఠ నెలకొంది. ఈ పరిణామాలు సిద్ధ రామయ్య ప్రభుత్వ స్థిరత్వంపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

## మంటల్లో పశ్చిమాసియా



### ట్రెహ్రాన్‌లో భారీ పేలుడు..

## ఇరాన్‌కు ట్రంప్ మరో హెచ్చరిక!

**టెహ్రాన్, మార్చి 13:** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు సంభవించింది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా టెహ్రాన్ స్క్వేర్‌లో ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. ఇరాన్‌లోని మరో నగరం ఖజ్విన్ లో భారీ పేలుడు సంభవించింది. ఈ దాడులు ఎవరు చేశారనే విషయం తెలియరాలేదు. అయితే, ఖజ్విన్, టెహ్రాన్‌లో పేలుళ్ల జరుపుతామని ఇజ్రాయెల్ ముందే హెచ్చరించింది. దాడులు జరుగుతున్న ప్పటికీ వేలాది మంది పౌరులు టెహ్రాన్ వీధుల్లోకి వచ్చి ఇజ్రాయెల్, అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండటం గమనార్హం.

**ఏం జరుగుతుందో చూడండి: ట్రంప్**

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. మతి చెడిన నేతలకు ఇవాళ ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. 'ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యింది. వైమానిక దళం కూడా ఇక ఉండదు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారు. 47 యేళ్లుగా అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నా' అని సోషల్ మీడియాలో ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఇరాన్ త్వరలో లొంగిపోనుందని ఇటీవల జరిగిన జి-7 నేతల వర్చువల్ సమావేశంలో ట్రంప్ పేర్కొన్నట్లు యాక్సియోస్ వార్తా సంస్థ కథనం వెల్లడించింది.

### కుప్పకూలిన అమెరికా రీఫ్యూయలింగ్ విమానం

**బాగ్దాద్, మార్చి 13:** అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కెసి-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదలు చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది. మరోవైపు ఇరాక్‌కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్‌కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ చానెల్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్‌లో ఇది కూలిపో లేదని వెల్లడించింది. ఈ ఘటన ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోంది.

### ఎల్పిజి ట్యాంకర్లను హార్మూజ్ దాటించేందుకు

## ఇరాన్‌తో భారత్ చర్చలు

**న్యూఢిల్లీ, మార్చి 13:** దేశంలో వంటగ్యాస్ కొరతపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం చర్యలు చేపట్టింది. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రయత్నిస్తుండగా వంటగ్యాస్ లభ్యతను పెంచేందుకు భారత్‌కు రావాల్సిన ఎల్పీజీ ట్యాంకర్ల కోసం ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. భారత్‌కు పయనమైన 8 ఎల్పీజీ ట్యాంకర్లు ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రస్తుతం హార్మూజ్ జలసంధి వద్ద నిలిచి పోయాయి. వీటిని సురక్షితంగా జలసంధిని దాటించేందుకు భారత ప్రభుత్వం ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇందుకు ఇరాన్ అధికారులు సానుకూలంగానే స్పందిస్తున్నారని, త్వరలోనే ఆ ట్యాంకర్లు హార్మూజ్‌ను దాటే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

### యుద్ధనౌక అబ్రహం లింకన్‌పై దాడిచేసాం

### ఇరాన్ ఐఆర్‌జిసి వెల్లడి

**వాషింగ్టన్, మార్చి 13:** ఇరాన్‌పై యుద్ధంలో భాగంగా అమెరికా దళాలు ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కొనసాగిస్తున్నాయి. అగ్ర రాజ్యానికి చెందిన యుద్ధ నౌక అబ్రహం లింకన్‌పై దాడి చేసినట్లు ఇస్లామిక్ రెవల్యూషన్ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) పేర్కొన్నది. ఓ బాలిస్టిక్ క్షిపణితో అబ్రహం లింకన్ యుద్ధ నౌకను దెబ్బతీసినట్లు ఐఆర్జీసీ వెల్లడించింది. దీంతో గల్ఫ్ సముద్ర జలాల నుంచి ఆ యుద్ధ నౌక విరమించుకున్నట్లు ఇరాన్ ప్రకటించినా అమెరికా ప్రభుత్వం మాత్రం దీన్ని ఖండించింది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీకి తమ యుద్ధ నౌక సేవలు అందిస్తున్నట్లు అమెరికా పేర్కొన్నది. యూఎస్ సెంట్రల్ కమాండ్ తన సోషల్ మీడియా పోస్టులో ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేసింది. అబ్రహం లింకన్ యుద్ధ నౌకకు చెందిన కొన్ని ఫోటోలను పోస్టు చేసింది. ఇరాన్‌కు చెందిన ఓ నౌక అబ్రహం లింకన్ యుద్ధ నౌకకు సమీపంగా వచ్చిందని, అప్పుడు అమెరికా దళాలు దాన్ని ఫైర్ చేశాయని మీడియాలోకథనాలు వచ్చాయి. కానీ షిప్‌కు ఏమైందన్న దానిపై క్లారిటీ లేదు. సముద్ర జలాల సరిహద్దులకు సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీ ఆఫ్ ఒమన్‌లో యూఎస్ఎస్ లింకన్ యుద్ధనౌకను తమ క్షిపణులు, డ్రోన్లు అటాక్ చేశాయని ఇరాన్ సెంట్రల్ హెడ్ క్వార్టర్స్ ఓ ప్రకటనలో పేర్కొన్నది.

### నేనెప్పుడు అనుకుంటే అప్పడే

## ఇరాన్‌తో యుద్ధం ముగింపు

### ఇరాన్‌కు మరోసారి ట్రంప్ తీవ్ర హెచ్చరికలు

**వాషింగ్టన్, మార్చి 13:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు యుద్ధాన్ని మరింతగా రెచ్చగొట్టేలా ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు ఇరాన్‌తో యుద్ధం అతి త్వరలోనే ముగుస్తుందని, తాను ఎప్పుడు ముగించాలనుకుంటే అప్పుడు యుద్ధానికి తెరపడుతుందని చెప్పిన ట్రంప్ నేడు ఆదేశంపై మరోసారి ఫైర్ అయ్యారు. ఇరాన్ యుద్ధం చివరి అంకానికి చేరుకుందని, ఆ దేశం భారీ మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఉమెన్ హిస్టరీ మంత్‌కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్ యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో ఏది చేయాలో అదే చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోనే అమెరికా సైనిక శక్తి గొప్పదన్నారు. ప్రపంచంలో మరెవరికి ఇలాంటి సైనిక శక్తి లేదన్నారు. ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఇరాన్‌తో యుద్ధం త్వరలోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. తాను ఎప్పుడు ముగించాలనుకుంటే అప్పుడు యుద్ధానికి తెరపడుతుందని ఆక్సియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు.

### భారీ పేలుళ్లతో దద్దరిల్లిన దుబాయ్ సిటీ

**దుబాయి, మార్చి 13:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ నగరం శుక్రవారం భారీ పేలుళ్ల శబ్దాలతో దద్దరిల్లింది. నగరం మధ్య భాగంలో పెద్ద ఎత్తున పొగ కమ్ముకోవడంతో పాటు పలు భవనాలు కంపించాయని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో నగరవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నగరంలోని దుబాయ్ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సెంటర్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. దాడిని గాల్లోనే విజయవంతంగా అడ్డుకున్నామని, దాని శకలాలు ఒక భవనం వెలుపలి భాగంపై పడటంతో స్వల్ప నష్టం వాటిల్లిందని దుబాయ్ మీడియా కార్యాలయం ప్రకటించింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. ఒక భవనంపై శకలాలు పడినట్లు తాము కూడా భావిస్తున్నామని, పెద్ద పేలుడు శబ్దం వినిపించిందని డిఐఎఫ్‌సి ప్రతినిధి తెలిపారు. ఘటన జరిగిన వెంటనే షేక్ జాయెద్ రోడ్డు వైపు నుంచి సైరన్ల మోత వినిపించింది. దుబాయ్ పోలీసులు వెంటనే ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు.

# మహిళల జోలికొస్తే ఖబడ్దార్!

● స్త్రీలపై నేరాలకు పాల్పడే వారిని అత్యంత కఠినంగా అణచివేస్తాం ● సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా చర్యలు తీసుకుంటాం ● రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా పటిష్ట కార్యాచరణ చేపట్టాలి ● సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్‌ల నియంత్రణకు చర్యలు తీసుకోండి ● శాంతిభద్రతల సమీక్షలో అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో మహిళలపై నేరాలు జరుగకుండా మరింత మెరుగైన రీతిలో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. క్రైమ్ ఎగినేస్ట్ విమెన్ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసు యంత్రాంగానికి సూచించారు. స్త్రీలపై నేరాలకు పాల్పడే వారిని అత్యంత కఠినంగా అణచివేస్తామని పునరుద్ఘాటించారు. రౌడీషీటర్లను కట్టడి చేయడానికి డ్రోన్లతో నిఘా పెట్టే అంశాన్ని పరిశీలించాలన్నారు. గత పాలనలో గంజాయి, అక్రమ మద్యం లాంటివి విచ్చలవిడిగా ఉండేవని, వదంతులు సృష్టించటం, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననం లాంటివి గతంలో ఉన్నాయని గుర్తు చేశారు. నెల్లూరులో రౌడీ ముఠాలను గుర్తించారన్న ఆయన ఇలాంటి ముఠాలు మిగిలిన జిల్లాల్లో ఉన్నాయేమో నిఘా పెట్టాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి గ్యాంగులను కట్టడి చేయంతో పాటు డీఆడిక్షన్ కేంద్రాల ద్వారా మార్పు తీసుకురావాలని హితవు పలికారు. నేరాలు జరిగినప్పుడు పోలీసులు కఠినంగా ఉంటే నిందితులకు భయం వస్తుందని తేల్చిచెప్పారు. గంజాయి, డ్రగ్స్ చాలా వరకు నియంత్రించటాన్ని ప్రశంసించిన సీఎం, నిర్మూలన దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదని, నిబంధనల అమలులో కఠినంగా ఉండాలని సిఎం స్పష్టం చేశారు.



రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా పటిష్ట కార్యాచరణ చేపట్టాలని, ప్రతీ ప్రాణమూ విలువైనదే అని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోని సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై సిఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ అంశాలను సిఎంఓ మీడియాకు విడుదల చేసింది. సైబర్ క్రైమ్, మనీ ఫ్రాడ్, డిజిటల్ అరెస్టులపై ప్రజలను అప్రమత్తం చేసేలా విశాఖ పోలీసులు రూపొందించిన ప్రచార వీడియోలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాష్ట్రంలో నేరాల రేటు 6 శాతం మేర తగ్గి, శాంతిభద్రతలు నియంత్రణలో ఉన్నాయని సీఎం అన్నారు. ఆర్థిక నేరాలు, సైబర్ ఫ్రాడ్స్ పెరిగాయని, వీటిని కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతలు సరిగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని స్పష్టం చేశారు. రోడ్ సేఫ్టీ చర్యలు పకడ్బంధీగా అమలు చేయాలని అన్నారు. అవసరమైన చోట ట్రామా సెంటర్లను ఏర్పాటు చేయాలని, 503 బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలు సరి చేయాలనీ ఆదేశించారు. రాష్ట్రంలో పోలీస్ ఫోర్స్ రేషనలైజేషన్ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అవసరమైన చోట పోలీస్ సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసారు. కొత్త జిల్లాలు, సున్నితమైన ప్రాంతాలు, సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండే దేవాలయాల వద్ద అవసరమైన మేరకు పోలీసు సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం లాంటి కొన్ని జిల్లాల్లో చేపడుతున్న ఉత్తమ విధానాలను ఇతర ప్రాంతాల్లోనూ అనుసరించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కఠినంగానే వ్యవహరించాలని ఎవరైనా సరే ఉపేక్షించవద్దని తేల్చిచెప్పారు. బ్రీత్ అనలైజర్లు, స్పీడ్ గన్లు కొనుగోలుకు 44 కోట్లు విడుదల చేస్తామన్నారు. జాతీయ సగటుతో పోలిస్తే రోడ్డు ప్రమాదాల విషయంలో ఏపీ మరింత మెరుగు పడాలన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ లాంటి అంశాల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. అనకాపల్లి, పశ్చిమ గోదావరి, విశాఖ, తదితర జిల్లాల్లోని బ్లాక్ స్పాట్లపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాల ఎస్పీలు, కలెక్టర్లు ప్రతీ బ్లాక్ స్పాట్లను తనిఖీ చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలపై జరుగుతున్న నేరాల్లో నిందితులకు భయం ఉండేలా కఠినంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళపై నేరాల్లో జీరో టాలరెన్సు ఉంటేనే మార్పు సాధ్యమని అన్నారు. మదనపల్లి తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఎస్పీలు కఠినంగా ఉండాలన్నారు.

# సమాజాభివృద్ధిలో పట్టభద్రులు కీలక పాత్ర

● యోగి వేమన వర్సిటి స్నాతకోత్సవంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ● 176 మంది ప్రతిభా వంతులకు బంగారు పతకాలు ● 70 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్లు ప్రదానం ● ఏరో స్పేస్ శాస్త్రవేత్త, సలహాదారు డా.కోటా హరినారాయణ, సైంటిస్ట్ డా. శేఖర్ సి.మండేలకు గౌరవ డాక్టరేట్‌లు




కడప, మార్చి 13 ప్రభాతవార్త: పట్టభద్రులు సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. శుక్రవారం యోగి వేమన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఛాన్సలర్, గవర్నర్ నజీర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా ఏరో స్పేస్ ప్రముఖ శాస్త్రవేత్త డా. కోట హరినారాయణ, హోనరిస్ కాజా గౌరవ డాక్టరేట్ స్వీకరించిన డా.శేఖర్ సి. మాండే హాజరు కాగా యోగి వేమన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. బెల్లం కొండ రాజశేఖర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పద్మ, ప్రొఫెసర్ మధుమూర్తి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, ఇతర జిల్లా అధికారులు హాజరయ్యారు. ఏరో స్పేస్ శాస్త్రవేత్త, సలహాదారు డా.కోటా హరి నారాయణ, సైంటిస్ట్ డా. శేఖర్ సి.మండేలకు యోగివేమన విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. అనంతరం వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ చూపిన 176 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. 70మంది విద్యార్థులకు డాక్టరేట్‌ల ప్రదానం చేశారు. 2021, 2022, 2023, 2024 సంవత్సరాల్లో గ్రాడ్యుయేట్స్, పిజి గ్రాడ్యుయేట్స్ పూర్తి చేసుకున్న 1,194 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం చేశారు. మరో 11,664 మంది డిగ్రీ విద్యార్థులు కాన్వకేషన్ ద్వారా వారి డిగ్రీలకు అర్హత పొందారు.

ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ కడప జిల్లా గొప్ప చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రాంతమని తెలిపారు. ప్రముఖ తత్వవేత్తలు, కవులు, మేధావులు, స్వాతంత్ర్య సమరయోధుల పుట్టినిల్లు అయిన ఈ జిల్లా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రఖ్యాత కవి, తత్వవేత్త, సామాజిక సంస్కర్త యోగి వేమన పేరుతో స్థాపించబడిన యోగివేమన విశ్వవిద్యాలయం విద్యా అభివృద్ధికి ముఖ్య పాత్ర పోషిస్తోందని తెలిపారు. భవిష్యత్తు కోసం అవసరమైన నైపుణ్యాలు, ఆధునిక సాంకేతికతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు అభివృద్ధి జీవితంలోని అనేక రంగాల్లో మార్పులకు దారి తీస్తుందని, అయితే మానవ విలువలు మరియు అనుభూతి కూడా సమానంగా ముఖ్యమని చెప్పారు. పట్టభద్రులు తమ జీవితంలో ఎంచుకున్న రంగాల్లో నిబద్ధతతో, కష్టపడి పనిచేస్తూ విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో యోగి వేమన యూనివర్సిటీ వివిధ శాఖల ప్రొఫెసర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సమాజంలో ప్రతి ధనవంతుడు జకాత్ చెల్లిస్తే పేదరికమే ఉండదు

### హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్



శ్రీకాళహస్తి, మార్చి 13 ప్రభాత వార్త: ముస్లిం సమాజంలో ప్రతి ధనవంతుడు దివ్యఖురఆన్‌లో పేర్కొన్నట్లు ఖచ్చితంగా 'జకాత్' చెల్లిస్తే పేదరికమే ఉండదని హాఫీజే ఖుర్ ఆన్ మౌలాన రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం రంజాన్ సందర్భంగా జామియా మసీదులో ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతూ రంజాన్ మాసం మిగిలిన 11 మాసాల కన్నా మిన్న అన్నారు. వరాల జల్లుకు మనం తెలిసి తెలియక చేసిన పాపాలకు నిష్కృతి అల్లాహ్‌ను శరణు కోరి మోకరిల్లి కన్నీరు మున్నీరుగా ప్రార్థిస్తే అల్లాహ్ ఆదరిస్తారని మనకు వరాలు ప్రసాదిస్తారని వివరించారు. మనం ఇక్కడ వచ్చింది శాశ్వతంగా ఉండటానికి కాదు. ఈ జీవితం మనకు తాత్కాలిక మజిలి అని గుర్తించాలన్నారు. మనం చేసిన ఆరాధనలు, మంచి పనులు, పరోపకారం, బంధుమిత్రులు శ్రేయస్సు మనల్ని స్వర్గస్తుల్ని చేస్తుందనే విషయాన్ని జీవిత రహస్యాన్ని తెలుసుకొని మసలుకోవాలని రేహాన్ సూచించారు.

## ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వసన్నద్ధం

### 16 నుండి భక్తులకు అన్నప్రసాదం వితరణ: టిటిడి జెఇఓ వీరబ్రహ్మం



రాజంపేట, మార్చి 13 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించే ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని టిటిడి జెఇఒ వి.వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. శుక్రవారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మార్చి 16 నుండి నిత్య అన్నప్రసాదం వితరణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. టిటిడిలోని అన్ని విభాగాలు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన నిత్య అన్నప్రసాద భవనాన్ని మార్చి 16న ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన ఆలయ నాలుగు మాడ వీధులు, నిత్య అన్నప్రసాద భవనం, శ్రీ సీతారాముల కల్యాణ వేదికలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం టిటిడి జిల్లా అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిఇ టి.వి.సత్య నారాయణ, ఎస్ఇ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఇఒలు శివప్రసాద్, సెల్వం, డిఇ (ఎలక్ట్రికల్) తదితర అధికారులు పాల్గొన్నారు.

## సీడ్ యాక్సెస్ రోడ్డును మంగళగిరి రహదారికి అనుసంధానించే పనుల్లో భూసమస్య

### స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఉండవల్లి వద్ద బకింగ్ హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. సీడ్ యాక్సెస్ రోడ్డును మంగళగిరి రహదారికి అనుసంధానించే పనుల్లో మరో 4.5 ఎకరాలు భూ సమస్య ఉంది. భూసేకరణ చేసేందుకు అవకాశం ఉన్నా. మరో నెల రోజులు సమయం ఇస్తున్నాం. ఏప్రిల్ 9 నాటికి భూసమీకరణకు రైతులు ముందుకు రాకుంటే. భూసేకరణ చేపడతాం. భూ సమీకరణకు రైతులు సహకరించాలి. బకింగ్ హాం కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నెలాఖరులోగా పనులు పూర్తిగా చేస్తామని కాంట్రాక్ట్ సంస్థలు చెబుతున్నాయి. బకింగ్ హాం కెనాల్ కంటే ముందు మరో 2 స్టీల్ బ్రిడ్జ్‌లు గుంటూరు ఛానల్, కొండవీటి వాగులపైరానున్నాయి. ఇవి కూడా పూర్తయితే సీడ్ యాక్సెస్ రహదారి పూర్తయినట్లే అని మంత్రి తెలిపారు.

## అప్పుల మంత్రి పయ్యావుల కేశవ్: పేర్నినాని

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ఫైనాన్స్ మినిస్టర్ పయ్యావుల కేశవ్‌ను అప్పుల మంత్రిగా మారిపోయారని మాజీ మంత్రి వైసిపి నేత పేర్ని నాని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం అప్పుల విషయంలో పచ్చి అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పక్కా ఆధారాలతో నిజాలు మాట్లాడారని, వాటిని అబద్ధమని నిరూపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.3.27 లక్షల కోట్ల అప్పు చేసినట్లు జీవోలు ఉన్నాయని, కానీ అప్పులు కేవలం లక్ష కోట్లేనని తప్పుడు లెక్కలు చెబుతున్నారని మండిపడ్డారు. ఈ లెక్కలపై వారం రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని డిమాండ్ చేశారు. తప్పుడు లెక్కలపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలపై అకృత్యాలు పెరుగుతున్నాయని, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మహిళను వేధిస్తే చర్యలు తీసుకోకపోగా, తిరిగి ఆమెపైనే కేసులు పెట్టడం దుర్మార్గమని విమర్శించారు. మహిళలను వేధిస్తే అదే వారికి చివరి రోజు అన్న చంద్రబాబు మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.

## పిజి విద్యార్థినులకు ఉపాధి శిక్షణకు శిక్షకులకు టెండర్లు

తిరుపతి, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం తిరుపతి పద్మావతి మహిళ విశ్వవిద్యాలయంలో పిజి చదువుతున్న విద్యార్థినులకు ఉపాధి నైపుణ్యాల కోసం శిక్షణ నివ్వడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. అవసరమైన శిక్షణనివ్వడానికి ఎపి ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లకు ఆహ్వానం కోరారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్సైట్ "డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు.ఎస్‌పిఎంవివి.ఎసి.ఇన్" సందర్శించాలని ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆచార్య బి. కిషోరి తెలిపారు.

## పిజి వైద్యురాలు ఆత్మహత్యాయత్నం

- ఎమర్జెన్సీ వార్డులో కోలుకుంటున్న తేజస్విని
- ప్రేమ విఫలం కావడమే ఆత్మహత్యకు కారణం
- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి

నెల్లూరు, మార్చి 13 ప్రభాతవార్త: నెల్లూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ గైనకాలజీ విభాగంలో పీజీ రెండవ సంవత్సరం చదువుతున్న డాక్టర్ తేజస్విని శుక్రవారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. దీంతో వైద్యురాలు అపస్మారక స్థితిలోకి వెళ్ళగా, వెంటనే వైద్య సిబ్బంది ఎమర్జెన్సీ వార్డుకు తరలించి చికిత్స ప్రారంభించడంతో కోలుకుంటోంది. ఈ సంఘటన ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకెళ్లితే గుంటూరుకు చెందిన డాక్టర్ తేజస్విని (24) ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ గైనకాలజీ విభాగంలో, పీజీ రెండవ సంవత్సరం చదువుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఉన్నట్టుండి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆసుపత్రిలోనే ఆమె కూలిపోయింది. దీంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది ఆమెను ఎమర్జెన్సీ వార్డుకు తరలించి వైద్య చికిత్సలు అందించడంతో కోలుకుంటుంది. గురువారం తేజస్విని మూడీగా ఉండడంతో ఆమెను సైక్రియాటిక్ విభాగానికి పంపించి చికిత్సలు అందించారు. తేజస్విని పరిస్థితి చూసి ఊరికి వెళ్లాలని వైద్యులు సలహా ఇచ్చారు. అయితే సదరు డాక్టర్ ఊరికి పోకపోగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం చర్చనీయాంశంగా మారింది.



**సూసైడ్ నోటు రాసి ఆత్మహత్యాయత్నం:** శుక్రవారం ఆత్మహత్య చేసుకునే తరుణంలో డాక్టర్ తేజస్విని సూసైడ్ నోటు రాసింది. నా చావుకు ఎవరూ కారణం కాదని అందులో పేర్కొంది. నా మానసిక పరిస్థితి బాగాలేదని బతకలేక వెళ్ళిపోతున్నానని రాసింది. తల్లిదండ్రులకు క్షమాపణ చెప్తున్నట్టు పేర్కొంది. అలాగే గైనకాలజీ హెచ్ఓడి డాక్టర్ గీతా లక్ష్మితో పాటు, పృథ్వికి సారీ చెబుతున్నట్టు రాసింది. ఈ సందర్భంగా ఎసి సుబ్బారెడ్డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ డాక్టర్ తేజస్విని, పృథ్వి అనే అతన్ని ప్రేమించినట్టు తెలుస్తుందన్నారు. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో, ఇక తాను ప్రేమించిన పృథ్వి దక్కడన్న ఉద్దేశంతో ఈ ఆత్మహత్యకు పాల్పడినట్టు ఉందని తెలియజేశారు. ఈ ఆత్మహత్యాయత్నానికి సంబంధించి తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇచ్చినట్టు చెప్పారు. ఇదిలా ఉంటే డాక్టర్ తేజస్విని ప్రేమించిన పృధ్వి లాయర్ చదువు పూర్తి చేసినట్టు తెలిసింది. పృథ్వీ కూడా జిజిహెచ్‌లో బాధితురాలు తేజస్వినిని కలిసి ఓదార్చినట్టు తెలిసింది.

# బిసి కులాలన్నింటికి అసెంబ్లీలో ప్రాతినిథ్యం లక్ష్యం

● రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ● తెలుగు సాహిత్యంలో మొల్లమాంబ రచనలకు ప్రత్యేకమైన స్థానం ● శాలివాహనుల సమస్యల పరిష్కారానికి కృషి చెస్తామన్న: మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: బిసిలలో అన్ని కులాలకు అసెంబ్లీలో ప్రాతినిథ్యం కల్పించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రతో పాటు, మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మొల్లమాంబ రచనలకు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. ఆమె తెలుగు కవయిత్రి కావడం తెలుగు జాతి అదృష్టమన్నారు. తెలుగు జాతి గర్వించదగ్గ రచయిత్రి మొల్లమాంబ అని అన్నారు. సంస్కృతంలోని వాల్మీకి రామాయణాన్ని సరళమైన తెలుగు భాషలోకి తొలిసారి రచించిన ఘనత కవయిత్రి మొల్లమాంబదేనని అన్నారు. మొల్ల తన రచనలలో నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. నేటి తరం మహిళాలకు, కవయిత్రిలకు మొల్ల ఆదర్శనీయమన్నారు. మొల్ల రచనలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మందరిపై ఉందన్నారు.

**బిసిలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం:** బిసిలకు సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత తెలిపారు. శాలివాహన ఫెడరేషన్ ఏర్పాటు చేసిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనన్నారు. ఆదరణ- 1, ఆదరణ- 2 పథకాలను అమలు చేసి, కుమ్మరులకు పనిముట్లను సిఎం చంద్రబాబు అందజేశారన్నారు. త్వరలో రూ.1000 కోట్లతో ఆదరణ 3.0లో విద్యుత్‌తో నడిచే ఆధునిక పనిముట్లు అందజేయనున్నామన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో బిసిలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. త్వరలో డిఎస్సీ నోటిఫికేషన్ రాబోతోందని, బిసి అభ్యర్థులకు మరోసారి ఉచితంగా బిసి స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నామన్నారు. రాష్ట్ర కుమ్మరి/శాలివాహన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ తెలిపిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.


మొల్లమాంబకు నివాళి అర్పిస్తున్న మంత్రులు

**మొల్ల స్ఫూర్తి ప్రదాత:** వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి రచించిన మొల్లమాంబ అందరికీ స్ఫూర్తి అని మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. ఆయా కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆలోచని అని అన్నారు. కేవలం కార్పొరేషన్లకు పాలక మండళ్ల ఏర్పాటు చేయడమే కాకుండా వాటికి నిధులు సైతం కేటాయిస్తున్నారన్నారు. నూతన బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం రూ.50 వేల కోట్లు కేటాయించిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను బిసి సామాజిక వర్గీయులు వినియోగించుకుని, అభివృద్ధి పథంలో పయనించాలని మంత్రి ఆకాంక్షించారు. ముందుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో ఉన్న మొల్ల విగ్రహానికి మంత్రులు సవిత, కొల్లు రవీంద్ర పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుమ్మరి/శాలివాహన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు గద్దె అనురాధ, పాలకమండలి డైరెక్టర్లు, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, కుమ్మరి/శాలివాహన సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

## పలాస కేంద్రీయ విద్యాలయలో తరగతులు షురూ!

● కేంద్ర విద్యాశాఖ అధికారిక ఉత్తర్వులు ● ఫలించిన రామ్మోహన్ నాయుడు కృషి



శ్రీకాకుళం, మార్చి 3 ప్రభాతవార్త: శ్రీకాకుళం జిల్లా, పలాసలో కేంద్రీయ విద్యాలయ తరగతులు 2026-27 విద్యా సంవత్సరం నుండి ప్రారంభం అవుతున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించి కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రీయ విద్యాలయ సంగతాన్ నుండి శుక్రవారం అధికారిక ఉత్తర్వులు వెలువడినట్లు తెలిపారు. ఆ ఉత్తర్వుల ప్రకారం కేంద్రీయ విద్యాలయ పాఠశాలను పలాసలో ఏర్పాటుకు గత సంవత్సరం అక్టోబర్ మూడవ తేదిన అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు. తరువాత పాఠశాల ఏర్పాటుకు అవసరమైన భూములు, ఇతర భవనాలు, వసతుల కోసం పలు కమిటీలు క్షేత్ర స్థాయి పరిశీలనలు చేసినట్టు పేర్కొన్నారు. భూముల బదలాయింపు, తాత్కాలిక తరగతుల నిర్వహణ కోసం వసతుల పరిశీలన పూర్తిగా జరిగిన నేపథ్యంలో రాబోయే విద్యా సంవత్సరం 2026-27 తరగతుల నిర్వహణ ప్రారంభిస్తున్నట్టు ఉత్తర్వులలో స్పష్టం చేశారు. ప్రస్తుతానికి ఒకటి నుండి అయిదవ తరగతి వరకు ప్రతీ తరగతికి ఒక సెక్షన్ చొప్పున ప్రవేశాలు తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాగా ఇదివరకే స్థానిక అధికారులతో కలసి ఈ ఏడాది ఫిబ్రవరి 17న పలాస రైల్వే కాలనీలోని ఆర్.పి.ఎఫ్ బారక్స్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిశీలన చేసి అవసరమైన సూచనలు చేశారు. రైల్వే అధికారులతో మాట్లాడి వారి నుండి కేంద్రీయ విద్యాలయకు గదుల బదిలీకి శాఖాపరమైన ప్రక్రియ వేగవంతం చెయ్యాలని స్పష్టం చేశారు. అనంతరం నెమలికొండ ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయ ప్రతిపాదిత స్థలాన్ని సైతం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. తాజాగా తరగతుల నిర్వహణకు ఉత్తర్వులు విడుదలైన నేపథ్యంలో రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస పరిసర ప్రాంతాల వారితో పాటు జిల్లాలోని సాయుధ దళాల సిబ్బందికి, కేంద్ర సంస్థల ఉద్యోగులకు పలాసలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటు ద్వారా పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయని అన్నారు.

కాగా రామ్మోహన్ నాయుడు చొరవతో ఇప్పటికే ఒక కేంద్రీయ విద్యాలయ ఉన్న శ్రీకాకుళం జిల్లాలో స్థానికులకు సేవలధించేందుకు వీలుగా పలాసలో మరొకటి ఏర్పాటు కాబోతుండటం ఈ విద్యా సంవత్సరం నుండి తరగతులు సైతం ప్రారంభం కాబోతుండటం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నమ్మకంతో చేరి... చోరి... నిందితుడు అరెస్ట్



నెల్లూరు క్రైమ్, మార్చి 13, ప్రభాతవార్త: ఎంతో నమ్మకంగా ఉంటూ యజమాని కుటుంబం దగ్గర మంచి పేరు తెచ్చుకుంటు న్నట్లు నటించి చివరకు ఆ ఇంట్లోనే చోరికీ పాల్పడ్డాడు ఒక ప్రబుద్ధుడు. ఈ సంఘటనలో నిందితుడిని వేదయపాలెం పోలీసులు శుక్రవారం మాధవ రోజు తీసుకొని చోరీ సొత్తు స్వాగతం చేసుకున్నారు. వేదాయపాలెం పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు కేసు పూర్వాపరాలను వెల్లడించారు. కొండాయపాలెం ప్రాంతంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారి శ్రీధర్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన వద్ద సత్యసాయి జిల్లా పెనుగొండ మండలం రేగిమేకల పల్లికి చెందిన కొండూరు శ్రీనివాసులరెడ్డి సహాయకునిగా పనిచేస్తున్నారు. ఈ నెల 5వ తేది సాయంత్రం శ్రీధర్‌రెడ్డి వ్యాపారానికి సంబంధించిన రూ.16.50 లక్షల నగదును ఇంటికి తీసుకువచ్చి శ్రీనివాసులు రెడ్డికి ఇచ్చి బీరువాలో భద్రపరచమని చెప్పారు. 6వ తేది శ్రీధర్ రెడ్డి నిద్రలేచి చూడగా సహాయకుడుతో పాటు బీరువాలో ఉంచిన రూ.16.50 లక్షల నగదు, 55 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో చోరి ఘటనపై బాధితుడు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు సాంకేతికత ఆధారంగా శుక్రవారం భగత్‌సింగ్ కాలనీ వద్ద శ్రీనివాసులరెడ్డిని అరెస్ట్‌చేశారు. నిందితుని వద్ద నుంచి రూ.15.70 లక్షల నగదు, 55 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

## అన్ని ప్రమాణాల్లో వేదాలే సర్వ శ్రేష్టం

### శృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి



తిరుమల, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: వైదిక విద్య చాలా ఉత్కృష్టమైన విద్య అని, అన్ని ప్రమాణాల్లో వేదాలే సర్వ శ్రేష్టమైనవని శృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి తెలిపారు. ఎన్నో జన్మల్లో పుణ్యం చేసుకుంటేగానీ వైదిక విద్యను అభ్యసించే అవకాశం కలగదని తెలియజేశారు. తిరుమల ధర్మగిరిలోని వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠంలో ఆరు రోజుల పాటు నిర్వహించిన 29వ వేంకటేశ్వర వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు చివరగా శుక్రవారం సమాపనోత్సవానికి (విజయోత్సవానికి) విశిష్ట అతిథిగా ఆయన విచ్చేశారు. ఇక్కడ వేద విద్యార్థులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ధర్మమే సమస్త ప్రపంచానికి ఆధారమని, వైదికమార్గం ద్వారానే ప్రపంచ శ్రేయస్సు లభిస్తుందని చెప్పారు.

తిరుమల క్షేత్రంలో ఉన్న వేద విజ్ఞాన పీఠం ప్రాచీన కాలం నుండి వేద, శాస్త్ర, ఆగమ విద్యలకు సంజీవనిగా నిలుస్తోందన్నారు. అనంతరం ఆయన పరీక్షల్లో ఉత్తీర్ణులైన 313 మంది విద్యార్థులను సన్మానించి విజయ పత్రికలను ప్రదానం చేశారు. వేద, శాస్త్ర, ఆగమాల్లోని 37 విభాగాల్లో దేశవ్యాప్తంగా 412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 313 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 202 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవ్వగా, 111 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఈ కార్యక్రమంలో వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివసుబ్రహ్మణ్య అవధాని, పండితులు పాల్గొన్నారు.

## నేడు జనసేన ఆవిర్భావ దినోత్సవం

### గిరిజన పల్లెలో పవన్ కల్యాణ్ వేడుకలు

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులు వేడుకలను సిద్ధమయ్యారు. అయితే, ఈ ఏడాది పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని గిరిపుత్రుల మధ్య జరుపుకోవాలని పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయించారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలోని నందిగరువు గ్రామంలో పవన్ కల్యాణ్ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొంటారు. గిరిజనుల కష్టసుఖాలను తెలుసుకుంటూనే, వారి మధ్య పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించ నున్నారు. తొలుత ఓనూరు జంక్షన్ వద్ద జనసేన జెండాను పవన్ కల్యాణ్ ఆవిష్కరిస్తారు. అనంతరం పిఎం జన్ మన్ పథకం కింద నిర్మించిన రోడ్లను ఆయన స్వయంగా పరిశీలిస్తారు. ఓనూరు జంక్షన్ నుంచి నందిగరువు వరకు నిర్మించిన 2.4 కి.మీ రహదారిని కాలినడకన ప్రయాణిస్తూ పనుల నాణ్యతను తనిఖీ చేస్తారు. తర్వాత నందిగరువు గ్రామ ప్రజలతో పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా భేటీ అవుతారు. వారి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు మాటా-మంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పర్యటన చివరలో గిరిజనులతో కలిసి పవన్ కల్యాణ్ మధ్యాహ్న భోజనం చేస్తారు. అధ్యక్షుడి పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో జనసైనికులు సేవా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే పార్టీ ప్రధాన లక్ష్యమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.



## సానిపాయి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ

రాజంపేట, మార్చి 13 ప్రభాతవార్త: వీరబల్లి మండలం సానిపాయి గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై కడప విజిలెన్స్ అధికారుల శుక్రవారం విచారణ నిర్వహించారు. సానిపాయి గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై నేతి రమేష్, నేతి రామ్మోహన్, గుగ్గిల వెంకటేష్ పై అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజిలెన్స్ డిఇ జోకబ్ ఫాల్, జెఇ విశ్వనాథన్ వచ్చి రికార్డులను నివేదికలు పైఅధికారులకు సమర్పిస్తామని తెలియజేశారు. ఈ విచారణలో పూర్వపు వీరబల్లి మండలం ఆర్డబ్ల్యూఎస్ ఎఇ కృష్ణయ్య, పంచాయతీ సెక్రటరీ లంక చంద్రుడు హాజరయ్యారు. పైఅధికారుల ఆదేశాను ప్రకారం వీరబల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఎటువంటి అవాంఛనీయ ఘటన జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఉస్తాద్ టికెట్టు రేట్లు పెంచుకునేందుకు ఎపి ప్రభుత్వం అనుమతి

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న భారీ చిత్రం "ఉస్తాద్ భగత్ సింగ్" విడుదలకు ముందే సందడి మొదలైంది. ఈ సినిమా టికెట్ రేట్లను పెంచుకునేందుకు అనుమతిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. ఉగాది పండగ కానుకగా ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం, సినిమా విడుదలయ్యే మొదటి 10 రోజుల పాటు టికెట్ ధరల పెంపునకు అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సాధారణ టికెట్ ధరపై అదనంగా రూ. 100, మల్టీప్లెక్స్‌లలో రూ.125 పెంచుకోవచ్చు. ఇక 19న ప్రదర్శించే బెనిఫిట్ షోల కోసం టికెట్ ధరను రూ.500గా నిర్ణయించారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో దర్శకుడు హరీశ్ శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. "గబ్బర్ సింగ్" వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్‌హరీశ్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు.

## మిథున్ రెడ్డి బెయిల్ రద్దుకు హైకోర్టు నిరాకరణ

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం కుంభకోణంలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి బెయిల్ ఉత్తర్వుల్లో ఏసీబీ కోర్టు తన పరిధి దాటి పలు అంశాలు ప్రస్తావించిందని ఏపీ హైకోర్టు వ్యాఖ్యానించింది. అవి కేసు దర్యాప్తునకు ఆటంకం కలిగించేలా ఉన్నాయని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఆ అంశాలను కోర్టు నిలిపివేసింది. మిథున్ రెడ్డి బెయిల్ రద్దును హైకోర్టు నిరాకరించింది. మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పు రద్దు చేయాలని కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు పాక్షికంగా అనుమతించింది. మిథున్ రెడ్డి విషయంలో దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ కూడా దాఖలు చేయలేదని ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు గుర్తు చేసింది. మిథున్ రెడ్డి బెయిల్ ఉత్తర్వుల్లో ఏసీబీ కోర్టు ప్రస్తావించిన పలు అంశాల అమలును కోర్టు నిలిపి వేసింది. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ తమ వాదనలు వినిపించారు. శుక్రవారం ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

## లొంగిపోలేదు.. అరెస్టయ్యాం!

### తప్పనిసరి పరిస్థితుల్లో అలా జరిగింది.. మాజీ మావోయిస్టు నేత దేవ్‌జి వెల్లడి

హైదరాబాద్, మార్చి 13, ప్రభాతవార్త: డిజిపి శివధర్‌రెడ్డి ఎదుట ఇటీవలే లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత తిపిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవ్‌జీతో పాటు బడె చొక్కారావు, నల్ల రాజిరెడ్డి, నరసింహారెడ్డి లొం గిపోగా తమది లొంగుబాటు కాదని తామంతా అరెస్టయ్యామని దేవ్‌జీ చెప్పడం పోలీసులను షాక్‌కు గురిచేసింది. బంజారాహిల్స్‌లోని కమాండ్ క ంట్రోల్‌లో వీరంతా లొంగిపోగా అదే సమయంలో వీరికి రివార్డులు కూడా అందించారు. లొంగిపోయిన సమయంలో తామంతా సిఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు జనజీవన స్రవంతిలో కలుస్తున్నట్లు చెప్పడం తెలిసిందే. రాజిరెడ్డి మాత్రం మావోయిజం ఎప్పటికీ అంతం కాదని, ప్రపంచం వున్న ంత వరకు, సామాన్యుల సమస్యలు వున్నంతకాలం వుంటుందని వెల్లడించారు. అయితే శుక్రవారం నాడు దేవ్‌జీ తనను కలిసిన మీడియాతో మా ట్లాడుతూ మేమంతా లొంగిపోలేదు, అరెస్టు చేశారని తెలిపారు. అయితే ఈ అరెస్టంతా తప్పనిసరి పరిస్థితుల్లో జరిగిందని ఆయన తెలిపారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి ఎక్కడ వున్నాడనేది తమకు తెలియదని ఆయన తెలిపారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ పూర్తిగా క్షీణించిందని, మారిన పరిస్థితుల్లో పోరాటం సాధ్యం కాదని దేవ్‌జి పేర్కొన్నారు. 2023లో చివరిసారిగా సెంట్రల్ కమిటీ సమావేశం జరిగిందని, ఆ తరువాత పార్టీకి దిశా నిర్దేశం చేసేవారు లేకుండా పోయారని ఆయన తెలిపారు. మావోయిస్టు పార్టీ ఒక రాజకీయ పార్టీగా దేవ్‌జి తెలిపారు. రాజకీయ పార్టీ నడవాలంటే డబ్బులు కావాలని ఆయన వెల్లడించారు. పార్టీలో వున్న డబ్బులను కేవలం నగదు రూపంలోనే కాకుండా బంగారం కొనుగోలు చేస్తే బాగుంటుందని భావించి భారీగా బంగారాన్ని కొన్నామని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలోనే మావోయిస్టు పార్టీ వద్ద కిలోల కొద్ది బంగారం వుందని, కోట్లాది రూపాయల నగదు వుందని దుష్ప్రచారం జరిగిందని, ఇది సరైంది కాదని ఆయన తెలిపారు. తాను రాజకీయ జీవితాన్ని ప్రారంభిస్తు న్నానని చెబితే ఈ విషయంలోనూ అందరు అపార్థం చేసుకున్నారని దేవ్‌జి తెలిపారు. పార్లమెంటరీ వ్యవస్థలోని ఎంఎల్ఎ, ఎంపి, ఎంఎల్‌సి కావాలని తనకు లేదని, ప్రజల్లో వుండి వారి కోసం న్యాయపరంగా పోరాటం చేయడమే తన రాజకీయ జీవిత లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## పెట్టుబడులు రావడాన్ని జీర్ణించుకోలేక వైసిపి దుష్ప్రచారం

- రాష్ట్ర మంత్రులు బిసి జనార్దన్‌రెడ్డి, కొల్లు రవీంద్ర



సచివాలయం, మార్చి 13 ప్రభాతవార్త: జువ్వెలదిన్నె పిషింగ్ హార్బర్‌ను ప్రవేట్ పరం చేస్తున్నామంటూ ప్రతిపక్షం చేస్తున్న విమర్శల్లో ఎంతమాత్రం వాస్తవం లేదని రాష్ట్ర మంత్రి బి.జనార్ధన్‌రెడ్డి కొట్టిపారేశారు. సచివాలయంలోని పబ్లిసిటీ సెల్లో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రతో కలసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ఇరువురు మంత్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ సిఎం జగన్ దుర్మార్గాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఇరువురు మంత్రులు ప్రజలకు పిలుపునిచ్చారు. జువ్వలదిన్నె అభివృద్ధిపై జగన్‌రెడ్డి కుట్రలు సిగ్గుచేటన్న మంత్రులు, రాష్ట్ర ప్రగతిని అడ్డుకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జువ్వలదిన్నె పిషింగ్ హార్బర్‌ను ప్రైవేట్ పరంగా చేస్తున్నారన్న వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు. మొత్తం 114ఎకరాల 13సెంట్ల హార్బర్ భూమిలో కేవలం 7ఎకరాలు మాత్రమే సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు కేటాయించడం జరిగిందన్నారు. మత్స్యకారులకు ఆధునిక కమ్యూనికేషన్, వాతావరణ సమాచారం అందించేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని తెలిపారు. ఉపగ్రహాలు, డ్రోన్లు, ఆధునిక టెక్నాలజీ ద్వారా సముద్రంలో ఉన్న మత్స్యకారులకు అదనపు సమాచారం అందనుందన్నారు.

రాష్ట్ర ప్రగతిని అడుకుంటామంటే ఉపేక్షించేదేది లేదు: మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జువ్వలదిన్నె హార్బర్ వద్ద అటానమస్ మారిటైం షిప్‌యార్డు నిర్మాణంపై తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పబోవని మంత్రి హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పారిశ్రామిక ప్రగతి దిశగా కీలకమైన అడుగులు వేస్తున్నాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25.03శాతం ఏపికి రావడం కూటమి పాలనకు నిదర్శనం అన్నారు.

మత్స్యకారులు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: గత ఐదు సంవత్సరాల పాటు వేటకు వెళ్ళి మరణించిన మత్స్యకారులకు పైసా చెల్లించలేదు. కానీ కూటమి అధికారంలోనికి రాగానే 95మందికి రూ.4.75కోట్లు చెల్లించాం. మత్స్యకారుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేశాం. మత్స్య రంగానికి తోడ్పాటు అందించేలా పరిశ్రమల్ని తీసుకొచ్చి అండగా నిలుస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా మత్స్యకారులను పారిశ్రామికంగా తోడుగా నిలుస్తున్నాం. అలాంటి ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి జగన్ వారి ముఠా కాస్తైనా సిగ్గుపడాలని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు.

## గ్యాస్ కొరతను సృష్టిస్తున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### గ్యాస్ సరఫరా పై ప్రజలు ఆందోళన చెందవద్దు: బిజెపి అధ్యక్షుడు మాధవ్

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: వంట గ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందవద్దని ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ గ్యాస్ కొరత లేకుండా చూస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్ కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరితో ఫోన్ చేసి ప్రస్తుత పరిస్థితులు పై సంభాషించారు. కేంద్ర మంత్రి గ్యాస్ విషయంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో అంతర్జాతీయ స్థాయిలో ఇంధన సరఫరాలపై కొంత మేర ప్రభావం పడుతున్నప్పటికీ, అదే పరిస్థితిని సాకుగా చూపిస్తూ కొన్ని గ్యాస్ ఏజెన్సీలు కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులపై అదనపు భారం మోపడం సరైంది కాదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల సరఫరాను కావాలనే ఆలస్యం చేయడం, స్టాక్ ఉన్నప్పటికీ లేదని చెప్పడం, అలాగే అదనపు చార్జీలు వసూలు చేయడం వంటి ఫిర్యాదులు ప్రజల నుంచి వస్తున్నాయని ఆయన తెలిపారు. ఇటువంటి చర్యలు సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ ఏజెన్సీలు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే కొందరు వ్యాపార ప్రయోజనాల కోసం ప్రస్తుత పరిస్థితిని దుర్వినియోగం చేస్తూ కృత్రిమ కొరతను సృష్టించడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత సరఫరా శాఖ అధికారులు వెంటనే స్పందించి గ్యాస్ ఏజెన్సీల పనితీరుపై సమగ్రంగా పరిశీలన చేయాలని మాధవ్ కోరారు. అవసరమైతే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సిలిండర్ల సరఫరా నిరంతరంగా కొనసాగేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సామాన్య ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి వినియోగదారుల హక్కులను పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే గ్యాస్ సరఫరా వ్యవస్థపై అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని, అక్రమంగా ధరలు పెంచే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## కూటమి ప్రభుత్వంలో ఆలయాల పరిరక్షణ, సంప్రదాయాల సంరక్షణ అభివృద్ధి

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వంలో ఆలయాల పరిరక్షణ, హిందూ ధార్మిక సంప్రదాయాల సంరక్షణ ఎంతో అభివృద్ధి చెందిందని రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య అన్నారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడిన ఆయన, నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని దేవాలయాల పరిరక్షణకు అత్యంత శ్రద్ధ చూపుతూ, భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆధ్యాత్మిక, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తూ భక్తి ప్రవృత్తులను పెంపొందిస్తూ ఆలయాలను రక్షిస్తోందని తెలిపారు. ఇంకా ఆయన మాట్లాడుతూ...దేవాలయాల్లో అన్యమతస్థులు ఉద్యోగులుగా ఉండకుండా కూటమి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. అత్యధిక ఆలయాలు పర్యాటక, అటవీ ప్రాంతాల్లో ఉండటంతో వాటి అభివృద్ధికి దేవాదాయ, అటవీ, పర్యాటక శాఖల మంత్రులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసింది. ప్రసాదం, అన్నదానం నాణ్యత, నిర్వహణలో ఎలాంటి లోపాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూ, సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రథాల దహనం, ఆలయాల విధ్వంసం, దేవతా విగ్రహాల ధ్వంసం వంటి హిందూ వ్యతిరేక ఘటనలపై ఏ రోజు చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిందితులు తప్పించుకోకుండా శిక్షలు పడేలా విచారణ చర్యలు చేపట్టింది. పాలకవర్గ సభ్యుల్లో ఒక నాయీబ్రాహ్మణుడికి అవకాశం ఉండగా, కొత్తగా మరొక బ్రాహ్మణుడికి స్థానం కల్పించేలా చర్యలు తీసుకుంది. 1,110 ఆలయాలకు కొత్త పాలకవర్గాలను నియమించి, ప్రతి పాలకవర్గంలో ఇద్దరు సభ్యులను అదనంగా చేర్చే ప్రణాళికలు రూపొందించింది. ఇలాంటి చర్యలు కూటమి ప్రభుత్వం ధర్మ పరిరక్షణ, ఆలయ రక్షణపై చూపుతున్న శ్రద్ధకు నిదర్శనం. హిందూ మత గౌరవాన్ని, హిందువుల మనోభావాలను మరింత పెంపొందించేలా కూటమి పనిచేస్తోంది. చంద్రబాబు నాయుడు గారు స్థాపించిన బ్రాహ్మణ కార్పొరేషన్‌ను, బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని బలోపేతం చేస్తోంది కూటమి ప్రభుత్వం. యువగళం హామీ మేరకు నిరుద్యోగ వేద విద్యార్థులకు నెలకు రూ.3 వేల భృతి అందిస్తోంది. వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం అమ్మవారి ఆత్మార్పణ రోజున దేవాదాయ శాఖ అధికారిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

## డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై ఆంక్షలు

- హానికరమైన కంటెంట్ వాడకంపై పిల్లలను రక్షించడానికి చర్యలు
- ఎంపి పుట్టా మహేష్ ప్రశ్నకు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడి

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: డిజిటల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో హానికంమైన కంటెంట్ వాడకం నుండి పిల్లలను రక్షించడానికి అనేక చర్యలను చేపట్టినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. సోషల్ మీడియా వాడకం పిల్లలపై, వారి మానసిక ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావంపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు గురువారం లోక్ సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) చట్టం, 2000, పిల్లల డేటా రక్షణ (డిపిడిపి చట్టం, 2023) ఇండియా ఏఐ మిషన్ కింద సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో హానికరమైన కంటెంట్ పిల్లలను రక్షించడానికి అనేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడిం చారు. సోషల్ మీడియాలో హానికర కంటెంట్ వ్యాప్తి నిరోధానికి తీసుకుంటున్న చర్యలపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం చెబుతూ చట్టాన్ని ఉల్లంఘించే కంటెంట్ ను పోస్ట్ చేయడం లేదా షేర్ చేయడాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు నిరోధించాలని ఆదేశించినట్లు తెలిపారు. సమాచార భద్రతలో మానవ వనరుల వినియోగంలో జాగ్రత్తలు, సైబర్ భద్రత అంశాలపై సాధారణ అవగాహనను కల్పించడానికి ఐఎస్ఇఎ పై మిట్లివై ఒక ప్రాజెక్ట్‌ను అమలు చేస్తోందన్నారు. ఇప్పటివరకు, దేశవ్యాప్తంగా 4,309 అవగాహన వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయనీ, వీటిలో పాఠశాల/ కళాశాలలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సంస్థలు, ప్రభుత్వ సిబ్బంది, సాధారణ ప్రజలు సహా 9.63 లక్షల మంది పాల్గొన్నారని, పాఠశాల పిల్లలు మరియు విద్యార్థుల కోసం 1,186 అవగాహన వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయని కేంద్ర మంత్రి వివరించారు.



## ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని పెంచేలా పనిచేయాలి

### అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు, జూనియర్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేసిన కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్

విజయవాడ,మార్చి 13,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్మిక శాఖను మరింత బలోపేతం చేసే దిశగా కొత్తగా నియమితులైన 28 మంది అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు, 3 మంది జూనియర్ అసిస్టెంట్లకు సచివాలయంలోని 5 బ్లాక్‌లో కాన్ఫరెన్స్ హాల్ నందు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కార్మిక శాఖను సమర్థవంతంగా నడిపించడానికి, కార్మికులకు మెరుగైన సేవలు అందించడానికి కొత్తగా నియమితులైన అధికారులు కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. నూతనంగా నియమితులైన అధికారులందరికీ మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. కార్మికుల హక్కులను రక్షిచడం తమ ప్రధాన బాధ్యతగా భావించి విధులు నిర్వర్తించాలని అన్నారు. పరిశ్రమలు, కార్మికుల మధ్య సమతుల్యతను కాపాడుతూ కార్మిక చట్టాల అమలులో పారదర్శకతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్మిక సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా అసంఘటిత కార్మికుల నమోదు మరియు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో అధికారులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ప్రతి జిల్లాలో కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా పని చేయాలని, కార్మికులకు న్యాయం జరిగేలా చట్టాల అమలులో కఠినంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. యువ అధికారులు తమ విధుల్లో నిబద్ధతతో పనిచేయాలని ఆకాంక్షి ంచారు. రాష్ట్ర అభివృద్ధిలో కార్మికుల పాత్ర అత్యంత ముఖ్యమని పేర్కొన్న మంత్రి, కార్మిక శాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని అన్నారు. పరిశ్రమల అభివృద్ధి మరియు కార్మిక సంక్షేమం రెండూ సమానంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ధర్మమని పేర్కొన్న మంత్రి, ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి నిరంతరం కట్టుబడి ఉందన్నారు. నూతనంగా నియమితులైన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు, జాయింట్ కమిషనర్ లక్ష్మీనారాయణ కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఏఎల్ఓ లు, అధికారులు పాల్గొన్నారు.

## దేశీయ మార్కెట్లకు రూ.33 లక్షల కోట్ల మేర నష్టం

న్యూఢిల్లీ, మార్చి 13: ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించినప్పటి నుంచి వారాంతం వరకూ దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్టర్ల సంపద కర్పూరంలా కరిగిపోయింది. గతనెల 28వ తేదీ నుంచి ఇప్పటివరకూ చూస్తే 33 లక్షలకోట్లమేర టర్నోవర్ క్షీణించింది. సెన్సెక్స్ నిఫ్టీలు భారీ స్థాయిలో క్షీణించడమే ఇందుకు కీలకం. ముడిచమురుధరలు పెరిగిపోవడం, బ్యారెల్ 100 డాలర్లకు పైబడి ట్రేడ్ కావడం ఒక ఎత్తు అయితే డాలరుతో రూపాయి మారకం విలువలు మరింతగా క్షీణించడం, భౌగోళిక ఉద్రిక్తతలతో ఇన్వెస్టర్లుతమతమ సొమ్ములు విత్‌డ్రాచేసుకోవడమే ఈ నష్టాలకు కారణం అన్నది తెలిసిందే. కేవలం భారత్‌లోనే కాకుండా విదేశీ మార్కెట్లలో కూడా నష్టాలపరంపర కొనసాగింది. శుక్రవారం ఒక్కరోజే ఇన్వెస్టర్ల సొమ్ములు ఏకంగా రూ.10 లక్షలకోట్లు నష్టపోయినట్లు తేలింది. బిఎస్ఇలో లిస్ట్ అయిన కంపెనీల విలువలు 439.72 లక్షలకోట్లనుంచి 43139 లక్షలకోట్ల విలువలకు తగ్గిపోవడంతో ఒక్కరోజే ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు సంభ వించాయి. వీటికితోడు హార్మూజ్ జలసంధినుంచి చమురు,గ్యాస్ ట్యాంకర్ల రాకపోకలు నిలిచిపోవడం కూడా నష్టాలకు కొంత తోడయింది. మొత్తం 20శాతం చమురుసరఫరా ప్రత్యామ్నాయ మార్గాలవైపు వెళ్లాల్సి వచ్చింది. దీనితో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకుపై బడ్డాయి. అమెరికా, ఇజ్రా యెల్ ఇతర ఆ రెండు దేశాల మిత్రదేశాలకు హార్మూజ్ జలసంధి నుంచి వెళ్లేందుకు అనుమతించబోమని కఠిన చర్యలు ఎదుర్కోనాల్సి ఉంటుం దని హెచ్చరికలు చేయడంతో నౌకా రవాణా పూర్తిగా నిలిచింది. ఇరాన్ ఆమోదించిన దేశాల నౌకలు మాత్రమే ఇపుడు హార్మూజ్‌ద్వారా వస్తున్నాయి. వీటిలో చైనా, భారత్‌ల ఉన్నాయి.

ఈ నెలలోని 13 రోజుల్లో తొమ్మిదిరోజులు స్టాక్ మార్కెట్లు నడిచాయి. సెన్సెక్స్ 6700 పాయింట్లు పతనం అయితే నిఫ్టీ రెండువేల పాయింట్లకు పైబడి నష్టపోయింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు సుమారు రూ.52 లక్షలకోట్ల షేర్లు విక్రయించేసారు.

## దేవుని చెరువు ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర అసహనం

### విద్యార్థుల తల్లిదండ్రులకు క్షమాపణలు
### ఘటనపై త్రిసభ్య కమిటీతో దర్యాప్తు

విజయవాడ, మార్చి 13 ప్రభాతవార్త ప్రతినిధి: దేవుని చెరువు ఘటనపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత తక్కువగా ఉందనే సమాచారం వచ్చిందని, ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం దేవునిచెరువు ప్రభుత్వ పాఠశాలలో గత మూడు నెలలుగా నాణ్యతలేని మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. భోజనం నాణ్యతగా లేదని విద్యార్థులు డస్ట్‌బిన్‌లో పారబోశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత తక్కువగా ఉందనే సమాచారం వచ్చిందని, ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకోవడానికి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. ఈ కమిటీ సమగ్రంగా విచారణ జరిపి నివేదిక సమర్పించనుందని వివరించారు. ఆ నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే కొన్ని ప్రాథమిక చర్యలు తీసుకున్నామని అన్నారు. భోజనం సరఫరా చేస్తున్న ఏజెన్సీని మార్చడంతో పాటు పాఠశాల హెడ్‌మాస్టర్‌పై కూడా చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఘటనపై తల్లిదండ్రులకు నారా లోకేష్ క్షమాపణలు తెలిపారు.




## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### జెఎన్‌టియుఎ ఉపకులపతి హెచ్. సుదర్శన రావు

పులివెందుల, మార్చి 13 ప్రభాతవార్త: జెఎన్‌టియుఎ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో 20వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలకు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు భారీగా హాజరై వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఎన్‌టియు అనంతపురం ఉపకులపతి సీనియర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, నిబద్ధతతో విద్యను అభ్యసిస్తూ సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం సాధించాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలు, ఇతర సృజనాత్మక రంగాల్లోనూ రాణిస్తూ సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న జేఎన్‌టీయూఏ ఇండస్ట్రియల్ కన్సల్టింగ్ సర్వీసెస్ డైరెక్టర్ సీనియర్ ప్రొఫెసర్ పి.ఆర్. భాను మూర్తి విద్యార్థులకు విలువైన సూచనలు అందిస్తూ భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా నిర్ధారించుకొని ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. అలాగే యుపిఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్-2025లో 360వ ర్యాంకు సాధించిన జేఎన్‌టీయూఏ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థిని రాయలం జయశ్రీ ఈ వేడుకలకు హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యమైనా సాధ్యమేనని ఆమె విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. క్రీడా దినోత్సవం మరియు కళాశాల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ విద్యా, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు వార్షిక క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఉపకులపతి హెచ్. సుదర్శన రావు, సీనియర్ ప్రొఫెసర్ పి.ఆర్. భాను మూర్తి బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డి. విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ కె. శేష మహేశ్వరమ్మ పర్యవేక్షణలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు సమన్వయంతో ఈ 20వ వార్షికోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి.



## దుర్గమ్మవారి ఆలయంలో 19నుండి ఉగాది వేడుకలు

### 28 వరకు వసంత నవరాత్రోత్సవాల సందర్భంగా పుష్పార్చనలు
### ఆర్జిత సేవగా ప్రత్యేక పుష్పార్చనలలో పాల్గొనాలన్న ఇఓ

ఇంద్రకీలాద్రి, మార్చి 13 ప్రభాతవార్త: శ్రీ దుర్గమ్మవారి ఆలయంలో 19న ఉగాది పర్వదిన వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానములో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది" పర్వదినము నుండి 28 వరకు వసంత నవ రాత్రోత్సవములు" 27న శ్రీరామనవమి సందర్భముగా "ప్రత్యేక పుష్పార్చనలు" ఇతర వైదిక కార్యక్రమములు నిర్వహించుటకు వైదిక కమిటీ సూచనల మేరకు నిర్ణయించామన్నారు. ఉగాది పర్వదినాన సాయంత్రం 6గంటలకు శ్రీ స్వామి అమ్మవార్ల వెండి రథోత్సవం శ్రీ మల్లికార్జున మహా మండపము నుండి ప్రారంభమై కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, జమ్మిదొడ్డి, కోమలా విలాస్, రమణయ్య కూల్ డ్రింక్స్ షాపు, బోడెమ్మ హోటల్, 1 టౌన్ పోలీస్ స్టేషన్, సామారంగం చౌక్, శ్రీను హోటల్, బ్రాహ్మణ వీధి మీదుగా తిరిగి మహామండపము చేరును. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల కృపకు పాత్రులు కావాలని ఇఓ తెలిపారు.

భక్తుల విరాళం: శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఎం.దశరథ రామారావు, ఇందిర, ఎం. కృష్ణారావు రూ.2,01,116/-లు, నిత్య ఉచిత ప్రసాద వితరణ నిమిత్తం చీరాలకి చెందిన వై.కృష్ణారావు కుమారుడు వై.బి.పి.నాయుడు రూ.1లక్ష విరాళాన్ని ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణకి అందించారు. దాతలకు శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదము శేషవస్త్రము చిత్రపటము అందచేశారు.





# క్రీడా ప్రేమికుడు హెచ్‌జె దొర



**హైదరాబాద్, మార్చి13(వార్త క్రీడా ప్రతి నిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిజిపి, గతంలో ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరించిన హనుమంతు జగన్నాయక్ దొర(హెచ్‌జే దొర) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. 83 ఏళ్ల హెచ్‌జే దొర మృతి క్రీడా లోకానికి తీరని లోటని తెలంగాణ ఒలింపిక్ సంఘం ఘనంగా నివాళి అర్పించింది. వివిధ క్రీడా సంఘాలు, క్రీడాకారులు, మాజీలు... హెచ్‌జే దొర మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గొప్ప క్రీడా పరిపాలకుడని కితాబిచ్చారు. అతని హయాంలో క్రీడల పురోగతిని గుర్తుచేసుకున్నారు.

హెచ్‌జే దొర పోలీస్ ఉన్నతాధికారిగానే కాకుండా క్రీడా పరిపాలకుడిగా గుర్తింపు పొందారు. క్రీడల పట్ల ఆయనకు ప్రత్యేకమైన ఆసక్తి ఉండేది. క్రీడా సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించి క్రీడల పురోగతికి పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడుగా సుదీర్ఘంగా పని చేసిన హెచ్‌జే దొర... రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి విశేష కృషి చేశారు. అతని హయాంలోనే ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ భవన్ నిర్మాణం జరిగింది. దేశంలోనే ఇది తొలి ఒలింపిక్ భవన్ ఇది. ఈ పదవిలో ఉండగా రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. క్రీడా మౌలిక వసతులతో పాటు యువ క్రీడాకారులను గుర్తించి వారికి మెరుగైన శిక్షణ ఇప్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రోత్సహించారు. హైదరాబాద్‌లో జరిగిన 2002 జాతీయ క్రీడల నిర్వహణలో హెచ్‌జే దొర కీలక పాత్ర పోషించారు. ఈక్రీడా పోటీలు విజయవంతంగాజరగడానికి ఆయన చేసిన నిర్వహణ, ప్రణాళిక దోహదపడింది. ఈ పోటీల ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలపై ఆసక్తి పెంచడమే గాక, మంచి గుర్తింపు వచ్చింది. అనేక మంది యువకులు క్రీడల వైపు ఆకర్షితులయ్యారు. కొద్దికాలం హైదరాబాద్ హాకీ సంఘం అధ్యక్షుడిగానూ హెచ్‌జే దొర వ్యవహరించారు. ఈ కాలంలో బేగంపేట్‌లో అధునాతన ఆస్ట్రోటర్ఫ్ హాకీ కాంప్లెక్స్ నిర్మించారు. రాష్ట్రంలోనే ఇది తొలి హాకీ ఆస్ట్రోటర్ఫ్. ఇక్కడ పలు జాతీయ హాకీ పోటీలు నిర్వహించడంలో ప్రధాన భూమిక వహించారు. ట్రిపుల్ ఒలింపియన్ ముకేష్‌తో పాటు పలువురు హాకీ క్రీడాకారులు దొర హయాంలోనే తయారయ్యారు.

### 2006 కామన్‌వెల్త్ క్రీడలకు చెఫ్ డి మిషన్‌గా హెచ్‌జే దొర

హెచ్‌జే దొర కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా క్రీడా పరిపాలనలో సేవలు అందించారు. ఆయన భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఈ పదవిలో ఉండగా భారత వెయిట్‌లిఫ్టర్లకు మంచిశిక్షణ అవకాశాలు కల్పించారు. అంతర్జాతీయ పోటీల్లో భారత వెయిట్ లిఫ్టర్లు మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి అవసరమైన మద్దతు అందించారు. 2006 కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొన్న భారత బృందానికి చెఫ్ డి మిషన్‌గా వ్యవహరించారు. ఈ బాధ్యతలో ఆయన భారత క్రీడాకారుల సమన్వయం, నిర్వహణ వంటి పనులను సమర్థంగా నిర్వహించారు. హెచ్‌జే దొర కృషి వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు మంచి ప్రోత్సాహం లభించింది. మొత్తానికి మంచి క్రీడా పరిపాలకుడిగా మాత్రమే కాకుండా క్రీడల అభివృద్ధికి కట్టుబడి పనిచేసిన వ్యక్తి. క్రీడా రంగంలో దొర చేసిన కృషి భవిష్యత్తుతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.



దేశంలోనే తొలి ఒలింపిక్ భవన్

# భారత్‌కు ప్రపంచకప్ టికెట్

## సెమీస్‌లో ఇటలీకి షాక్ — ఫైనల్లో అమ్మాయిలు



**హైదరాబాద్, మార్చి13(వార్త క్రీడా ప్రతినిధి):** గచ్చిబౌలీ హాకీ కాంప్లెక్స్‌లో జరుగుతున్న మహిళలప్రపంచకప్ క్వాలిఫైయింగ్ టోర్నీలో భారత అమ్మాయిలు అజేయంగా కొనసాగుతున్నారు. సెమీఫైనల్లో ఇటలీని 1-0తో ఓడించి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. వరుసగా మూడోసారి ప్రపంచకప్ బెర్త్ అందుకుంది. ఈ ఏడాది బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరిగే ప్రపంచకప్‌లో పాల్గొననుంది. 2018 లండన్ ప్రపంచకప్‌లో 8వ స్థానం, 2022 వాలెన్సియా ప్రపంచకప్ లో 9వ స్థానం పొందింది.

లీగ్ మ్యాచ్‌ల్లో ఉరుగ్వే, వేల్స్‌ను ఓడించి స్కాట్లాండ్‌తో డ్రా చేసుకుని సెమీస్ చేరిన సలీమాటెటే నేతృత్వంలోని భారత అమ్మాయిలు... ఇటలీతో మ్యాచ్‌లోనూ జోరు చూపారు. తొలి రెండుక్వార్టర్‌లో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. 18వ నిమిషంలో భారత్‌కు తొలి పెనాల్టీ కార్నర్ లభించింది. నవనీత్ కొట్టిన షాట్‌ను ఇటలీ గోల్‌కీపర్ లూసియా చక్కగా అడ్డుకుంది. చివరకు మూడో క్వార్టర్‌లో భారత్‌కు గోల్ లభించింది. 39వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను మనీషా చౌహాన్ గోల్‌గా మలిచింది. చివరి క్వార్టర్‌లో భారత్ కు మరో రెండు పెనాల్టీకార్నర్‌లు లభించినా గోల్స్‌గా మలచలేకపోయింది. 59వ నిమిషంలో ఇటలీకి కీలకమైన పెనాల్టీ కార్నర్ లభించింది. అయినప్పటికీ, భారత్ తమ ప్రత్యర్థిని గోల్ సమం చేయకుండా అడ్డుకుని విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

## స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విక్టరీ

అంతకుముందు జరిగిన మొదటి సెమీఫైనల్లో ఇంగ్లాడ్ 2-0 గోల్స్ తేడాతో స్కాట్లాండ్‌పై గెలుపొందింది. తొలి క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. రెండో క్వార్టర్ 24వ నిమిషంలో బింగ్హామ్ లోల్టి ఇంగ్లాండ్‌కు తొలి గోల్ అందించింది. ఆ వెంటనే మరో నాలుగు నిమిషాలకు ఇంగ్లాండ్ ఖాతాలో రెండో గోల్ చేరింది. ఈసారి బోర్న్ డారే.. స్కాట్లాండ్ డిఫెన్స్‌లోకి దూసుకెళ్లి అద్భుతంగా గోల్‌గా మలిచింది. రెండో క్వార్టర్‌లో ఇంగ్లాండ్‌కు రెండు గోల్స్ లభించాయి. గోల్స్ సమం చేసేందుకు స్కాట్లాండ్ ప్రయత్నించినా..ఇంగ్లాండ్ రక్షణ పంక్తిని ఛేదించలేక చతికిలపడ్డారు. భారత్‌తో పాటు ఇంగ్లాండ్ ఫైనల్‌కు దూసుకెళ్లడం ద్వారా ప్రపంచకప్ బెర్త్ దక్కించుకున్నాయి. ఆదివారం ఇరు జట్ల మధ్య ఫైనల్ జరగనుంది. అదే రోజు మూడోస్థానం కోసం స్కాట్లాండ్, ఇటలీ తలపడతాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుంది.



24వ నిమిషంలో ఇంగ్లాండ్‌కు తొలి గోల్ అందించిన బింగ్హామ్ లోల్టి

# స్విస్ ఓపెన్‌లో తరుణ్ సంచలనం

### పురుషుల సింగిల్స్‌లో ఒకే ఒక్కడు - క్వార్టర్స్‌లో జింటాంగ్‌తో పోరు




భారత్ ఆశాకిరణం తరుణ్ మన్నెపల్లి

**బాసెల్:** స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగిన తరుణ్ మన్నెపల్లి సంచలన విజయాలతో దూసుకుపోతున్నాడు. భారీ అంచనాలున్న భారత షట్లర్లు పరాజయాలతో ఇంటిదారి పట్టగా పురుషుల సింగిల్స్‌లో భారత్‌సవాల్‌గా తరుణ్ ఒకే ఒక్కడుగా నిలిచాడు. ప్రి కార్వర్‌ఫైనల్లో మలేషియా ఆటగాడు జస్టిస్ హోప్పై 21-14, 22-20తో గెలుపొంది ముందంజ వేశాడు. ప్రపంచ 43వ ర్యాంకు లో ఉన్న తరుణ్ తొలి సెట్‌లో మలేషియా షట్లర్‌ను పదునైన ఏస్‌లు, తెలివైన ప్లేసింగ్‌లతో కంగుతినిపించాడు. రెండో సెట్‌లో పుంజుకున్న మలేషియా షట్లర్... తరుణ్‌కు గట్టిపోటీ ఇచ్చాడు. టై బ్రేకర్‌లో ఒత్తిడికి లోనుకాకుండా తరుణ్ 22-20తో ముగించాడు. తొలిసారి క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించిన కిరణ్ మన్నెపల్లి... జింటాంగ్‌తో తలపడనున్నాడు.

పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో భారత షట్లర్ కిరణ్ జార్జ్ ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో కిరణ్ జార్జ్ 18-21, 21-16, 16-21 తేడాతో హాంకాంగ్‌కు చెందిన జేసన్ గుణవన్ చేతిలో పరా జయం చెందారు. 70నిమిషాల పాటు సాగిన పోరులో కిరణ్ అద్భుతంగా పోరాడిన ప్పటికీ, నిర్ణయాత్మక మూడో గేమ్‌లో పట్టు కోల్పోయి మూల్యం చెల్లించుకున్నారు.

మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణి మాళవిక బన్సోద్‌కు నిరాశే ఎదురైంది. థాయ్‌లాండ్ స్టార్ ప్లేయర్, ప్రపంచ నాలుగో ర్యాంకర్ పోర్న్‌పావీ చోచువాంగ్‌తో జరిగిన ఏకపక్ష పోరులో మాళవిక 11-21, 15-21 తేడాతో ఓటమి చూశారు. థాయ్ క్రీడాకారిణి చేతిలో మాళవికకు ఇది వరుసగా నాలుగో ఓటమి.

# డుప్లాంటిస్ 15వ ప్రపంచ రికార్డు

**స్వీడన్:** స్వీడిష్ పోల్ స్టార్ అర్మాండ్ డుప్లాంటిస్ 15వ సారి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. తన రికార్డులను తనే అధిగమిస్తూ చరిత్ర సృష్టిస్తున్నాడు. ప్రపంచ అథ్లెటిక్స్ ఇండోర్ టూర్ లో భాగంగా జరిగిన మోండో క్లాసిక్‌లో డుప్లాంటిస్ స్వదేశీ ప్రేక్షకుల ముందు ఈ మైలురాయిని సాధించాడు. 6.31 మీటర్ల మార్కును సాధించడం ద్వారా ఈ ఒలింపిక్ ఛాంపియన్.. మునుపటి రికార్డును అధిగమించాడు. మొదట 5.65 మీటర్లు, ఆ తర్వాత 5.90 మీటర్లు, 6.08 మీటర్ల మార్కులను అధిగమించాడు. ఆపై 6.31 మీటర్ల రికార్డు ప్రయత్నం చేశాడు. ఈ మార్కును క్లియర్ చేయడం ద్వారా, డుప్లాంటిస్ సెప్టెంబర్‌లో టోక్యోలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తన ప్రపంచ రికార్డును మెరుగుపరుచుకున్నాడు. ఫిబ్రవరి 2020లో 6.17 మీటర్ల జంప్‌తో మొదటిసారి ప్రపంచ రికార్డు సృష్టించిన డిప్లాంటిస్... ఈ ఆరేళ్లలో మొత్తం 15సార్లు ప్రపంచ రికార్డులను సవరించాడు. తనతో పోటీ పడటానికి స్వీడన్‌కు వస్తే, నన్ను ఓడించడం మరింత కష్టం అవుతుందని ఈ సందర్భంగా డుప్లాంటిస్ అన్నారు. సొంత గడ్డపై ప్రపంచ రికార్డు నెలకొల్పడం నిజంగా అద్భుతమైందని పోలోవాల్ట్‌లో ఎదురులేని అర్మాండ్ డుప్లాంటిస సంతోషం వ్యక్తం చేశాడు.



# అమ్మకాల్లో 30 లక్షలు బ్రేక్‌చేసిన సెడాన్ డిజైర్

**న్యూఢిల్లీ, మార్చి 13:** ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా తమ పాప్యులర్ సెడాన్ డిజైర్ అమ్మకాలలో రికార్డుసాధించింది. దేశీయ మార్కెట్లో ఈ కారు అమ్మకాలు 30 లక్షల యూనిట్లను దాటాయని తెలిపింది. భారత మార్కెట్లో అత్యంత ఆదరణ పొందిన కార్లలో డిజైర్ ఒకటిగా నిలుస్తోంది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో భారతదేశంలో అత్యధికంగా అమ్ముడైన కారుగా డిజైర్ నిలిచిందని, సెడాన్ విభాగంలో ఇప్పటికీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోందని మారుతి సుజుకి పేర్కొంది. 2008లో తొలిసారిగా మార్కెట్లోకి వచ్చిన ఈ కారు, ఇప్పటివరకు నాలుగు జనరేషన్ల అప్‌గ్రేడ్లతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. మారుతి సుజుకి ఇండియా మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ మాట్లాడుతూ ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకోవడంపై 30 లక్షల మంది డిజైర్ కస్టమర్లకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు.



నాలుగో తరం డిజైర్ తన అధునాతన లుక్స్‌తో సెడాన్ సెగ్మెంట్‌కు కొత్త ఊపునిచ్చింది. కొనుగోలుదారుల్లో దాదాపు 50 శాతం మంది యువత, తొలిసారి కారు కొనేవారే ఉండటం దీనికి ఉన్న ఆదరణకు నిదర్శనమని తెలిపారు. మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అనేక ఫీచర్లతో పాటు 5స్టార్ సేఫ్టీ రేటింగ్ కూడా డిజైర్ విజయానికి కారణమని బెనర్జీ తెలిపారు. భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్, గ్లోబల్ ఎన్‌క్యాప్ రెండింటిలోనూ ఈ మోడల్ 5స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించడం విశేషం. ఆటోమేటెడ్ మ్యాన్యువల్ ట్రాన్స్‌మిషన్, ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్స్ వంటి అధునాతన ఫీచర్లను అందిస్తూ ఈ కారు మార్కెట్లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ ఏడాది జనవరిలో మారుతి సుజుకి అమ్మకాల్లో 12 శాతం వృద్ధిని నమోదు చేసింది.

# వాణిజ్యం



# దిగివచ్చిన పసిడి, వెండి ధరలు!

## ఫ్యూచర్స్‌లో వెనకబడిన విలువైన ఖనిజాలు

**ముంబయి, మార్చి 13:** బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయి నుంచి శుక్రవారం స్వల్పంగా దిగివచ్చాయి. మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, అమెరికా డాలర్ బలపడటంతో పసిడిపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా బంగారం పతనం పరిమితంగానే ఉంది. శుక్రవారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఏప్రిల్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.14 శాతం క్షీణించి 10 గ్రాములకు రూ. 1,59,400 వద్ద ట్రేడ్ అయింది. అలాగే మే సిల్వర్ ఫ్యూచర్స్ 0.19 శాతం నష్టపోయి కిలోకు రూ. 2,67,448కి చేరింది. అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం, అధిక ముడిచమురు ధరల కారణంగా సురక్షిత పెట్టుబడిగా బంగారానికి డిమాండ్ బలంగానే ఉంది. ఈ అంశాలు పసిడి ధరలు భారీగా పడిపోకుండా అడ్డుకుంటున్నాయి. ప్రస్తుతం బంగారం ధరలు ప్రధానంగా అమెరికాఇరాన్ యుద్ధ వార్తలు, డాలర్ మారకం విలువ, చమురు ధరల కదలికలపై ఆధారపడి ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీ అనలిస్ట్ మానవ్ మోదీ మాట్లాడుతూ అంతర్జాతీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, బలపడుతున్న డాలర్, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, ఫెడరల్ రిజర్వ్ విధానాలపై అనిశ్చితి వంటి కారణాలతో బంగారం రాణించలేకపోతోందన్నారు. ఎన్రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ ప్రకారం బంగారం ధరలు రికార్డు స్థాయిలను తాకిన తర్వాత స్వల్పకాలిక కరెక్షన్‌లోకి ప్రవేశించాయి. దీర్ఘకాలికంగా బంగారంపై సానుకూల ధోరణి చెక్కుచెదరలేదని, ప్రస్తుత తగ్గుదల తాత్కాలికమేననిఅన్నారు. మరోవైపు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీనత కూడా పసిడిపై ప్రభావం చూపింది. మార్కెట్ల అస్థిరత కారణంగా నష్టాలను పూడ్చుకోవడానికి కొందరు ఇన్వెస్టర్లు బంగారాన్ని అమ్మి నగదుకు మార్చుకుంటున్నారు. ప్రస్తుతం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 0.47 శాతం తగ్గి 99.99 డాలర్ల వద్ద ఉండగా, బ్రెంట్ క్రూడ్ 0.67 శాతం తగ్గి 95.09 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఎంసీఎక్స్ గోల్డ్‌కు రూ. 1,56,000 రూ. 1,57,000 శ్రేణిలో మద్దతు ఉండగా, రూ. 1,75,000 రూ. 1,80,000 వద్ద నిరోధం ఎదురుకావచ్చని అంచనా వేస్తున్నారు. వెండికి రూ. 2,58,000 వద్ద మద్దతు, రూ. 2,78,000 వద్ద నిరోధక స్థాయి ఉంటుందని అంచనావేసారు. ఇక స్పాట్ మార్కెట్‌లో 24కేరట్ల తులం బంగారం రూ.1,60,690గా హైదరాబాద్‌లోనడిచింది. 22కేరట్లు రూ.1,47,300గాను 18 కేరట్ల బంగారం రూ.1,20,520గాను నడిచింది. స్పాట్ మారెనకట్‌లో కిలో వెంబడి రూ.2.90 లక్షలుగా కొనసాగింది. దేశవ్యాప్తంగా అత్యధికశాతం మార్కెట్లలో ఇవే ధరలు కొనసాగినట్లు సమాచారం.

# ప్రత్యేక వడ్డీరేట్లతో డిపాజిట్లకు బ్యాంకుల ఎర!

ఇరాన్‌పై ఇజ్రాయెల్ అమెరికాల యుద్ధప్రభావంతో ఇపుడు పెట్టుబడులు సురక్షిత మార్గాలవైపు వెళుతుండటంతో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు ప్రత్యేక కాలపరిమితి డిపాజిట్ స్కీమ్స్‌తో ఎక్కువ వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తున్నాయి. ఐడీబీఐ అందిస్తున్న ఐడీబీఐ ఉత్సవ్ స్పెషల్ ఎఫ్‌డీ త్వరలోనే ముగియనుంది. పంజాబ్ అండ్ సింధ్ బ్యాంకు 666 రోజుల మెచ్యూరిటీ టెన్యూర్‌తో ప్రత్యేక డిపాజిట్ స్కీమ్‌కు సీనియర్ సిటిజన్లకు 7.25 శాతం, జనరల్ కస్టమర్లకు 6.75 శాతం వడ్డీ ఇస్తోంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 400 రోజుల టెన్యూర్ డిపాజిట్ స్కీమ్‌పై సీనియర్లకు 7.15 శాతం, జనరల్ కస్టమర్లకు 6.65 శాతం వడ్డీ ఇస్తోంది. బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 450 రోజుల టెన్యూర్ గల స్టార్ స్వర్ణిమ్ డిపాజిట్ స్కీమ్ ద్వారా సీనియర్లకు 7.10 శాతం వడ్డీ ఇస్తున్నది. ఇండియన్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 444 రోజుల స్పెషల్ టెన్యూర్ డిపాజిట్ స్కీమ్స్ ద్వారా జనరల్ కస్టమర్లకు 6.60 శాతం వడ్డీ ఇస్తున్నాయి. ఇక సీనియర్ సిటిజన్లకు 7.10 శాతం వడ్డీ ఇస్తున్నాయి. కెనరా బ్యాంకులో 555 రోజుల స్కీమ్ ద్వారా జనరల్ కస్టమర్లకు 6.50 శాతం, సీనియర్ సిటిజన్లకు 7 శాతం వడ్డీ ఇస్తోంది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 2222 రోజులు, 3333 రోజుల డిపాజిట్ స్కీమ్ ద్వారా జనరల్ కస్టమర్లకు 6.50 శాతం, 7 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడాలో 444 రోజుల బీఓబీ స్క్వేర్ డ్రైవ్ డిపాజిట్ స్కీమ్ ద్వారా సీనియర్లకు 6.95 శాతం వడ్డీ ఇస్తోంది.




## భారత్ వృద్ధిరేటు 6.5% - గోల్డ్‌మాన్ శాక్స్ అంచనా

**న్యూఢిల్లీ, మార్చి 13:** అంతర్జాతీయ రేటింగ్స్ంస్థ గోల్డ్‌మాన్‌శాక్స్ భారత్ జిడిపి వృద్ధిరేటు ఈ ఆర్థికసంవత్సరంలో ఏడుశాతం కాకుండా 6.5శాతం మాత్రమే ఉంటుందని వెల్లడించింది. అదేవిదంగా ఫిచ్ రేటింగ్స్‌కూడా జిడిపి వ1ద్ధిస్థిరంగా ఉంటుందని 2026లో 7.5శాతంగా ఉంటుందని వెల్లడించింది. అయితే రానురాను 2027లో 6.7శాతానికి చేరవచ్చని వివరించింది. భారత్ ద్రవ్యోల్బణం 3.9శాతంనుంచి 4.2శాతానికి పెరుగుతోందని, డిసెంబరునాటికి 4.5శాతంగా ఉండవచ్చని కూడా రేటింగ్ సంస్థలు అంచనావేసాయి. ప్రత్యేకించి ఇరాన్ యుద్ధం కారణంగా ముడిచమురుధరలు ఆకాశానికి పెరిగాయి. బ్యారెల్‌ధరలు 100 డాలర్లు పైబడ్డాయి. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో ఫిచ్ దేశీయంగా డిమాండ్ ఆర్థికవ్యవస్థ వృద్ధికి ఊతం ఇస్తుందని, 2027లో వృద్ధిమాత్రం క్రమేపీ తగ్గుతూ 6.7శాతానికి చేరుతుందని 2028లో 6.5శాతంగా ఉందని చెపుతున్నారు. క్రెడిట్‌రేటింగ్ ఏజెన్సీ వడ్డీరేట్లను స్థిరంగా కొనసాగిస్తుందని కూడా వెల్లడించాయి. అక్టోబరు డిసెంబరుత్రైమాసికంలో 7.8శాతంగా ఉన్న సంగతి తెలిసిందే.

# పదవినుంచి దిగిపోతున్న అడోబ్ సిఇఒ..

**వాషింగ్టన్, మార్చి 13:** ప్రముఖ సాఫ్ట్‌వేర్ దిగ్గజం అడోబ్ సిఇఒ శంతను నారాయణ్ తన పదవి నుంచి తప్పుకుంటున్నారు. దాదాపు 18 ఏళ్ల పాటు కంపెనీని విజయవంతంగా నడిపించిన ఆయన, తన నిర్ణయాన్ని ప్రకటించారు. కొత్త సీఈవో బాధ్యతలు చేపట్టే వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆ తర్వాత కూడా బోర్డు ఛైర్మన్‌గా కంపెనీకి తన మద్దతు అందిస్తారు. కొత్తసిఇఒను ఎంపిక చేసేందుకు అడోబ్ బోర్డు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కంపెనీలో అంతర్గతంగా ఉన్నవారితో పాటు బయటి నిపుణులను కూడా ఈ పదవి కోసం పరిశీలించనున్నారు. శంతను నారాయణ్ నాయకత్వంలో అడోబ్ సాధించిన పరివర్తన అద్భుతమని, ఏఐ యుగంలో కంపెనీ విజయానికి ఆయన బలమైన పునాది వేశారని అడోబ్ లీడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఫ్రాంక్ కాల్డెరోనీ ప్రశంసించారు. శంతను నారాయణ్ ఉద్యోగులను ఉద్దేశించి ఒక సందేశం పంపారు. 18 ఏళ్ల తర్వాత సీఈవో బాధ్యతల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. నా హయాంలో కంపెనీ 3,000 మంది ఉద్యోగుల నుంచి 30,000 మందికి పెరిగింది. ఆదాయం బిలియన్ డాలర్ల నుంచి 25 బిలియన్ డాలర్లకు చేరింది. మనం కలిసి సాధించిన ఈ ఘనత పట్ల చాలా గర్వంగా ఉందని పేర్కొన్నారు. శంతను నారాయణ్ నిర్ణయంపై మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల స్పందించారు. అడోబ్‌లో మీది ఒక గొప్ప ప్రస్థానం. ప్రపంచంలోనే అత్యంత ముఖ్యమైన సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఒకటిగా అడోబ్‌ను నిలబెట్టారంటూ సోషల్ మీడియాలో అభినందనలు తెలిపారు. శంతను నారాయణ్ దాదాపు మూడు దశాబ్దాల క్రితం అడోబ్‌లో చేరారు. 2007లో సీఈవోగా బాధ్యతలు స్వీకరించి, కంపెనీ వ్యాపార నమూనాను ప్యాకేజ్డ్ సాఫ్ట్‌వేర్ నుంచి క్లౌడ్ ఆధారిత సబ్‌స్క్రిప్షన్ సేవలకు మార్చడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలోనే ఫొటోషాప్, క్రియేటివ్ క్లౌడ్ వంటి ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి.

# వారాంతంలో కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్‌నిఫ్టీల్లో మెటల్; పిఎస్‌యు బ్యాంకింగ్ ఆటోస్టాక్స్‌లో భారీ నష్టాలు

### ముడిచమురు, ఎఫ్‌పిఐల అమ్మకాలే కీలకం - రూ.10 లక్షలకోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

**ముంబయి, మార్చి 13:** విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిళ్లు, ముడిచమురుదరలు పెరగడం, మరోపక్క యుద్ధభయాలతో స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లోముగిసాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్‌లో నమోదిత కంపెనీల విలువలురూ.10 లక్షలకోట్లు తగ్గింది. ముడిచమురుదరలు రానురాను బ్యారెల్‌కు 100 డాలర్లుగా పెరిగే అవకాశాలుండటంతో మార్కెట్లపై ఇన్వెస్టర్లకు ధీమా క్షీణించింది. దీనితో మెటల్, పిఎస్‌యు బ్యాంకింగ్, ఆటో స్టాక్స్‌లో భారీ అమ్మకాలు కొనసాగాయి. సెన్సెక్స్ 1470.50 పాయింట్లు క్షీణించి 74,563.92 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 588.05 పాయింట్లు క్షీణించి 23,151.10 పాయింట్లవద్ద ముగిసింది. వరుసగా మూడు ట్రేడింగ్ సెషనప్లలో సెన్సెక్స్ 4.65శాతం, నిఫ్టీ 4.57శాతం క్షీణించాయి. ఎల్అండ్‌టి 7.38శాతం, ఎస్‌బిఐ 3.61శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.93శాతం క్షీణించాయి. మారెనకట్లలో కీలక సూచీలన్నీ కూడా ఒత్తిళ్లమధ్యనే కొనసాగాయి. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్‌సూచీ 2.61వాతం క్షీణిస్తే బిఎస్‌ఇ 250 స్మాల్‌క్యాప్‌సూచీ 2.67శాతం దిగజారింది. బిఎస్‌ఇలో మొత్తం 3348 షేర్లు పతనం చెందాయి. 941 షేర్లుమాత్రమే ఎగువకు కొనసాగాయి. 145 షేర్లు స్థిరంగా కనిపించాయి. బిఎస్‌ఇలో 150 మిడ్‌క్యాప్‌సూచీ కూడా 52వారాల గరిష్టంనుంచి 11.06శాతం స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 18.68శాతం క్షీణించింది. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి మరింత క్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 92.43గా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్ 2వ తేదీనాటి సెటిల్‌మెంట్ దరలు తగ్గాయి . రూ.1,59,400గా కొనసాగింది. కమోడిటీస్ మార్కెట్‌లోబ్రెంట్‌ముడిచమురు నాలుగు సెంట్లుపెరిగి బ్యారెల్‌కు 100.50 డాలర్లుగా కొనసాగింది. ఇక షేర్లపరంగా ఐఎఫ్‌సిఐ 5.83శాతంపెరిగింది. లారస్ ల్యాబ్స్ 4.19శాతం దిగజారింది. శైలీ ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్ 0.92శాతం పెరిగింది. ఎసిఎంఇ సోలార్ హోల్డింగ్స్ 6.43శాతం దిగజారింది. యునైటెడ్‌బ్రూవరీస్ 1.64శాతం పెరిగింది. బాలాజీ అమైన్స్ 3.01శాతం పతనం అయింది. రామ్‌కీ ఇన్‌ఫ్రా 4.85శాతంపెరిగింది. పిఎన్‌జిఎస్ రేవా డైమండ్ జ్యూయెలరీ 2.49శాతం క్షీణించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



# క్షేమంగా అమ్మ ఒడికి చేరిన అంగన్వాడి చిన్నారులు





**వి.ఆర్.పురం,మార్చి 13,ప్రభాతవార్త** మండలంలోని నూతిగూడెం అంగన్వాడి కేంద్రానికి చెందిన అయిదుగురు చిన్నారులు శుక్రవారం భద్రాచలం, కూనవరం ఏరియా ఆసుపత్రుల నుండి డిచార్జ్ అయి క్షేమంగా అమ్మవడికి చేరారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నాదు. గత నాలుగు రోజుల క్రితం సన్యాసి.నవనిత, సన్యాసి.తేజస్, తుర్రం.రాంతేజ, మొట్టుం.రోహిత్, కుంజా.వర్షిణి అనే అయిదుగురు చిన్నారులు వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బాధిత చిన్నారులను కూనవరం ఏరియా ఆసుపత్రి సూపర్ ఇండింటెంట్ డాక్టర్ మహేష్ బాబు ఆధ్వర్యంలో వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వైద్యసేవలు అందించారు. చిన్నారుల తల్లిదండ్రులతో పాటు తహసీల్దార్ సరస్వతి, ఐసిడిఎస్ సిడిపిఒ మల్లిక, ఎంపిడిఒ ఎమ్మానుయేల్, ఎస్ఐ సంతోష్ కుమార్ తదితర అధికారులు నిరంతరం చిన్నారుల యోగ క్షేమాలు తెలుసుకుంటు పరిస్థితిని సమీక్షించారు.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | శనివారం 14 మార్చి 2026 | I


## నేడు జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చెయ్యాలి



అడ్డతీగల, మార్చి 13, ప్రభాతవార్త రంపచోడవరం నియోజకవర్గం అడ్డతీగల మండలంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అడ్డతీగల బస్టాండ్ సెంటర్‌లోని జనసేన పార్టీ స్థూపం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యుడు తాటికొండ రాజేంద్ర ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరింత చేరువులో సేవలు

### కొత్తపేట అంబాజీపేట మమ్మిడివరం మండపేట బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లు ప్రారంభం



**కొత్తపేట, మార్చి 13,(ప్రభాతవార్త)** శుక్రవారం ఉదయం స్థానిక కొత్తపేట బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజి లో గల ఓ సి ఎస్ సి కస్టమర్ సర్వీస్ సెంటర్స్ బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఐ టి ఎస్ పలివెల రాజు ప్రారంభించారు ఈ సందర్భంగా పి జి ఎం మాట్లాడుతూ కొత్తపేట అంబాజీపేట ముమ్మిడివరం మండపేట పరిసర ప్రాంత ప్రజల కోరిక మేరకు కస్టమర్ సర్వీస్ సెంటర్లు ఫ్రాంచైజి విశాలి ఎంటర్ప్రైజెస్ శిరిగినీడి ఆదినారాయణ కు కేటాయించినట్లు తెలిపారు బిఎస్ఎన్ఎల్ భాగస్వామ్యంతో మరిన్ని ఓసి ఎస్సీలను త్వరలో ప్రారంభిస్తామన్నారు ఆ మేరకు వినియోగదారులకు మరింత చేరువ అవుతామని తెలిపారు 4జి సేవలు ఫైబర్ నెట్ సేవలు అన్ని గ్రామాలకు విస్తరింప చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో డీ జీ ఎం లు సి హెచ్ విజయభాస్కర్ రెడ్డి శైలజ ఐ ఎఫ్ ఓ నాగరాజు ఏ జీ ఎం లు బమిడి పాటి శ్రీనివాసు శారద డీఈ లు ఆర్ ఫణీంద్ర పి నరసింహారావు ఎస్డిఈ లు నాగార్జున కృష్ణారావు వి శ్రీనివాసు పిఆర్వో వాసు తదితరులు పాల్గొన్నారు

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.. ఎమ్మెల్యే గిడ్డి..

### అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ మూడవ విడత సహాయం పంపిణీ..



**అంబాజీపేట,మార్చి 13, (ప్రభాతవార్త):** రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పంట సాయంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.అంబాజీపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో నియోజవర్గంలో నాలుగు మండలాల రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి, అటవీభూమి సాగుదారు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, పిఎం కిసాన్ లో కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు వెరసి ఏడాదికి రూ.20వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నారన్నారు..పి.గన్నవరం నియోజవర్గంలో నాలుగు మండలాల్లోని 23,796 రైతు కుటుంబాలకు రూ.13.82 కోట్లు డెమో చెక్కును పంపిణీ చేశారు.అన్నదాత సుఖీభవ- పిఎం కిసాన్ పథకంలో భాగంగా నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో మూడు విడతల్లో 23,796 మంది రైతుల ఖాతాల్లో రూ.46.35 కోట్లు జమ చేశామని తెలిపారు. వ్యవసాయంలో యాంత్రికరణ పద్ధతులను ప్రోత్సహించేందుకు డ్రోన్లు, వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు సబ్సిడీలపై రైతులకు అందిస్తున్నారన్నారు. పంట నష్టపోయి, పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఆర్థికంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆర్థిక సాయం చేసిన విషయాన్ని మర్చిపోకూడదన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను,జీవామృతం కషాయాలను ఎమ్మెల్యే పరిశీలించారు.అనంతరం సొంత నగదుతో మహిళల నుండి కూరగాయలను కొనుగోలు చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి కె.నాగమణి, నియోజకవర్గ వ్యవసాయ విస్తరణ అధికారి సిహెచ్.డి.విజయ్ కుమార్, ఏఎంసీ చైర్మన్లు చిట్టూరి శ్రీనివాస్, పెనుమాల లక్ష్మి, కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు సిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, మట్టపర్తి బాల భారతి, సయ్యపురాజు సత్తిబాబురాజు, అంబటి భూలక్ష్మి, సూదా బాబ్జి,నియోజవర్గ టిడిపి కో-కన్వీనర్లు మోకా ఆనంద సాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ పత్తి దత్తుడు,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచులు నాగాబత్తుల శాంతకుమారి,పత్తిపాటి ఉమామహేశ్వరి,సొసైటీ చైర్మన్లు అరిగెల సూరిబాబు, కుడుపూడి రాంబాబు, నాయకులు మైపాల తాతాజీ, మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాస రాజా,కొర్లపాటి గోపి, దొమ్మేటి సాయికృష్ణ,వస్కా శ్యామ్, గూడాల ఫణి, రవణం రాము, నాగాబత్తుల సుబ్బారావు, కొప్పినీడి ఈశ్వరరావు, వంగా చిన్న తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సంక్షేమమే కూటమి లక్ష్యం : ఎమ్మెల్యే వనమాడి



**కాకినాడ మార్చి 13 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి.** అన్నదాత సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ మూడో విడత, పీఎం కిసాన్ పథకం క్రింద అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. మూడో విడత అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా కాకినాడ అర్బన్ మండల రెవెన్యూ కార్యాలయము నందు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులు జమ చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా అన్నదాత సుఖీభవ కింద ప్రస్తుత మూడో విడతలో రైతు కుటుం బాలకు రూ.4 వేలు చొప్పున, అదే విధంగా 22 విడత పిఎం కిసాన్ కింద రూ 2 వేలు చొప్పున రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించడం జరుగుతుందని, అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక సహాయం రైతుల ఆర్థిక స్థిరత్వానికి, వ్యవసాయ రంగ బలోపేతానికి దోహదం చేస్తుందని, రైతులు పంటలు వేసే నాటికి అవసరమైన పెట్టుబడి సాయం అందించడం ద్వారా అన్నదాతల క్షేమం సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కొండబాబు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎం ఆర్ ఓ జితేంద్ర, మల్లిపూడి వీరు, మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్, గదుల సాయిబాబా, నల్లూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ నిధులు: ఎమ్మెల్యే ఆనందరావు



**అల్లవరం,మార్చి13(ప్రభాతవార్త),** అన్నధాన సుఖీభవ,పీఎం కిసాన్ పథకాల ద్వారా అన్నదాత సుఖీభవ పథకంలో4,675 మంది రైతులకు రూ.1 కోటి 87 లక్షలు,పీఎం కిసాన్ పథకంలో 4,976 మంది రైతులకు రూ.87 లక్షలు రైతుల ఖాతాలకు నిధులు విడుదలైయ్యాయని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు.వ్యవసాయాధికారి కె.విజయ్ ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ నిధులు చెక్కుని ఎమ్మెల్యే ప్రారంభించారు.ప్రతి రైతుకు కుటమిప్రభుత్వం అండగా ఉంటుందని ఆనందరావు అన్నారు.ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు,క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్,మండల టీడీపీ నాయకులు దెందుకూరి సత్తిబాబురాజు,ఎఎంసి చైర్మన్ అధికారి జయ వెంకటలక్ష్మి,టీడీపీ రాష్ట్ర నాయకులు మెట్ల రమణబాబు,రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు,డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి,ఆత్మ చైర్మన్ సుధారాణి,దాట్ల గోపిరాజు,దేశంశెట్టి లక్ష్మీనారాయణ, పచ్చిమాల ఏడుకొండలు,ముత్యాల బాబి,కంకిపాటి వీరబాబు,కంకిపాటి గోపి,బండిగుప్తాపు సత్తిబాబు,పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు ఘన స్వాగతం.



**కడియం, మార్చి 13 (ప్రభాతవార్త)** రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ జవహర్ శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కడియం మండలంలో పర్యటించారు. మాధవరాయుడుపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని చైతన్య నగర్ లో ఓ శుభకార్యానికి విచ్చేసిన ఆయన మండల పరిషత్ కార్యాలయం లో మండల పరిషత్ అధ్యక్షులు వెలుగు ప్రసాద్ ,గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి,మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని లతో కాసేపు ముచ్చటించారు.ఆయనకు మండల నాయకులు , తాసిల్దార్ సునీల్ కుమార్ , సీఐ వెంకటేశ్వరరావు లు ఘన స్వాగతం పలికారు. ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి తమ కమిషన్ నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా జవహర్ పేర్కొన్నారు

# నదీ కోతకు గురౌతున్న లంకభూములు

## నివారణకు పటిష్ట చర్యలు...ఎమ్మెల్యే, బండారు.



**ఆత్రేయపురం, మార్చి, 13,(ప్రభాత వార్త )** గోదావరి నదీ కోతకు గుఔతున్న మండలంలోని రాజవరం గ్రామంలో లంక భూములను శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రైతులతో కలసివెల్లి పరిశీలించారు.అక్కడ రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఏటా గోదావరి వరదల వల్ల లంక భూములు నదీ కోతకు గురికావడంతో లంక భూములు నదీ గర్భంలో కలసిపోతున్నాయని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నదీ కోతను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. గ్రోయిన్ల నిర్మాణానికి రూ.38.50 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారని తెలిపారు.ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదనలు ఆమోదం పొందగానే గ్రోయన్ల నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ జాన మంగయమ్మ వీరాంజనేయులు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, కోమలి నాగ సూర్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు జుజ్జువరపు హరిబాబు, నరాలశెట్టి వెంకన్న, చిటికెన సత్యనారాయణ, పెండెం వెంకన్న, కె బ్రహ్మానందం, కుటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవం



**రామచంద్రపురం,మార్చి13 (ప్రభాతవార్త):** పట్టణ ముచ్చిమిల్లిలో ఉన్న ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం ఆర్.జె.డి జి.నాగమణి హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులకు జరిగిన కాన్వోకేషన్ కార్యక్రమం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు హైలెట్ గా నిలిచి అందరిని అలరించాయి..ఈ సందర్భంగా ముఖ్య అతిథి నాగమణి మాట్లాడుతూ..ఒకవైపు విలువలతో కూడిన విద్యను అందజేస్తూ,మరో వైపు ప్రతి సంవత్సరం కూడా సంస్కృతి,సాంప్రదాయాలను ప్రతిబింబింపజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న అకాడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి కృషి అభినందనీయమన్నారు.అనంతరం అకాడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి మాట్లాడుతూ..తమ విద్యాసంస్థలో పసిమనసులను ఆకట్టుకునేలా విద్యా బోధన చేయటానికి ప్రత్యేక వార్షిక ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు.విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఫీల్డ్ ట్రిప్స్,వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో,చక్కటి బోధన చేస్తున్న విద్యాసంస్థగా ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్ గుర్తింపు పొందడం సంతోషదాయకమని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు వర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరావు,డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెచ్.ఎం.ముత్యాలచిట్టిబాబు,మోడరన్ ప్రైమరీ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు...

## చింతూరు కేజీబీవిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం




**చింతూరు మార్చి 13 ప్రభాత వార్త.** చింతూరు మండల కేంద్రం లోని కేజీబీవి పాఠశాల మరియు కళాశాలలో 6 వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం అయింది అని పాఠశాల ప్రిన్సిపాల్ డి. రమాదేవి శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి లో 40సీట్లకు అలాగే ఇంటర్ మొదటి సంవత్సరానికి గాను 40 సీట్లకు విద్యార్దుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఆన్లైన్ మరియు ఆఫ్ లైన్ లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ దరఖాస్తులను మార్చి 12 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు స్వీకరిస్తామని అన్నారు. కావున ఆసక్తి గల విద్యార్థిని లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## ప్రజా క్షేమమే ప్రభుత్వ ధ్యేయం, ఎం ఎల్ ఎ,సత్యప్రభ



**రౌతు ల పూడి, మార్చ్ 13. (ప్రభా త వార్త)** ప్రజా సంక్షేమ మే ప్రభుత్వ ధ్యేయం అని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ తెలిపారు. గత కాలంలో ఇల్లు లు కాలిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్న సార్లంక గ్రామస్థుల కొరకు ప్రభుత్వం నియమించిన రేకు షెడ్డు గృహాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. సార్లంక లో అగ్ని బాధితులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుందని అమెవివరించారు.తదనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన అన్నదాత సుఖీ భవ కార్యక్రమంలో పాల్గొని ,రైతులను అన్నివిధాల ఆదుకునే ప్రభుత్వం తెలుగు దేశం అని ప్రసంగించారు. ఈ కార్య క్రమంలో మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు తమరా ల సత్యనారాయణ, పైలా సాంబశివ రావు. మండల రెవెన్యూ అధికారి నరేష్, వ్యవ సాయ అధికారి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'పెద్ద ప్రెసిడెంట్' పాపోప్పు వెంకటరత్నంకి అక్షర నివాళి.



**రాజమహేంద్రవరం,మార్చి13, ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి.** ఒక నాయకుడు అంటే కేవలం అధికారం చలాయించేవాడు కాదు, ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటూ ఊరి భవిష్యత్తును తీర్చిదిద్దేవాడు అని నిరూపించిన మహోన్నతుడు పాపోప్పు వెంకటరత్నం. 1912లో అన్నవరప్పాదులో జన్మించిన ఆయన, సుమారు మూడు దశాబ్దాల కాలం పాటు సర్పంచ్‌గా ఆ గ్రామానికి దిశానిర్దేశం చేశారు.

**ఆయన సాధించిన మైలురాళ్లు**

గ్రామ స్వయంప్రతిపత్తి మల్లేశ్వరంలో కలిసి ఉన్న అన్నవరప్పాదును ప్రత్యేక పంచాయతీగా మార్చడానికి ఆయన చేసిన పోరాటం మరువలేనిది.?ఆర్థిక వనరుల కల్పన పంచాయతీకి శాశ్వత ఆదాయం ఉండాలనే దూరదృష్టి తో కట్లమ్మ చెరువును తవ్వించి, గ్రామానికి ఒకఆస్తిని అందించారు. మల్లేశ్వరం లంకలో పశువుల గడ్డి కోసం రైతులకు హక్కులు కల్పించడం నుంచి, నేటి ఎన్ హెచ్-16 విస్తరణలో రైతుల పొలాలు దెబ్బతినకుండా అధికారులతో పోరాడి విజయం సాధించడం వరకు ఆయనది అంతా రైతు హితమే. కుటుంబ సమస్యలైనా, గ్రామ వివాదాలైనా 'వెంకటరత్నం చెబితే పరిష్కారం దొరుకుతుంది' అనే నమ్మకం చుట్టుపక్కల గ్రామాల్లో ఉండేది.అందుకే ఆయనను అందరూ గౌరవంగా 'పెద్ద ప్రెసిడెంట్' అని పిలుచు కునేవారు.?గ్రామ అభివృద్ధి కోసం తన సొంత ఆస్తిని కూడా వెచ్చించిన నిస్వార్థపరుడు ఆయన. చిన్న ఉద్యోగి నుంచి ఎమ్మెల్యే వరకు ఎవరొచ్చినా ఆయన ఇంటి వద్ద విందు భోజనం చేయడం ఒక సంప్రదాయంగా ఉండేదంటే, ఆయన ఆతిథ్యం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. పెనుగొండ జవాది వారితో అన్నవరప్పాదుకు ఉన్న సత్సంబంధాల వెనుక కూడా ఆయన కృషి ఎంతో ఉంది.

?ప్రజాసేవకు అంకితమైన వెంకటరత్నం జన్మదినం నాడే, నేడు రాష్ట్ర రాజకీయాల్లో మార్పు కోసం పుట్టిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం రావడం ఒక యాదృచ్ఛికం. ప్రజాక్షేమమే పరమావధిగా బతికిన ఆయన ఆశయాలు నేటి తరానికి ఆదర్శం.

# అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్, మార్చి 13 (ప్రభాతవార్త)** అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ మూడో విడత, 22 వ పీఎం కిసాన్ పథకం క్రింద అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చడం జరుగుతుందని. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు.2025-26 ఆర్థిక సంవత్సరంలో మూడో విడత అన్నదాత సుఖీభవ 22 వ విడత పిఎం కిసాన్ నిధులు జిల్లా వ్యాప్తంగా 1, 34,829 అన్నదాతల కుటుంబాలకు రూ77.01 కోట్లు జమ కాబడి లబ్ధి చేకూరిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అన్నదాతలు ఈ యొక్క నిధులను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలన్నారు అన్నదాత సుఖీభవ కింద ప్రస్తుత మూడో విడత లో1,34,829 రైతు కుటుంబాలకు రూ.4 వేలు చొప్పున రూ 53.93 కోట్లు మేర లబ్ధి చేకూరిందని అదేవిధంగా 22 విడత పిఎం కిసాన్ కింద రూ 2వేలు చొప్పున జిల్లావ్యాప్తంగా1,15,400 రైతు కుటుంబాలకు రూ 23.08 కోట్లు జమ కాబడ్డాయని తెలిపారు. జిల్లా లోని ఏడు నియోజక వర్గాల వారిగా జమ కాబడ్డాయని వెల్లడించారు.వ్యవసాయ యోగ్యమైన సొంత భూమి కలిగి ఉన్న రైతు కుటుంబాలకు భూవిస్తీర్ణంతో సంబంధం లేకుండా మరియు అటవీ హక్కుల గుర్తింపు భూములు సాగు చేస్తున్న రైతు కుటుంబానికి పెట్టుబడి సాయంగా సంవత్సరానికి మూడు విడతలుగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.6000తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి రూ. 14,000 చొప్పున మొత్తంగా అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద ఏడాదికి మొత్తం రూ.20,000 చొప్పున ఆర్థిక మద్దతు కల్పిస్తున్నట్లు వివరించారు.

## కిడ్నీతో గిరిజనుడు మృతి.. గత నెలలో ఒకరు మృతి.

### ఇంకా 9 మందికి వైద్య సేవలు



**రాజవొమ్మంగి, మార్చి 13, ప్రభాత వార్త** రాజవొమ్మంగి మండలం ఊర్లకులపాడు గ్రామంలో ఇద్దరు కిడ్నీ సమస్యతో నెలరోజులు వ్యవదిలో మరణించగా, మరో తొమ్మిది మంది వైద్య సేవలను పొందుతున్నారు. గ్రామంలో 701 జనాభా ఉన్నారు. మారేడుబాక పంచాయతీ ఉర్లకులపాడు గ్రామానికి చెందిన కొసూరి తమ్మారావు (49)సం. అనే గిరిజనుడు కిడ్నీ వ్యాధితో 19 రోజులుగా కాకినాడ జిజిహెచ్ లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఇదే రోజు తమ్మారావు మృతదేహాన్ని మధ్యాహ్నం 12 గంటలకు స్వగ్రామమైన ఉర్లాకులపాడు గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతి చెందిన తమ్మారావుకు భార్య భద్ర, కుమార్తెలు సింధు అనుషరెడ్డి (15) జ్యోతిక రెడ్డి (13) లు ఉన్నారు. ఇదే ఉర్లకులపాడు గ్రామంలో గత నెలలో కోసూరి బుల్లమ్మ అనే గిరిజన మహిళ కూడా కిడ్నీ వ్యాధితో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కామరాజు షుగర్ వ్యాధితో మృతి చెందారని వైద్యులు అంటున్నారు.. 22 రోజులు నుండి జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఆ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారు. 424 మందికి పరీక్షలు చేసి 171 మంది నుండి రక్తం నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 16 మందికి అనుమానితులుగా గుర్తించడం జరిగిందని వైద్యులు తెలిపారు. దీంట్లో ఏడుగురికి కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నట్లు కాకినాడలో వై ద్యులు గుర్తించారు. ఏడుగురులో మరో ఇద్దరు మాత్రం వైద్యం చేసేందుకు సహకరించలేదని వైద్యులు తెలిపారు. ఐదుగురు వైద్య సేవలను పొంది 12 తేదీన ఊర్లకులపాడు ఇంటికి చేరుకొన్నారు. ఇదే గ్రామానికి చెందిన కుర్రే సీత అనే మహిళ కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో వైద్యసేవలను పొందుతున్నారు

## అన్నదాత సుఖీభవతో రైతులకు ఆర్థిక చేయూత

### రాష్ట్ర ప్రభుత్వ విప్ యనమల దివ్య



**తుని, మార్చి 13,( ప్రభాతవార్త )** అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఆర్థిక చేయూతని అందిస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వవిప్,తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తుని పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే యనమల దివ్య ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుని,తొండంగి,కోటనందూరు మండలాల పరిధిలో,తుని నియోజకవర్గ వ్యాప్తంగా మూడవ విడత27వేల 759 మంది రైతులు ఖాతాలో 54కోట్ల34 లక్షల40 వేల రూపాయలు జమైందన్నారు. తుని మండలంలో 11వేల 427 మంది రైతులకు22 కోట్ల 29 లక్షల40 వేల రూపాయలు లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, టిడిపి సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, ఎంపీపీ బొప్పన రాము, ఆత్మ చైర్మన్ నరహరిశెట్టి సూర్యప్రకాష్,ఎంపీడీవో జి. మరిడియ్య, వ్యవసాయ శాఖ ఏడిఏ కె. జె. చంద్రశేఖర్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్.ఒ.సి.నెం.413/15/ఎ1

**వేలం నోటీసు**

నగరపాలక సంస్థ, కాకినాడ
తేది. 13-03-2026

నగర సంస్థ పరిధిలో గల 5 మునిసిపల్ మార్కెట్లు మరియు రోడ్డు మార్జిన్లలో (గాంధీనగర్ మార్కెట్ నందు రైతుబజారు ఏర్పాటు చేసిన భాగము మినహా) 2026-27 సంవత్సరమునకు ఫీజులు (ఆసీలు) వసూలు చేసుకొనే హక్కునకు, మేకలు మరియు గొర్రెల కబేళ ఫీజులు వసూళ్ళు చేసుకొనే హక్కునకు,అరట్లకట్ట సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నాలుగు గట్లపై పచ్చగడ్డి మరియు సామర్లకోట సాంమూర్తి రిజర్వాయర్ నందు పచ్చగడ్డి,చెట్లు ఫలసాయము అనుభవించు హక్కునకు ది.23-03-2026 మ.3.00 గం|| లకు నగరపాలక సంస్థ కార్యాలయములో కమీషనరు గారు కాని వారిచే అనుమతి పొందిన మరియే ఇతర అధికారివారిచే గాని బహిరంగవేలం నిర్వహించబడును.

వేలం ది.06-03-2018వ తేది గల గెజిట్ నోటిఫికేషన్ నెం. 30/2018లోని షరతుల ప్రకారము జరుపబడును. సదరు వేలములో పాల్గొనదలచిన వారు నోటిఫికేషన్ నందలి అన్ని వివరములు నగరపాలక సంస్థ కార్యాలయము పనిచేయు దినములలో రెవెన్యూ విభాగము నందు ఎ1 గుమస్తా వారి నుండి తెలుసుకొనవచ్చును.

| వ.నెం | పాట వివరములు | ప్రథమ ధరావత్తు | ఒక సం॥ము కాలమునకు బ్యాంకు గ్యారంటీ |
|---|---|---|---|
| 1. | మునిసిపల్ మార్కెట్లు (గాంధీనగర్ మార్కెట్ నందు రైతు బజారు ఏర్పాటు చేసిన భాగము మినహా మిగిలిన ప్రాంతము) మరియు అన్ని రోడ్డు మార్జిన్లలో ఫీజులు వసూలు చేసుకొను హక్కు | రూ.1,50,000/- | రూ. 6,00,000/- |
| 2. | కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో గల మేకలు మరియు గొర్రెల కబేళ ఫీజులు వసూళ్ళు చేసుకొనే హక్కునకు | రూ.30,000/- | రూ.75,000/- |
| 3. | కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో గల 5 ప్రదేశాలలో చెట్ల ఫలసాయము అనుభవించు హక్కునకు | రూ.1,500/- | - |
| 4. | అరట్లకట్ల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నాలుగు గట్లపై పచ్చగడ్డి ఫలసాయము అనుభవమించు హక్కునకు | రూ.50,000/- | - |
| 5. | సామర్లకోట సాంబమూర్తి రిజర్వాయర్ నందు పచ్చగడ్డి మరియు చెట్లు ఫలసాయము అనుభవమించు హక్కునకు | రూ.10,000/- | - |

1. పాటదారులు ప్రథమ ధరావత్తు మరియు బ్యాంకు గ్యారంటీని మరియు రూ.1,00,00,000/-లు కోటి రూపాయలు విలువ గల ఆస్తి ఒరిజినల్ డాక్యుమెంట్లు మార్చి 2026 నెలలో తీసుకున్న ఇ.సి.తో సహా డిపాజిట్ చేయవలెను.
2. మేకల కబేళా పాటదారులు ప్రథమ ధరావత్తు, డిపాజిట్ మరియు రూ.5,00,000/-లు విలువ గల ఆస్తి ఒరిజినల్ డాక్యుమెంట్లు మార్చి 2026 నెలలో తీసుకున్న ఇ.సి.తో సహా డిపాజిట్ చేయవలెను.
3. మార్కెట్ ఆశీలు పాట ఖాయపర్చబడిన తదుపరి పాటదారుడు 3 నెలల కిస్తీ డిపాజిట్టుతో పాటుగా జి.ఎస్.టి. మరియు రిజిస్ట్రేషన్ చార్జీలను నగరపాలక సంస్థ ట్రెజరీ నందు చెల్లించిన తదుపరి మిగిలిన 9 నెలలకు నెలసరి కిస్తీ మొత్తమునకు గాను 9 పోస్ట్ డేటెడ్ చెక్కులు కూడా నగరపాలక సంస్థ వారికి సమర్పించిన తదుపరి మాత్రమే ఫీజులు వసూలు చేసుకొనుటకు అనుమతించబడును.
4. నగరపరిధిలో గల చెట్ల ఫలసాయము వేలము హక్కు పొందిన వారు చెల్లించిన ప్రథము ధరావత్తు సొమ్ము పోను మిగిలిన పాట సొమ్ము మొత్తమును చెల్లించిన తరువాత మాత్రమే ఉత్తర్వులు జారీచేయబడును.
5. పాట మొత్తముపై అమలు నందు ఉన్న రేటుపై జి.ఎస్.టి. తప్పనిసరిగా చెల్లించవలయును.

కమీషనరు
నగరపాలక సంస్థ, కాకినాడ.

## పదవ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ప్యాడ్లు,పెన్నులు అందజేత



**వి.ఆర్.పురం,మార్చి13,ప్రభాతవార్త** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల పదవ తరగతి 100 మంది విద్యార్థిని, విద్యార్థులకు, వి.ఆర్.పురం బిసి కాలనికి చెందిన పూర్వ విద్యార్థులు, ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు శుక్రవారం ఎంఇఒ వివి.లక్ష్మినారాయణ చేతుల మీదుగా పరీక్షా ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. 16 వ తేదీ సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు జరుగనున్న విషయం తెలిసిందే. విద్యార్థులు కష్టపడి చదువుకొని 10 పరీక్షల్లో తమ నైపుణ్యం ప్రదర్శించి, మంచి మార్కులు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు బింగి.విష్ణు, కృపారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 15న ఎఫ్ఎల్ఎన్ఏటీ పరీక్ష



**అడ్డతీగల, మార్చి 13:** అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా అడ్డతీగల మండలంలో పునాది అక్షరాస్యత, సంఖ్యాశాస్త్ర మూల్యాంకన పరీక్ష (ఎఫ్ఎల్ఎన్ఏటీ)ను ఈ నెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ.వి.వి కుమార్ తెలిపారు. మండలంలో మొత్తం 7,084 మంది అభ్యాసకులు పరీక్షకు హాజరుకానుండగా, 173 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుధ్యం, త్రాగునీటి సదుపాయాలు కల్పించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ఎంఈఓ కె.రమేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ బి.చిరంజీవి, వెలుగు ఏపీఓ బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థుల నుంచి విద్యాసామగ్రి



**అడ్డతీగల, మార్చి 13:** అడ్డతీగలలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు)లో చదివిన 1993–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మల్లు వలస అప్పలస్వామి, బత్తుల మధుబాబు, ఆనందల ప్రసాద్ పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. పరీక్షల సమయంలో క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, స్కేల్‌లు, పెన్సిళ్లు వంటి విద్యాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. ప్రభాకరరావు, ముత్తయ్య పెద్దకాపు, అడ్డాల బాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బివిసి భట్లపాలెం లోఉచిత పాలిటెక్నిక్ కోచింగ్



**అమలాపురం,మార్చి13, ప్రభాతవార్త** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి.ఏప్రిల్ 1వ తేది నుండి బివిసి భట్లపాలెం క్యాంపస్ నందు పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ ఏర్పాటు చేశారు.ఈ సదుపాయంని పదవ తరగతి విద్యార్థులు ఉపయోగించుకోవాలి అని కళాశాల యాజమాన్యం తెలియజేసారు. చక్కటి ఉపాధి అవకాశములు ఉన్న సాంకేతిక విద్య ను ఫీజు రియింబర్స్?స్మెంట్ సౌకర్యంతో చదువుకునే అవకాశంను ఉపయోగించు కోవాలి అని తెలియ జేసారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల తో కోచింగ్ ఇప్పించడం జరుగుతుందని ఇది పూర్తిగా ఉచితం అని తెలియజేసారు. సీట్లు పరిమితం కావున కళాశాలకు నేరుగా విచ్చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అని గతం లో ఈకళాశాలలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు మంచి ర్యాంకులు మరియు ఉచిత సీట్లు సాధించారని కావున ఈ సదవకాశం ఉపయోగించుకోవాలి అన్నారు.

## దివ్యాంగునికి వీల్ చైర్ అందజేత



**రామచంద్రపురం,మార్చి13 (ప్రభాతవార్త):**తెదేపా పార్టీ కార్యాలయంలో కె గంగవరం మండలం తాళ్లపూడి గ్రామానికి చెందిన దివ్యాంగ బాలుడు మోర్త సాయికు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ సత్యం మూడు చక్రాల వీల్‌చైర్‌ను అందజేశారు.సత్యంను కలిసిన బాలుడి తల్లి మోర్త రాజేశ్వరి తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిని వివరించి సహాయం కోరారు.ఆమె వినతిని సానుభూతితో విన్న వాసంశెట్టి సత్యం వెంటనే స్పందించి, బాలుడి సౌకర్యార్థం మూడు చక్రాల వీల్‌చైర్‌ను అందజేసి ఆర్థిక సహాయం అందించారు.ఈ సందర్భంగా దివ్యాంగులు సమాజంలో ధైర్యంగా ముందుకు సాగేందుకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని చైర్మన్ సత్యం తెలిపారు.బాలుడు పరిస్థితి మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువెళ్లి,దివ్యాంగుల పింఛన్ మంజూరు అయ్యేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కంచుమర్తి బాబురావు,కవల నానాజీ,కాటే సుబ్రమణ్యం,ఏసుదాసు,రమణ తదితరులు పాల్గొన్నారు..

## భక్తి శ్రద్ధలతో షబే ఖదర్



**మామిడికుదురు.మార్చి 13(ప్రభాతవార్త)**

ముస్లిం మతస్తుల పవిత్ర గ్రంధం ఖురాన్ అవతరించిన రోజు(షబే ఖదర్)ను శుక్రవారం ముస్లిలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.దీనిలో భాగంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు జాగరణ పాటించారు. ఖురాన్ ప్రతులను శిరస్సు పై పెట్టుకుని ప్రత్యేక ప్రార్ధనలు(నమాజులు)చేశారు.ఈ సందర్భంగా మామిడికుదురు నగ్రమ్ మినల్లా షియ్యా మసీదు లో మత గురువు షబ్బర్ అలీ జైదీ,నగరం పంజేషాలో మహెదీ హసన్ బెహిష్టి, మొగలికుదురు మసీదులో మౌలానా మొహమ్మద్ ఇబ్రాహీం లు ఖురాన్ అవతరించిన విధాన్ని,విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని అనేక మంది పేదలకు దాన ధర్మాలు చేసుకున్నారు. అన్ని మసీదుల వద్ద భక్తులకు తెల్లవారుజామున సహేరీ(భోజనాలు)ఏర్పాటు చేశారు.అన్ని మసీదులు భక్తులతో కిటకిట లాడడంతో మసీదుల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## కూటమి పాలనలో వ్యవసాయాన్ని పండగలా మార్చాం ...

### -అన్నదాత సుఖీభవ మూడో విడత పంపిణీలో ఎమ్మెల్యే బండారు...



**ఆత్రేయపురం, మార్చి, 13,(ప్రభాత వార్త )** కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా మార్చమని అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురంలో శుక్రవారం జరిగిన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మూడవ విడత పంపిణీ కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిధుల విడుదల సందర్భంగా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాలను తిలకించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని పేర్కొన్నారు. గోదారమ్మ దయవల్ల మన ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మూడవ విడతలో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలో నేడు 23,085 మంది అన్నదాతల ఖాతాల్లో రూ.12.94 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు.కొత్తపేట మండలంలో 6516మంది అన్నదాతలకు రూ.3.57కోట్లు, ఆత్రేయపురం మండలంలో 5,258 మందికి రూ.3.03కోట్లు, రావులపాలెం మండలంలోని 5,018మంది అన్నదాతలకు రూ.2.72 కోట్లు,ఆలమూరు మండలంలో 6293 మంది అన్నదాతలకు రూ.3.62 కోట్లు జమవుతుందన్నారు. పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ మొదటి విడతలో భాగంగా నియోజకవర్గంలో రూ.16.11 కోట్లు, రెండవ విడతలో భాగంగా రూ.15.26 కోట్లు రైతులు ఖాతాల్లో జమ అయ్యాయని పేర్కొన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయం మీద, డిమాండ్ ఆధారిత పంటల సాగు మీద దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో రైతులు పడ్డ కష్టాలు అన్ని ఇన్ని కావన్నారు. రైతు భరోసా పేరుతో ఏడాదికి ఒకే దఫాలో రూ.12,500 ఇస్తామని హామీ ఇచ్చి 3 దఫాల్లో కలిపి రూ.7,500 మాత్రమే ఇచ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో పీఎం కిసాన్ కింద ఏడాదికి రూ.6వేలు అందిస్తుంటే.. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం రూ.14వేలు కలిపి మొత్తం ఏడాదికి రూ.20,000 ఇచ్చి తమది రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46,85,838 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా దన్నుగా ఉంటుందన్నారు.రాయితీలపై వ్యవసాయ పరికరాలు ఇచ్చి సాగు రంగంలో సాంకేతికత జోడిస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతు కల్లంలో ధాన్యం అమ్మగానే 24 గంటల్లో నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో ఈ డబ్బులు రావడానికి సుమారు ఆరు నెలలు పట్టేదని గుర్తు చేశారు. 2026–27 రాష్ట్ర బడ్జెట్ లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 53,752.12 కోట్లు కేటాయించి ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాపాక రామచంద్రమూర్తి, ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకట రామన్, మండల వ్యవసాయ అధికారి పట్టాభి రామయ్య, వ్యవసాయ సహాయకులు, ఆకుల రామకృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, పిఎస్ రాజు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు జుజ్జువరపు హరిబాబు, నరాలశెట్టి వెంకన్న, కుదప కృష్ణమూర్తి, కుటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగల మండలానికి కోశాధికారిగా ఎంఈఓ పి. శ్రీనివాసరావు



**అడ్డతీగల, మార్చి 13, ప్రభాతవార్త పోలవరం జిల్లా** స్థాయిలో మండల విద్యాశాఖ అధికారులు--2 సంఘానికి నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకునే ప్రక్రియ ఇటీవల నిర్వహించబడింది. ఈ ఎన్నికల్లో వివిధ మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. విద్యా వ్యవస్థ అభివృద్ధి, పాఠశాలల నిర్వహణలో సమన్వయం పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా ఈ ఎన్నికలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయి.ఈ సందర్భంగా అడ్డతీగల మండలానికి చెందిన మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు గారు జిల్లా కార్యవర్గంలో కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఆయన నియామకాన్ని సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. విద్యా రంగంలో అనుభవం కలిగిన శ్రీనివాసరావు గారు బాధ్యతలను సమర్థంగా నిర్వహించి సంఘ అభివృద్ధికి తోడ్పడతారని సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## జగన్మోహిని ఆలయంలో పంచులోహాల విగ్రహాలకు పూజలు...

**ఆత్రేయపురం,మార్చి, 13,(ప్రభాత వార్త )** ప్రసిద్ధి పుణ్యక్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి,గోపాల స్వామి వారి ఆలయంలో శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి పంచంలోహ విగ్రహాలకు త్రయాహ్నిక దీక్షతో ప్రతిష్ఠ మహోత్సవం తల్లాప్రగడ విశ్వేశ్వరరావు, సునీత దంపతులచే నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాఃవచనం, సప్త కలశారాధన, నవ కలశారాధన అక్షిమోచనం క్షీరాధివాసం, జలాధివాసం, ప్రధాన శాంతి హోమాలు శాస్త్రృత్తంగా కనుల పండువగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం, నిర్వహించారు. పంచశయ్యాధివాసం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి ఆలయ ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, గ్రామస్థులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## బి ఎస్ ఎన్ ఎల్ వినియోగదారులకుమరింత చేరువులో సేవలుకొత్తపేట అంబాజీపేట

## మమ్మిడివరం మండపేట బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లు ప్రారంభం



**కొత్తపేట, మార్చి 13,(ప్రభాతవార్త)** శుక్రవారం ఉదయం స్థానిక కొత్తపేట బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజి లో గల ఓ సి ఎస్ సి కస్టమర్ సర్వీస్ సెంటర్స్ బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ ఐ టి ఎస్ పలివెల రాజు ప్రారంభించారు ఈ సందర్భంగా పి జి ఎం మాట్లాడుతూ కొత్తపేట అంబాజీపేట ముమ్మిడివరం మండపేట పరిసర ప్రాంత ప్రజల కోరిక మేరకు కస్టమర్ సర్వీస్ సెంటర్లు ఫ్రాంచైజి విశాలి ఎంటర్ప్రైజెస్ శిరిగినీడి ఆదినారాయణ కు కేటాయించినట్లు తెలిపారు బిఎస్ఎన్ఎల్ భాగస్వామ్యంతో మరిన్ని ఓసి ఎస్సీలను త్వరలో ప్రారంభిస్తామన్నారు ఆ మేరకు వినియోగదారులకు మరింత చేరువ అవుతామని తెలిపారు 4జి సేవలు ఫైబర్ నెట్ సేవలు అన్ని గ్రామాలకు విస్తరింప చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో డీ జీ ఎం లు సి హెచ్ విజయభాస్కర్ రెడ్డి శైలజ ఐ ఎఫ్ ఓ నాగరాజు ఏ జీ ఎం లు బమిడి పాటి శ్రీనివాసు శారద డీఈ లు ఆర్ ఫణీంద్ర పి నరసింహారావు ఎస్డిఈ లు నాగార్జున కృష్ణారావు వి శ్రీనివాసు పిఆర్వో వాసు తదితరులు పాల్గొన్నారు

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతి:



**జగ్గంపేట మార్చి 13 (ప్రభాతవార్త)** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు ఆధ్వర్యంలో తెలుగు విభాగం ప్రముఖ తెలుగు కవయిత్రి శ్రీమతి మొల్ల జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ మొల్ల చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించి తదుపరి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 13 న కవయత్రి మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిందామని తెలిపారు. తెలుగు సాహిత్యంలో ప్రముఖ కవయిత్రిగా నిలిచారని, ఆమె రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం పొందిందని తెలిపారు. మొల్ల తన సాహిత్యంతో మహిళల ప్రతిభను ప్రపందానికి పరిచయం చేసిన గొప్ప కవయిత్రి అని విద్యార్థులకు తెలియజేశారు. మొల్ల రామాయణం ఆరు కాండాలలో 871 పద్యాలతో కూడుకున్నదని, ఈ కావ్యాన్ని మొల్ల కేవలం 5 రోజులలో రాసిందని ప్రతీతి, అని విద్యార్థులకు తెలియజేశారు.తదుపరి తెలుగు విభాగం అధ్యాపకురాలు డా.డి. సత్యలత మాట్లాడుతూ మొల్ల జీవిత విశేషాలు, ఆమె రచించిన మొల్ల రామాయణం తేట తెలుగులో, గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించేదిగా ఉంటుందని విద్యార్థులకు తెలియజేశారు. సాధారణ కుటుంబంలో జన్మించిన మొల్ల తన ప్రతిభతో తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచారని ఆమె చెప్పారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ బాలరాజు , ఐ. క్యూ.ఏ, సి కో–ఆర్డినేటర్ డా. పి .వి.వి. సత్యా నారాయణ , ఆధ్యాపకులు ఇతర అధ్యపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొల్ల రామాయణం తెలుగుభాష వారికి ఒక వరం - జేసీ నిశాంతి



**అమలాపురం కలెక్టరేట్, మార్చి 13 (ప్రభాత వార్త)** సంస్కృతం భాషలో వాల్మీకి మహర్షి రచించిన రామాయణ కావ్య గ్రంథాన్ని తేనెలొలికే అచ్చమైన తెలుగు భాషలో రచించిన అఖండ ఖ్యాతి మహా కవయిత్రి మొల్లమాంబకే దక్కుతుందని జిల్లా సంయుక్త కలెక్టర్ టి నిశాంతి పేర్కొన్నారు శుక్రవారం కవయిత్రి ఆత్కూరి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని జిల్లా వెనుకడిన తరగతుల సంక్షేమ అధికారి వారి ఆధ్వర్యంలో కవయిత్రి ఆత్కూరి కవయిత్రి ఆత్కూరి మొల్లమాంబ జయంతిని ప్రతి సంవత్సరం మార్చి 13 న రాష్ట్ర పండుగగా జరుపుకుంటారన్నారు. చిత్రపటానికి పూలమాలలు అలంకరించి పుష్ప గుచ్చాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ మొట్టమొదటి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల (మొల్ల మాంబ) జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా మార్చి 13న ఘనంగా నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు.16వ శతాబ్దానికి చెందిన ఈమె కడప జిల్లా గోపవరంలో జన్మించారన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి వారని ప్రసిద్ధి అన్నారు. బీసీ ఫైనాన్స్ కార్పొ రేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి మాట్లాడుతూ మొల్లమాంబ కడప జిల్లా గోపవరంలో నిరుపేద కుమ్మరి వృత్తిదారుడైన కేశవ శెట్టి ఇంట్లో 14 వ శతాబ్దంలో జీవించినట్టు చారిత్రిక ఆధారాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ జి మమ్మీ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు, శాలివాహన సంఘ ప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులు కలెక్టరేట్ పరిపాలన అధికారి కె కాశీ విశ్వేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది భరత్ తదితరలు పాల్గొన్నారు

## స్వర్ణ గ్రామ.. స్వర్ణ వార్డు సామర్థ్యాభివృద్ధిపై శిక్షణ



**రాజవొమ్మంగి, మార్చి 13, ప్రభాతవార్త** శుక్రవారం రాజవొమ్మంగి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు అధ్యక్షతన సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్ కు స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు పై ఒక్కరోజు సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు అధ్యక్షతన రంపచోడవరం ప్రాజెక్ట్ మానేజ్మెంట్ యూనిట్ వారు నిర్వహించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా, ప్రజలకు అత్యంత కీలకమైన ఎల్. ఆర్. బి. డి. ఎస్, రైస్ కార్డులు అంశాలకు సంబంధించిన ప్రాసెస్ విధానం, అప్లికేషన్ స్వీకరణ విధానం, ఆమోదం, తిరస్కరణకు గల కారణాలు వంటి అంశాలపై ఎం. సంధ్య వివరించారు. మహిళలు, కుటుంబ సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం యొక్క ఉద్దేశ్యం, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక విధాన అంశాలపై ఏ. పి. ఐ. ఓ.పీ. చంద్రకళ సమగ్ర అవగాహన కల్పించారు. ఆధార్ కార్డు ప్రాముఖ్యత, కొత్త నమోదు విధానం, డెమోగ్రాఫిక్, బయోమెట్రిక్ అప్డేట్ ప్రక్రియలు, అలాగే సాధారణంగా ఎదురయ్యే లోపాల్లో వాటికి అనుసరించాల్సిన పరిష్కార మార్గాలపై ఏ. పి. ఐ. ఓ. ఆర్. మోహన్ రావు సిబ్బందికి ప్రయోగిక శిక్షణ అందించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ యాదగిరేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పై జరిగిన ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం.



**కడియం, మార్చి 13 (ప్రభాతవార్త)** కడియం మండలం బుర్రిలంక జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వేమగిరి కి చెందిన వ్యక్తి రోడ్డు మృతి చెందాడు. కడియం సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం కడియం మండలం బుర్రిలంక జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేమగిరి గ్రామానికి చెందిన మద్దిరెడ్డి కొండలరావు మృతి చెందాడన్నారు. చొప్పెల్ల నుండి వేమగిరి వైపు ఇటుకల లోడు గల మినీ వ్యాన్ తో వెళుతుండగా బుర్రిలంక జంక్షన్ వద్ద సైకిల్ పై వెళ్తున్న వ్యక్తి అడ్డు రావడంతో ఆకస్మికంగా బ్రేకులు వేయడం వల్ల వ్యాను తిరగబడి ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ద్వారా తెలిసిందన్నారు. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నామన్నారు. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ కొండలరావు అక్కడికక్కడే మృతి చెందారని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ హాస్పటల్ కి తరలించినట్లు సీఐ తెలిపారు . ఈ ప్రమాదాన్ని ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు

## అక్షరాంధ్ర ఫైనల్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించాలి

**రావులపాలెం, మార్చి 13 (ప్రభాతవార్త) :** రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంగన్వాడీ టీచర్లు, వివోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పరీక్షల ఇన్విజిలేటర్లు, సూపర్వైజర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సమావేశం నిర్వహించారు. రాబోయే మార్చి 15, 2026న నిర్వహించనున్న అక్షరాంధ్ర ఫైనల్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి విధానాలపై పలు సూచనలు చేశారు.పరీక్షల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ అమరనాథ్, ఏపీఓ కవిత, ఏపీఎం విజయ్ పాల్గొన్నారు.



## జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం.

### - ముద్రగడ జమ్మి పిలుపు.



**కడియం ,మార్చి 13 (ప్రభాతవార్త)** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని జన సైనికులకు కడియం మండల జనసేన అధ్యక్షులు ముద్రగడ జమ్మి పిలుపునిచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా స్థానిక ఎన్నికల్లో జనసేన క్యాడర్ సత్తా చాటిన విషయం అందరికీ విదితమే అన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కూడా జనసేన విజయబావుట ఎగురవేస్తుందని పేర్కొన్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నిజాయితీ, నిబద్ధతతో రాష్ట్ర ప్రభుత్వాన్ని ముందుకు కొనసాగిస్తున్నారని అధినేత బాటలో మనమంతా సైనికుల్లా పని చేద్దామన్నారు. పవన్ కళ్యాణ్ కు నిజమైన వారసునిగా మన రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ అందరి నోట శభాష్ అనిపించుకుంటూ స్వపరిపాలన కొనసాగిస్తున్నారని వెల్లడించారు. కడియపులంకలో కేంద్ర మంత్రిగా మెగాస్టార్ చిరంజీవి శంకుస్థాపన చేసిన అభివృద్ధి కార్యక్రమాన్ని దుర్గేష్ కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్ర రాజకీయాలలో జనసేన సత్తా చాటిందని అందుకు జన సైనికుల త్యాగం ఎంతో ఉందని జమ్మి అన్నారు. అదే పంథాతో,భవిష్యత్తు రాజకీయాలను కూడా పవన్ కళ్యాణ్ శాసిస్తారు అనడానికి ఎలాంటి సందేహం లేదన్నారు. రేపు కడియం లో జరగబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి జనసేన నాయకులు,కార్యకర్తలు,పవన్ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఉద్ఘాటించారు.

## తెలుగు సాహితీ వనంలో మొల్లమాంబ అపురూపమైన కవయిత్రి..



**అంబాజీపేట, మార్చి 13, (ప్రభాతవార్త):**తెలుగు సాహితీ వనంలో మొల్లమాంబ ఒక అపురూపమైన కవయిత్రి అని, వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణంను సరళమైన తెలుగు భాషలో అనువదించి, "మొల్ల రామాయణం" గా అజరామరమైన కీర్తి గడించారని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, నియోజవర్గ టిడిపి కో–కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, ఇరిగేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ లు అన్నారు.కోనసీమ కుమ్మరి,శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాచవరంలోని కుమ్మరి, శాలివాహన సంక్షేమ సంఘ భవనంలో తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ 587వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి ఆధ్వర్యంలో మొల్లమాంబ విగ్రహానికి టిడిపి,జనసేన,బిజెపి,వైసిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.రాష్ట్ర ప్రభుత్వం కవయిత్రి మొల్ల మాంబ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడంతో కుమ్మరి, శాలివాహనులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా సంఘం అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం సమకూర్చిన చీరలను మహిళలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి,బిజెపి మండల శాఖ అధ్యక్షుడు కురసా ఆంజనేయులు, నాయకులు గన్నవరపు శ్రీనివాసరావు, పీకే రావు, కొర్లపాటి కోటబాబు, విత్తనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్, పేరి శ్రీను,మాచవరపు శివన్నారాయణ, దొమ్మేటి వినోద్ కుమార్, నెల్లి వెంకటరమణ, ములపర్తి మోహన్రావు,కుమ్మరి శాలివాహనులు,కుమ్మరి ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి మాధురి విద్యాలయాల చైర్మన్ కడారి తమ్మయ్య నాయుడు



**శంఖవరం, మార్చి 13, ప్రభాతవార్త** పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మాధురి విద్యాలయాల చైర్మన్ కడారి తమ్మయ్య నాయుడు పేర్కొన్నారు.గొల్లప్రోలు శంకవరం మండలాల్లో గల మాధురి విద్యాలయాల్లో 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల ఫేర్వెల్ వీరభద్ర ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాలయాల చైర్మన్ నాయుడు మాట్లాడుతూ పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని , విద్యార్థులందరూ చక్కటి ప్రణాళికతో విద్యను అభ్యసించి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులతో సాధించిన విజయస్ఫూర్తిని కొనసాగించి జీవితంలో ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని కోరారు. అధ్యాపక సిబ్బంది తల్లిదండ్రులు నిరంతరం విద్యార్థుల శ్రేయోభిలాషులని వారిని ఎప్పుడు గౌరవించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిట్లను అందజేశారు . అనంతరం ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు చిరు సత్కారం చేపట్టారు. విద్యార్థుల ఆలపించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముందుగా డైరెక్టర్ సీతాదేవి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ అడపా ఆదినారాయణ మాధవి తెలుగు పండిట్ నాగేశ్వరరావు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

మరిన్ని వార్తలు 6లో